ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక

5-5-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు






మిస్ బెట్టిస్లేడ్






డైవింగ్ ప్రదర్శనం

మిస్ బెట్టిస్లేడ్ అను నామె ఈతపందెముల లోనూ, ఎత్తునుండి నీటిలో, దుముకుటలోనూ మంచి విజ్ఞానము నేర్పు, చాకచక్యములు చూపించుట లోనూ, ప్రపంచ ప్రశస్తిగాంచినది. "జానీ"అను ఈతగానితో కలిసి ఈమె ప్రపంచ పర్యటనములో తన విద్యను ప్రదర్శించుకొనుచు, ఈ మధ్య మద్రాసు వచ్చినది. మద్రాసు మెరినా స్విమ్మింగ్ పూల్‌లో బెట్టిస్లేడ్ "డైవింగ్" (ఎత్తునుండి నీటిలో దూకుటలో) అనేక భంగిమములు, విధానములు ప్రదర్శించినది. ఆ సమయమున ఆంధ్రపత్రిక ఛాయాచిత్ర కారుడు తీసిన, (Action-Pictures) డైవింగ్ భంగిమముల ఛాయాచిత్రములు.









ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)


సంపుటము 41


సంచిక 36

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర వైశాఖ బహుళ త్రయోదశి బుధవారము

ఉత్తరభాగమందలి వరాహావతార విన్యాసములు





దక్షిణప్రాకార మందలి మరి కొన్ని విన్యాసములు.

సింహాచల దేవాలయ ఉత్తర, దక్షిణ ప్రాకారములు



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మేనెల 25-వ తేది బుధవారము

ఎ. ఐ. సి. సి. ఆమోదం

లండన్ ఒడంబడికను సమర్థించుచు ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ డెరాడూన్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్‌సంఘ సమావేశమునందుచేసిన దీర్ఘప్రసంగము, కామన్వెల్తునందుండుటవలన భారతదేశమునకు ప్రాప్తించగల ప్రయోజనములను అసందిగ్ధముగ వివరించెను. రాజకీయముగగాని, సైనికముగగాని భారతదేశము బ్రిటన్‌కుగాని, ఇతర కామన్వెల్తు రాజ్యములకుగాని, ఈ ఒడంబడిక ఫలితముగ, ఏ విధముగను కట్టుబడియుండ నవసరము లేదని ప్రధానమంత్రి దీర్ఘ ప్రసంగము, అధికార తీర్మానమును ప్రతిపాదించుచు డాక్టర్ రాజేంద్రప్రసాద్ వివరణ విస్పష్టముచేసెను. కామన్వెల్తు, పశ్చిమయూరపుసమాఖ్య వంటిది గాదు; ఉత్తర అట్లాంటిక్ - రక్షణఒడంబడికకు, కామన్వెల్తు ప్రధానమంత్రుల ఒప్పందమునకు పోలికేలేదు. లండన్ ఒడంబడిక, కామన్వెల్తు రాజ్యముల ఆర్థిక, వ్యాపారవిషయములకు మాత్రమే సంబంధించియున్నదని, లండన్ ఒడంబడికపై బ్రిటిష్‌పత్రికలు చేసిన, దీర్ఘ వ్యాఖ్యానములు సూచించుచున్నవి.

ఆర్థిక, వ్యాపార విషయములందు, ప్రత్యేక ఒడంబడికలు అవసరములేకయే కామన్వెల్తురాజ్యములు పరస్పరం సహకరించుటకు, ఈ ఒడంబడిక అవకాశ మొసగుచున్నది. భారతదేశము తన రాజకీయ స్వాతంత్ర్యమును సుస్థిరము చేసికొనుటకు, ఆర్థికముగ అభివృద్ధి కావలసియున్నది. ప్రజల జీవితప్రమాణము హెచ్చి ప్రజల జీవితావసరములు తీరగల పరిస్థితు లేర్పడినగాని దేశమునందు శాంతి ఏర్పడదు. ప్రభుత్వము శాంతిని స్థాపింపగలిగినను, ఆ శాంతి స్థిరముగ నుండజాలదు. వ్యావసాయిక పదార్థములు అధికముగ పండి, పారిశ్రామికవస్తువులు అధికముగ ఉత్పత్తియైనగాని నేటిఆర్థికదుస్థితి తొలగి, ప్రజల సాధారణ జీవితావసరములు తీరజాలవు. భారతదేశము కేవలము స్వీయశక్తిపై ఆధారపడి ఈ రెంటిని సాధింపజాలదని గత రెండుసంవత్సరముల అనుభవము స్పష్టముచేసెను. కనుకనే విదేశముల ఆర్థిక సహాయమును భారత ప్రభుత్వము అర్థింపవలసి వచ్చెను.

లండన్ ఒడంబడికను హర్షించుచు రాజేంద్రప్రసాద్ గారు ప్రతిపాదించిన తీర్మానమును సమర్థించుచు అఖిలభారత కాంగ్రెస్ సంఘసభ్యులు చేసిన ప్రసంగములు స్థూలముగ ఈ భావములనే వెల్లడించె నని చెప్పవచ్చును. తీర్మానమును ప్రతికూలించిన వారి ప్రసంగములను పరిశీలించిన, వారు యథార్థపరిస్థితులను గమనించినట్లు గాని దేశావసరముల గ్రహించినట్లుగాని కన్పించదు. కేవలము 1930 వ సంవత్సరములో కాంగ్రెస్ మహాసభ ఆమోదించిన సంపూర్ణస్వాతంత్ర్య తీర్మానము నాధారము చేసికొనియే వీరు లండన్ ఒడంబడికను విమర్శించినట్లు కన్పించును. రాజ్యాంగపరిషత్తు లక్ష్య తీర్మానమున కీ ఒప్పందము విరుద్ధమని విమర్శించువారికి రాజ్యాంగ పరిషత్తు ఒడంబడిక నామోదించుచు మే 17వ తేదీన చేసినతీర్మానమే సమాధాన మొసగుచున్నది.

కామన్వెల్తు ఒడంబడిక వలన దేశ రాజకీయ స్వాతంత్ర్యము ఏ మాత్రము పరిమితము గాదు. కొంతవరకు ఆర్థిక స్వాతంత్ర్యము పరిమితము కావచ్చును. కామన్వెల్తుకు చెందిన రాజ్యములకే వ్యాపారవిషయమున ఎక్కువ సౌకర్యముల నివ్వవలసియుండును. ఇతర కామన్వెల్తు రాజ్యములందు భారత దేశమునకును అట్టి సౌకర్యములు లభింపగలవు. పండిట్ నెహ్రూ చెప్పినట్లు లండన్ ఒడంబడిక భారతదేశమునకు, కాంగ్రెస్‌కు అరుచికరమైనది గాదు. ఇతరులకు మాత్ర మిది సంకటముగ నుండవచ్చును. బర్మాలోవలెనే భారతదేశమునందును అరాచక చర్యలను ప్రోత్సహించి రాజ్యాధికారమును కైవసము చేసికొన దలచినవారికి మాత్రము లండన్ ఒడంబడిక తీవ్ర ఆశాభంగమును కల్గించి యుండును. నూతన రాజ్యాంగమును అనుసరించి జరుగు ఎన్నికలలో ఈ వర్గమువారు కాంగ్రెస్‌ను "అల్లరిపాలు" చేయుటకు ఈ ఒడంబడికను ఉపయోగింపవచ్చును. కనుక కాంగ్రెస్‌వాదులు, కాంగ్రెస్‌సంఘములుకూడ రాగల ప్రమాదమును గమనించి ఇప్పటినుండియు అట్టి దుష్ప్రచారమును ఎదుర్కొనుటకు అవసరమైన చర్యలను తీసికొనవలసియుండును. అఖిలభారత కాంగ్రెస్‌సంఘ నిర్ణయమే ప్రజలకు, ఇతర విమర్శకులకు కూడ సరియైన సమాధాన మొసగినది. అట్టి సముచితనిర్ణయము చేసినందుకు అఖిలభారత కాంగ్రెస్ సంఘసభ్యులు అభినందనీయులు.

—

ఆత్మ రక్షణ

"నేను కమ్యూనిజమును అత్యధికముగ ప్రేమింతును. ఆ ఆశయములకు నే నెన్నడునూ వ్యతిరేకిని కాను. కాని భారతకమ్యూనిస్టుపార్టీ వారు జాతీయ వ్యతిరేకపథములలోనడచుచు అరాచక చర్యలతో సాయుధవిప్లవములకు కూడ దిగుచు, దేశమున బీభత్స మొనరింప పూనినారు. వారి నొకకంట కనిపెట్టక తప్పదు" అని ప్రధాని పండిట్ నెహ్రూ ఎ. ఐ. సి. సి. సమావేశములో కమ్యూనిస్టులను గురించి చెప్పెను.

బర్మాప్రధాని థాకిన్‌నూ మంత్రివర్గమును గురించి విపులీకరించుచు, ప్రఖ్యాత విలేఖరి ఎడ్గార్ స్నో, "కమ్యూనిజం ఆదర్శము గాగలది యయ్యు స్వదేశములో కమ్యూనిస్టులను అణచవలసి వచ్చిన నవీన యువక ప్రభుత్వము"అని బర్మా ప్రభుత్వమును వర్ణించెను.

సామ్యవాద సూత్రములందు అధిక అభిమానము ఆదరము కల్గి, నూతనముగ స్వాతంత్ర్యమందిన ఈ యిరు దేశముల ప్రధానులు గూడ కమ్యూనిస్టుల నణచుటకై ఇంత ప్రబల యత్నములలోనుండుట వింతగాకనబడగలదు. నేటి ప్రపంచములో, కమ్యూనిస్టులు అధికారములో నున్నచోట నిరంకుశ పోలీసు రాజ్యబీభత్సమును, అధికారములో లేనిచోట అరాచక బీభత్సములను కల్పించుటయే కానవచ్చుచున్నది. వర్గద్వేషములు కాక వర్గసామరస్య మేర్పరచుకొనుట, ప్రాతిపదికగా ఏర్పడిన ఈ నూతన స్వాతంత్ర్య దేశములలోని ప్రభుత్వములు, వర్గద్వేషమే ప్రాతిపదికగా ఏర్పడ్డ కమ్యూనిస్టు పక్షములకు గిట్టలేదు. కేవలము, ప్రజాసత్వము లగు హక్కులకే కమ్యూనిస్టుల పోరాటములు ఉద్దేశింపబడియున్న, కరెన్ రాష్ట్రమున కట్టి సత్వములతో ప్రత్యేక పరిపాలనాధికారమును థాకిన్ నవాగ్దాన మొనర్చుటతో బర్మా అశుద్ధము నమసి యుండవలసినది. కా, ప్రభుత్వమును కూలద్రోసి రష్యా కమ్యూనిస్టుపాలన శ్రేణిలోనికి తమ దేశ ప్రభుత్వమును నడిపించుటయే బర్మన్ కమ్యూనిస్టుల ఆశయ మగుటచే, బర్మా స్థితిగతులు విషమించుచున్నవి.

బర్మా కమ్యూనిస్టు పార్టీలో ని ముఖ్యనాయకులలో భారతీయులు చాలమంది గలరు. అనగా బర్మాలో 'రష్యన్' కమ్యూనిజమును స్థాపించుకొనగానే, బర్మాసరిహద్దు లగు తూర్పు పాకిస్థాన్, బెంగాల్ దేశములు మొదలుగా ఈ ఖండము నంతటనూ అరాచకము చెలరేగగొట్టుట, అచటి నాయకులకు నిత్యకృత్యము కాగలదు.

కావుననే భారతదేశ మీ విషయములో నింత తొందరపడవలసి వచ్చినది. చైనా సరిహద్దున నున్న బర్మాను కమ్యూనిస్టురాజ్యముగ చేయ చైనా చేయూత నొసగు స్థితికి రాగలుగుటవలనే, స్వరక్షణార్థము కూడ, ఇండియా పాకిస్థానులు బర్మాకు అవసర సహాయము చేయవలసిన బాధ్యత యున్నది.

ఇండియా బర్మా ప్రభుత్వములు కమ్యూనిస్టు ప్రతికూలతలు, కాపిటలిస్టు సామ్రాజ్యదేశముల, "కమ్యూనిజం-ప్రాతికూల్యత"లు కావు. కరెన్లకు బ్రిటిష్ కాపిటలిస్టుల రహస్య సహాయ మందుచున్నది. ఆదర్శముల వదలి అధికారమే లక్ష్యములుగ చేసికొన్నవా రైరి గనుకనే, ప్రతిదేశమునను కమ్యూనిస్టులును, అభ్యుదయ నిరోధకు లగు సామ్రాజ్య ధనికవాదులును చేతులు కలుపుచునే యున్నారు.

నేటిప్రపంచ పురోగమనమున కనుకూలము లైనవి, అతివాద రహితమైన మాధ్యమిక ప్రజాస్వామ్య ప్రభుత్వములు. భారతదేశ మట్టి ప్రభుత్వమునే స్థాపించుకొన్నది. అట్టి ప్రభుత్వములే తన పరిసరముల ప్రబలునట్లు చూచుట, కేవల మితరుల వ్యవహారములో జోక్యము కలుగజేసికొనుట కాదు. ద్విధా విభక్తమైన అగ్రరాజ్యముల కూటమిలో ఒకవంక చేరి సోవియట్ విరోధము ప్రకటించుట కాదు. స్వగృహరక్షణకై, పొరుగు గృహమున మంటలను వెంటనే యార్పుకొన ప్రయత్నించుట. కామన్వెల్తు రాజ్యములు బర్మాకు చేయదలచిన సహాయము, అమెరికా చైనా కూమింగ్‌టాంగ్ పక్షమునకు చేయదలచిన సహాయమువంటిది కాదు. అందుచే, అనిశ్చితముగ, అనిర్ణీతముగ, అర్థమనస్కతతో సహాయమునకు పూనుకొన వీలులేదు. పాకిస్థాన్ భారత దేశములు, సునిశ్చిత విధానములో కామన్వెల్తు పక్షమున సంపూర్ణ సహాయమును బర్మాకు సమకూర్చుట, భారతపాకిస్థాన్ దేశములు తమ పురోభివృద్ధికి వలసిన ఆత్మరక్షణ నొనరించు కొనుటయే!

నవల:

నాతికొలిపి

వి.డి. ప్రసాదరావు

1

"అమ్మా! రైలువేళ అయింది. బండి తీసుకొచ్చాను. వెళ్తున్నాను. అబ్బీ! లోపలికి వచ్చి పెట్టే పరుపూ బండిలో పెట్టుకోవోయ్. ఏదమ్మా పెట్టె? శీనూ, పరుపుచుట్ట కట్టావురా—" అంటూ అడుగుల్లో ఇల్లంతా చుట్టి వేస్తూ రాఘవరావు, తందర బిందర చేస్తున్నాడు.

"అన్నయ్యా! ఈ తాడు చాలటంలేదురా! నవారుబద్దె ముడివెయ్యనా!"

"ఇంకా కట్టలేదట్రా! ఏంపనులు చేస్తార్రా! ముందు పోయి ఆ తాడేదో ఏడ్చుకురా! ఇంత వదులుగా చుట్టావేం - హు!" అంటూ విసుగుకొని పరుపుచుట్ట విప్పి మళ్లీ గట్టిగా చుట్టున్నాడు.

శీను మొగం చిన్నబుచ్చుకొంటూనే వంటింట్లోకి పోయి, "అమ్మా, కత్తిపీటేదే?" అంటూ కత్తిపీట పుచ్చుకొని వస్తున్నాడు.

తల్లి ఏవో సర్దుతూన్న అడావుడిలో ఉండి "దేనికిరా కత్తిపీట?" అని యాదాలాపంగానే అడిగింది.

"పరుపుతాడు చాలలేదమ్మా! మంచంనవారు ముక్క కోసేందుకు. పాతదేగా!" అంటూ శీను మంచందగ్గరకు వెళ్లాడు.

"ఒరేయ్, నవారు కొయ్యట మేమిట్రా! సామానుగదిలో మూల చాంతాడుముక్క ఉందేమో చూడు" అంటూ టిఫిన్ కారియర్ బిగించటం పూర్తిచేస్తూ, తల్లి తెలివి తెచ్చుకొని కేకపెట్టింది.

"పక్కి అయిపోయిన నవారు తెంపితే ఏంపోయిందో మరీని! శీనూ, పోనీ ఆ తాడు దొరికిందిరా?" అని పరుపుచుట్ట వదులు కాకుండా నొక్కిపట్టి ఉంచిన విసుగుతో రాఘవరావు వేశాడు.

శీను మాట్లాడకుండా వెదుకుతూ చివరికి తాడు తెచ్చాడు.

చిన్ని చెల్లెలు సావిత్రి లోపలికి పరుగెత్తుకు వచ్చి.

"అన్నయ్యా, బండిఅబ్బాయి పిలుస్తున్నాడు!" అని శీనువంకకు తిరిగి, "పొగరుమోతు ఎద్దులా గుందిరా, బండిచక్రంమీదనుంచి ఎక్కబోతోంటే విదిలించేస్తోంది."

"ఇంకా మొగంపళ్లు పగిలాయి కాదు. అక్కడి కెందు కేడిచావ్? పరుపుచుట్టలో నా మాసిన బట్టలన్నీ పడేశావా!" అంటూ చెల్లెలి మీద ఉరిమాడు రాఘవరావు.

చెల్లెలు చిన్నబుచ్చుకొని "అన్నీ వేశాను. గదిలో మంచంమీద తెల్లలాగూమాత్రం ఇవతల ఉంచాను—'తొడుక్కుంటానేమో' అన్నావని."

"ఘనకార్యం చేశావు! ఇప్పుడీ పరుపంతా మళ్లీ విప్పివేడవాలి. ముందిల్లా తీసుకురా - ఈ పక్కనుంచి కుక్కుతాను."

చెల్లెలు చిన్న అడుగులతో లోపలికి వెళ్లి లాగూ తెచ్చి అందిచ్చి చిన్నబోయి అక్కడ నిల్చోక, ఎద్దును చూడటానికి మళ్లీ బైటికి వెళ్లింది.

ఆ మొగాలు ఏవీ చూసేందుకు తీరిక కల్గటం లేదు.

తల్లి టిఫిన్ కారియర్, రెండు పట్టుబట్టలు చుట్టిన అరుపొట్లాలూ తెచ్చింది.

"పరుపు అప్పుడే కట్టేశావుట్రా? పెట్టె ఏదీ, తాళంచెవి ఇల్లా తే."

"అబ్బ! అవన్నీ ఇప్పుడు పెట్టకమ్మా. ఇప్పటికే పెట్టెమూత తెరుస్తే పట్టకుండా ఉంది. కందిపొడుంపొట్లాలూ, పక్కల పొట్లాలూ,

౧

నా మొహంపొట్లాలూ అన్నీ పెట్టావు. ఇంకా ఈ పొట్లా లేమిటి?"

"నే సర్దుతానుగా నీ కెందుకు ఇయ్యరా!"

"శీనూ! తాళంచెవి ఏదిరా?" అంటూ రుసరుసలాడుతూ తన జేబులు వెదుకుతున్నాడు.

"ఇందాక నీకే ఇచ్చానురా అన్నయ్యా; చొక్కాజేబులో పడేసుకొన్నావ్."

చొక్కాజేబులో కాగితాలు బైటికి తీయటంలో తాళంచెవి క్రింద పడింది.

"అదేమిట్రా, అట్లా అజాగ్రత్తగా పెట్టుకొన్నావ్? మొలత్రాడులో కట్టుకో. శీనూ, చిన్నదారం తేరా!"

"అబ్బ! ఇప్పుడవేం వద్దమ్మా!"

తల్లి పొట్లాలన్నీ పెట్టెలో కుక్కి బలవంతంగా మూత నొక్కి తాళం వేసింది. "అబ్బాయి, అందులో పూరీలూ, మైసూరుపాకూ పెట్టాను. అందరికీ పెట్టి తగలెయ్యక, మూడురోజులూ తిండి ఉండదట. జాగ్రత్తగా తిను".

'మరీ అంత ఒంట్రెత్తుతన మేమిటో?' అని అనుకున్నాడు లోలోపల. తాళంచెవికి దారం కట్టి, అతనిచేతి కందీయకుండా మొలత్రాడులో కట్టబోయింది తల్లి.

ఛర్రున తీసుకొని తనే మొలత్రాడులో కట్టుకొంటూ "బండి అబ్బాయ్" అని కేక వేశాడు.

బండిఅబ్బి తాగుతున్న చుట్ట వీధిగుమ్మాని కానించి, వీధిలోకి ఉమ్మేస్తూ లోపలికి వచ్చాడు.

"టిఫిన్ కారియర్ మడిగా నువ్వే పట్టుకెళ్లు నాయనా! - భోజనపదార్థాలున్నాయాయెను" అంటూ తల్లి కారియర్ చేతికి అందించింది.

"ఇక్కడ ఒకచోట పుచ్చుకొంటే అయిందిగావను" అని, దూకుడుగా బండిలోకి కదిలాడు. తల్లీ తమ్ముడూ చెల్లెలూ వీధిగుమ్మంలో నుల్చున్నారు. చెల్లెలు తల్లి నానుకొని చేతులు వెనుకకు అమ్మచుట్టూ చుట్టి నిల్చుంది. శీను కింది గుమ్మానికి దిగి గడ్డిపరక నములుతూ నుల్చున్నాడు.

తల్లి సన్నగా పైటచెరగు కంటికి కొత్తుకొంటూంది.

'ఈ కాస్తకు ఏడు పెందుకు?' అనుకొన్నాడే గాని, గుండెల్లో ఏదో ఒక చురుకు తగిలి నట్లయి, మొగం దించుకొన్నాడు.

"పోనీనాండి అబ్బాయిగారూ!" బండిఅతను బండి తిప్పుకొన్నాడు.

తల్లి కన్నులు తుడుచుకొంది. చెల్లెలూ తమ్ముడూ, అల్లాగే చూస్తూ నిలుచున్నారు.

"వెళ్లొస్తానమ్మా!" అంటూ, మొగం బండి మనిషివైపు లోపలికి త్రిప్పి "పోనియ్యవోయ్" అన్నాడు.

"వెళ్ళగానే ఉత్తరం రాయి నాయనా! భోజనం అవీ జాగ్రత్త. మళ్ళీ వెంటనే సెలవులకు వచ్చేయ్. ఉత్తరాలూ తప్పకుండా రాయి" అంటూన్న తల్లిమాటలు వెనక్కుపడిపోతున్నాయి. ఎద్దు, తోక మెలిపిన ఉద్ధృతానికి ముందు ఒకసారి ఝుర్రు మనిపించి మళ్ళీ దవడలు నెమరేస్తూ మామూలు మందగమనంలో పోతూంది.

సందుమలుపు దగ్గర కొని తల ఎత్తలేకపోయాడు. తల్లీ, చెల్లెలూ తమ్ముడూ అల్లాగే చిత్రాలలాగే నుల్చున్నారు. ఆ చిత్రం మనస్సులో కదిలేలోపలే బండి మలుపు తిరిగింది.

బండిఅబ్బి, చుట్ట కాలుస్తూ మధ్యమధ్య ఎద్దును హెచ్చరిస్తూ, త్రోవలో ఎరిగున్న మనుష్యులతో పని ఉండి కలుసుకొన్నట్లు పనులు మాట్లాడుతూ బండి తోలుతున్నాడు.

ఇంతలో శీను వెనుకనుంచి రొజుకొంటూ పరుగెత్తుకొచ్చాడు.

"అన్నయ్యా, ఈ మరచెంబు దగ్గర ఉంచుకోమంది అమ్మ."

ఇందాకటి అంత చిరాకు లేదు. "ఈ విడి వస్తువులన్నీ రైలులో చూసుకోనేది ఎల్లాగుర్రా. ఏన్నీ అన్నీ మరీ హంగామా చేస్తారు" అంటూనే మరచెంబు అందుకుని లోపల పెట్టుకొన్నాడు.

శీను బండి చాపక్రిందనుంచి గడ్డిపరక లాగి నములుతూ, అన్నయ్య కేసి చూడకుండా, ఇటూ అటూ చూస్తూ వెంట నడిచి వస్తున్నాడు.

"ఎండలో ఎందుకురా ఇంతదూరం! ఇంక ఇంటికి పో!"

"వెళ్తాలే!" అంటూ మరో పదడుగులు నడిచి "ఉంటారా అన్నయ్యా" అని శీను వెనక్కి తిరిగాడు.

శీను వెనక్కి తిరిగి ఇంటికి పోతుంటే ఏదో తళుకు తట్టినట్లయి, మందస్వరంతో "శీనూ!" అని వెనక్కి పిలిచాడు.

"ఈ అర్థరూపాయి తీసి కెళ్ళి నువ్వో పావలా చెల్లాయి ఓ పావలా తీసికోండి."

శీను తలవంచి "ఎందుకులేరా, వద్దు" అన్నాడు.

"తీసికో" అని తమ్ముడుమీదికి పడేశాడు డబ్బు. మట్టిలో పడ్డ డబ్బు తీసుకొని శీను "వెళ్లివస్తానన్నయ్యా" అంటూ వెనక్కి వెళ్లాడు.

"అబ్బీ, కోర్టుమీదిగా పోనీ, బండి."

"అది సుట్టుకాదయ్యా! ఇటు పోనిత్తాగా."

"కాదు, నాన్నగార్ని కలుసుకోవాలి-"

"ఇంకా తేమానం ఉండాదీ! మీ రిలాగంటే బండి అందేది ఎల్లా?"

"ఇంకా కొద్దిగా టైముందిలే అటు అడ్డదార్ని పోదాం."

బండిఅతని మాటలో తొందర, బండి తోలటంలో ఎక్కడా లేదు. గూడుకి చేర్లబడి - 'రంగం' పాట పాడుకుంటూ కోర్టుకేసి బండిని మలిపాడు. ఎద్దే నడుస్తూంది.

కోర్టులో గుమాస్తాల గదిలో తండ్రి కనబడలేదు. ఎరిగున్న గుమాస్తా ఒకరు తమలపాకులు నములుతూ కుర్చీకి చేరబడి కూర్చున్నాడు.

"ఏమయ్యోవ్ - కాశీ వెళ్తున్నావటగా - ఇప్పుడేనా ప్రయాణం?"

"ఔనండి. మానాన్నగారు ఏరీ!"

పక్కగుమాస్తాకూడా తలెత్తాడు. "కాశీయే; ఎవరబ్బాయ్."

"సూరయ్యగారి అబ్బాయిలే- ఇప్పుడక్కడ చదివేది ఏమిటయ్యా"

"మొన్న ఇంటరు ప్యాసయినతను ఇతనేనా? అబ్బో కాశీ వెళ్తున్నాడే! ఇక్కడ చదువులు వంట బట్టటంలేదా ఏమిటి?"

రాఘవరావుకి ఉడుకుమోతుతనం వచ్చింది. కొత్తఆయనవంక చూడకుండా, మొదటి గుమాస్తాతో-"ఫార్మసూటికల్ అండీ. రైలు టైమయింది, వెళ్లాలి. నాన్నగారెక్కడున్నారు?"

"ఫార్మసూటికల్ అంటే! ఏవో అన్నీ కొత్త చదువులుగా ఉన్నాయండీ. వీళ్లు ఏం చదివి ఏం వెలగబెట్తారో!"

కొత్తఆయన అందుకున్నాడు.

"వాళ్లకేం లెండి. సూరయ్యగారు అల్లాంటి చదువులు చదివించకపోతే మనం చదివించగలమా?"

వాళ్ల జీతాలూ, తన తండ్రి జీతాలకంటే, మూడో, ఐదో, తేడాలో ఉంటాయి.

ఉడుకుమోతుతనంతో వ్యంగ్యాలు విసురుతున్న వాళ్ల మాటలకు అక్కడ నిలుచుకునే నిలకడ మరీ తగ్గుతూంది. మళ్ళీ అడిగాడు "నాన్నగారు ఎక్కడున్నారండీ?"

"శిరద్దార్ పిలిపించాడు గాబోలు, వస్తారు కూర్చో."

"శిరద్దార్ ఓ పట్టాన తెమలనిస్తాడయ్యా! రైలుకెళ్తూన్నాడు గాబోలు అతను. ఆ గదిలో ఉంటాడు వెళ్లవోయి. పని ఉందని వెళ్తే మింగుతాడా ఏమిటి?"

నెమ్మదిగా శిరద్దారు గదిగుమ్మంలోకి కదిలి వెళ్లాడు.

కుర్చీలో ఉన్న మనిషిప్రక్కను, తండ్రి నమ్రతతో వంగి నిల్చుని, తత్తరపాటుతో చేతులో పట్టుకున్న కాగితాల కట్టలు తిరగేస్తూ మనవి చేసుకొంటున్నట్లుగా దీనంగా నిల్చున్నాడు. కళ్లజోడు ముక్కుకొనకు జారిపోతూంది. తలపాగా, మెడచుట్టూ జారినట్లు చేరి చుట్టలు చుట్టుకొని ఉంది. తండ్రి కాగితాలు త్రిప్పుతూనే ఒక చేత్తో గోచీ సర్దుకొంటున్నాడు.

శిరద్దార్, బొమముడితో, అటువేపే చూడకుండా, రెండోవైపు బల్లమీద పరిచి ఉన్న కాగితాలమీద ఎర్రసిరాగీతలు పెడుతూ, ఏదో కసిరి అడుగుతున్నాడు.

తన తండ్రిని ఇంటివద్దమాత్రమే ఎరుగును. నిత్యం సింహంలాగ గర్జిస్తూ నిటారుగా కనబడే తండ్రి, ఇక్కడ వంగిపోయి పిల్లికూనలాగ నసుగుతూ ఉండటం చూస్తే, విపరీతమైన దెబ్బ తగిలినట్లయి మూగగా నిల్చున్నాడు.

శిరద్దార్ తలెత్తి, "ఎవరూ!" అని ఉరిమాడు.

తండ్రికూడా తలెత్తి చూసి, వస్తున్నా, పద మని సైగ చేశాడు.

ఐదునిమిషాలలో తండ్రి బయటికి వచ్చి "వెంకయ్యా" అని నౌకరును పిలిచాడు.

"అబ్బాయిగారితో రైలుకు వెళ్లరా" అని, "నేను స్టేషనులో కలుసుకొంటాను. నువ్వు పద" అని తనను సాగనంపి మళ్ళీ లోపలికి పోయాడు.

సామానులు బండీ దింపటంలో కొస్త చెయ్యందిచ్చిన ట్లిచ్చి "శిరద్దార్ గారు పిలుస్తూంటారు" అంటూ నౌకరు వెనక్కి వెళ్లిపోయాడు.

తండ్రి, ప్లాటుఫారంమీదికి వచ్చేటప్పటికి రైలు వచ్చేరెక్క వాలింది. తండ్రి ఒకనిమిషం అటూయిటూ చూసి, "సామానులన్నీ లెఖ్ఖెట్టుకొన్నావురా, జాగ్రత్త! నౌకరేడీ, వెళ్ళిపోయాడా! వెధవలు అవసరానికి ఎప్పుడూ ఇంతే. టిక్కెట్టు బెజవాడకే కొన్నావా? డబ్బు ఎక్కడ పెట్టావ్?"

"పర్సులో జేబులో పెట్టుకొన్నానండి!"

"అంత డబ్బూ జేబులో అజాగ్రత్తగా అల్లా ఉంచకు. టిక్కెట్టుకు కావలసింది పైన ఉంచుకొని, తక్కినది ట్రంకులో పెట్టు!"

ట్రంకు ఇప్పుడు తీస్తే మూతవెయ్యటం కష్టమని తండ్రితో అనటానికి ధైర్యం చాలలేదు. విసుగు చూపించకుండా దిగమ్రింగుకొని పెట్టె తెరిచాడు. పెట్టె మూసేలోపల రైలు వచ్చింది.

"ఇంకా తెమలలా! ఏం కుఱ్ఱాళ్లురా?" అంటున్నాడు తండ్రి.

పెట్టె అడావుడిగా తాళం వెయ్యగలిగాడు.

"ముందు రైలు ఎక్కు. ఈ పరుపుచుట్ట అందుకో. తలుపువైపు వద్దు, అవేపు పెట్టు."

తల్లిదగ్గర నసుగుడులో అరవీసమైనా నసగలేకపోయాడు. కిటికీలవైపు కూర్చోకుండా మధ్య బెంచీలమీదే చతికిలబడవలసి వచ్చింది.

"లోపలి జేబులో పర్సు జాగ్రత్త. ఇదిగో ఈ పిన్నీసు జేబుకుపెట్టు..."

ఎదురుగుండా కళ్లజోడు పెట్టుకొని కిటికీ దగ్గర కాలిమీద కాలేసుకు కూర్చున్న కుర్రవాడు, దాదాపు తన యీడువాడు, ముసిముసి

(16 వ పేజీ చూడుడు)

పక్షుల దేహవర్ణాలు - ప్రయోజనావసరాలు

శ్రీ వి. పాల్‌ప్రసాదరావు - శ్రీమతి హేమలతాజాన్

ఏ జాతి పక్షులను చూచినను, వానిలో మగపక్షికి ఆడపక్షికి రంగులో, పోకడలో భేదములు కానవచ్చుచునే యున్నవి. మగపక్షి సుస్పష్టమైన రంగులతో, ఆకర్షణీయమైన జుట్టు గలిగి, పొడవుగా, వంకరగా, రంగురంగులుగా, మెరపించు మనోరంజకములైన యీకలతో ఆడుపక్షి నాకర్షించుచున్నది. ఆడపక్షి రంగో యనిన, అది తన గ్రుడ్లమీద కూర్చుండ, విరోధి సునాయాసముగ గుర్తింపకుండునటుల, పరిసరముల రంగులో కలసిపోవు బూడిదరంగున నుండు యేర్పాటు కలిగియున్నది. కొన్ని ఆడపక్షులు ఇసుకరంగున, మట్టిరంగునకూడ నిందు వలననే ఉండును. మనదేశపు కౌజు లీరకములలోనివి. మగపిట్టకు, ఆడపిట్టకు ఒకేరంగుకల వంశములలో మగపక్షియే గుడ్లను పొదుగును. ఆడుపక్షి పచారుచేయును. ఎడారిలో వసించు పక్షులకు సమానపాయముగాన, దంపతు లిరువురు, ఇసుకరంగుననో, రాళ్లరంగుననో ఉందురు.

రంగు - పరిసరములు

పక్షులు కొన్ని ఆయా ఋతువుల కనుకూలించి వేరువేరు రంగుల యీడుపులను ధరించును. లూర్మిగన్ అను నొక పక్షి (యాడమగవికూడ) గ్రీష్మ శరదృతువులలో, గోధుమ లేక బూడిదఈకలు కలిగియుండును. హేమంతఋతువులో నా శీతలప్రదేశమున మంచు అధికముగ పడును గాన, పరిసరములు తెల్లగ నగుపడును. ముందు ఋతువుకు సరిపోయిన బూడిదరంగు యీడుపులనే ధరించిన సహజశత్రువు లవలీలగా గుర్తింపగలరేమో యనునటుల, పాతబూడిదఈకలను, వదలి, తెల్లఈకల ధరించి పరిసరములలో నదృశ్యతముగ లీన మౌను. ఒక శాస్త్రజ్ఞుడు పరిశీలనకై పై ప్రాంతములకు పోయెనట. రోజంతయు పరిశీలించి రాత్రికి యిల్లు చేరెను. ఆ రాత్రి క్రొత్త మంచు పడలేదు. యీదరగాలియు లేదు. ఉదయముననే ఆయన లేచి, నిన్నపోయిన మార్గమువనే పోవుదమని యడుగుజాడలకొరకు వెదగ నవి శీఘ్రముగ కనుపింపలేదు: మంచు, గాలి రాత్రంతయు లేనందున యడుగుజాడ లెటుల మాయమగు నని అనుమానించి జాగ్రత్తగా పరిశీలింప ఆ యడుగుజాడలలో తెల్లటి లూర్మిగానులు పరుండి, నల్లటి చిన్న గుడ్లు మిటకరించుట గ్రహించెను. పరిసరములలో నవి యంతగా లీనమౌటకు వీలున్నది. అది ఏమి వింతయోగాని, యీ పక్షుల సహజశత్రువులైన నక్కలు నూ రంగుమార్చి యీ హేమంతఋతువుకు తగిన తెల్లబొచ్చునే పెంచును. టెర్న అనుపక్షి రెక్కలు బూడిదరంగు, పై యీకలు నలుపు, క్రిందిభాగము తోక తెలుపు రంగులను కలిగియుండును: హేమంతఋతువున తల రెక్క మినహా పిట్టయంతయు తెల్లగ నుండును.

రంగు - రక్షణ - గురుతులు

ఎగతాళిరంగులు - వాతావరణస్థితి

కొన్ని పక్షులకు స్థిరమైన రంగులు, రక్షణకుపయోగించును. వడ్లపిట్ట లేక గూకుడు గువ్వ యిసుకరంగున నుండి తలమీద యీకలను కిరీటమువలె నిగిడించి యుండును. రెక్కలమీద నలుపు తెలుపు చార లుండును; డేగ లేక యితర శత్రువులు కనుపించిన. హఠాత్తుగ క్రిందికి దిగి, కిరీటపు ఈకల దించి, నేలమీద బోర్లగ పడుకొని, యే గుడ్డల కుప్పవలెనో డేగకు కనుపించునట; శత్రుబారినుండి తప్పించుకొనునట; బాగుగ వెదకినగాని యీ యవస్థలో నది కనుపించదట. ఇంగ్లాండులో బిట్టర్న అను పక్షిఈకలు కొంచెము పసుపురంగున, అక్కడక్కడ నల్ల చారలు కలిగియుండునట. ఈ చారలు రెల్లు నీడను పోలి యుండునట. ఏదైన యపాయపు సూచన లున్న పక్షి ముక్కు పైకెత్తి, తల, మెడ వెన్ను నిగిడించి యీ రెల్లు మధ్య పరుండునట. శత్రువు దాటిపోవువరకా యవస్థలోనే యుండి యటుల యపాయము తప్పించుకొనునట.

దక్షిణఅమెరికాలో కురాసో అను అమాయికపు పక్షి ఒకటి కలదట. దీని సహజశత్రువు కర్కారా యను డేగ, దీనిరంగుననే యుండును. ఈ డేగ, కురాసోగుంపులోనికి పోయి కోరిన వాటిని భక్షించునట, ఆ కురాసోలు అమాయికముగ ఊరకుండునట. వేటగాండ్రే ఎన్నోసారులు ఆ డేగను అదేపిట్ట యని భ్రమపడి చంప ఆ పిట్టలకు వానిమధ్య గోముఖవ్యాఘ్ర మున్నటు లేమి తెలియును. ఒకే వంశపిట్టల కొకే రంగుండుటవలన, ఒక దాని నొకటి గుర్తింప వీలుండు నని కొందరి యభిప్రాయము. దీనికి ప్రతికూలురు పక్షికి రంగుజ్ఞానమే లేదనియు, రూపురేఖను బట్టియే సోదరబృందమును గుర్తించు ననీ వారు వాదింతురు. కొన్ని పిట్టలరంగులు, వాని సహజశత్రువుల కయిష్టమైన పిట్టరంగున నుండుటవలన, యవి శత్రుబారినుండి తప్పించుకొన వీలున్నదని, కొందరి సూచన.

గాలిలో చెమ్మ యెక్కువైన రంగు దట్టముగ నుండును. దీనికుదాహరణముగ మలే, దక్షిణ యమెరికాలోని యడవులలోని పక్షు లెక్కువ రంగులు కలిగియుండునట. సూర్యునినుండి వచ్చు అల్ట్రావైలెట్ కిరణములు, నీటియావిరిలోనుండి వచ్చునపుడు, వాని శక్తి తగ్గును గాన, రంగు హెచ్చు నని శాస్త్రజ్ఞుల యూహ. చెమ్మతో నిండిన గాలి కలిగి, సంవత్సరము పొడవున పచ్చగనుండు చెట్లచేమల మధ్య వన్నెపులుగులు నెమళ్లు తేనెపిట్ట లుండుటలో నాశ్చర్య మేమి?

పెద్దల రంగు-పిల్లల పోలిక

తలిదండ్రుల రంగు వేరుగనున్న, మొదట ఈక విసర్జన తరువాత రంగులో, పిల్లలు తల్లినే పోలి యుండును. పెద్దదగు నపుడాడపక్షి చిన్న తల్లిని పోలినరంగుననే తయారగును. మగపిల్లపక్షి క్రమేణ తండ్రి యీకలఛాయ యీకలనే పెంచుచు, యౌవనకాలమొచ్చుసరికి తండ్రివంటి సుస్పష్టరంగులతో తయారగును. తల్లిదండ్రుల రంగే సుస్పష్టమైన రంగైన, పిల్లలు మొదటిలో తలిదండ్రులనుపోలక, అస్పష్టరంగుననుండి, సుస్పష్టరంగుకు తయారగును. ఎంతకాలము నాటికి చిన్నపిల్లలు, పెద్దవానిరంగుకు వచ్చునన్న ప్రశ్నకు జవాబిదియే. కొన్ని జాతులలో కొన్నిరోజులనుండి యొకటి రెండువారముల లోనే పిల్లలు రంగున పెద్దవానిని పోలును. వీనిలో పిచ్చుకలు, పెడిసెలు మొదలగునవొచ్చును. సముద్రకాకి (పాశ్చాత్యదేశమున నుండునది.) పిల్లలు, మూడుసంవత్సరములకు గాని పెద్దవానిని సంపూర్ణముగ పోలవు. తక్కిన పక్షుల సుస్పష్టరంగుల కాలము ఈ రెండు అంచెవాల మధ్యనే యుండును. ఏ పక్షి సుస్పష్ట రంగు ఈకల పెంచునో, అది ఋతువు మారనప్పటికి అస్పష్ట ఈకల పెంచదు. ఈ సిద్ధాంతమున కొక వ్యతిరేక ఉదాహరణ కలదు. అది మామూలు మగబాతు. దీనికి శరదృతువున అందమైన ఈక లుండినా, వేసవికాలమున రక్షణార్థమై ఆడబాతు కుండు మబ్బుఈకలనే పెంచును.

రంగుమార్పునకు కారణము లేవి?

పక్షిజీవితకాలమున మూడువిధములుగ రంగు మార వీలున్నది. మొదటి యీకవిసర్జనానంతరమున వేరే రంగు యీకలు రావచ్చును. లేక ఈకల కొన లరిగి పక్షిరంగు మారినటుల కనుపింపవచ్చును. మూడవ విధానమున క్రొత్తరంగు పదార్థమే కూర్చబడవచ్చును. మానవుడు సృష్టించిన రంగులూ కొన్నిగలవు. కేనరీ యను పాటపాడు పక్షికి మానవుడు మిరియాలు తినిపించి, ముదురు పసుపురంగొచ్చుటుల చేసెను. జీనువాయి పిట్టకు మానవుడు జనుపవిత్తనముల పెట్టి నల్లరంగును తెచ్చెను. అమెజాన్‌నదీ ప్రాంతమున వసించు ప్రజలు, మామూలు పచ్చరామచిలుకనుపట్టి యొక సిలురాయిడ్ అనుజాతి చేపకొవ్వును తినుపించెదరట. అంత టది ఎర్ర పసుపురంగులకు మారునట. మలయాలో రామచిలుకను క్రొత్తయాహారమున పెంచగా అది యెంతనో రంగు మారెనట. అక్కడికి క్రొత్తగ పోయినవారు వేరేజాతిపక్షి యని ముందు మోసపోయిరట దక్షిణఅమెరికాలో, పచ్చరామచిలుక ఈకల పెరికి అచ్చోట, పాలవంటి ద్రావకము నుంచుదురట. ఆకుపచ్చఈకల బదులు పలుపుఈకలు పెరుగునట. ఈ పసుపు ఈకలను పెరికిన రెండవ ఇన్‌జెక్షన్ లేకుండానే పసుపు ఈకలు పెరుగునట.

పక్షికి ఈకారణ్యము లుండుటవలన ఉపజాతుల కనుగొన వీలగుచున్నది

ఈకలు పక్షిశరీరమందు ప్రత్యేకస్థలములలో మాత్రము పెరుగును. ఈ స్థలముల కీకప్రాంతములని లేక యీకయరణ్యము లని పేరు. ఈప్రాంతములమధ్య వట్టి చర్మము మాత్రము కానవచ్చును. పక్షిఈకలను, పీకివేసిన యీ వట్టి ప్రాంతములను బాగుగ పరిశీలింపవచ్చును. మొదటి ఈక ప్రాంతము మెడనుండి వెన్నుపూసమీదుగ తోకవరకు వ్యాపించియుండును; దీనిని వెన్నుప్రాంత మందురు. రెండవ యీకయరణ్య ప్రాంతము, మెడనుండి క్రిందివైపునకు వ్యాపించి రొమ్ముకద్ద రెండు చీలిక లేర్పడి తొడక్రిందుగా ముగియును; దీనిని కడుపుప్రాంత మందురు. మూడవది, భుజముమీద రెక్క మొదలుననే కనుపించును. దీనిని భుజప్రాంత మందురు. నాలుగవది తొడప్రాంత ఈకారణ్యము. అయిదవది తలమీది జుట్టు, రెక్కలమీది ఈకలు, తోక ఈకలు. ఆయా వంశఅలవాటులనుబట్టి, ఈ ప్రాంతమైన కాల్యము భేదించును. కాకిజాతికి చెందినపక్షులలో నీ ప్రాంతములు కొద్ది విస్తీర్ణత కలిగి, వట్టి చర్మవిస్తీర్ణతయే యెక్కువగ కనుపించును. పక్షిశాస్త్రజ్ఞులు, యీకప్రాంతముల పరిశీలనవలన పక్షిజాతిని నిర్ణయింతురు. ఈకలు ఆ ప్రత్యేకప్రాంతమున పెరుగుటకు గల కారణములు వేర్వేరు రీతులుగా నూహించబడుచున్నవి. ఈ ప్రత్యేక ప్రాంతమున యీకలు పెరుగుట, పక్షి ఎగురుటలకు అవరోధమును కలిగింపక, గాలి విసరున కడ్డుపెట్టక, పక్షి సులభముగా నెగురుటకు తోడ్పడు నని కొందరి యూహ. ప్రకృతి మితవ్యయి కాన, యెగురుటకు దేహమును కాపాడుటకును, కొన్ని ప్రదములనే, యీక లున్న సరిపోవు నని, శరీరమంతట యుండుట యనవసర మని, తెలివిగల ప్రకృతి చేసిన విషయ మని కొందరి యూహ.

ఈకలలో పెద్ద ఈకలు పక్షికాకారము నిచ్చును. గనుక వీని కాకారపు ఈక లని పేరు. బాతుజాతికి చెందిన పక్షులలో నీ పై యాకారము నిచ్చు పెద్ద ఈకలను పెరికిన, శరీరము నానుకొని సన్నని మెత్తని చిన్న యీకలు కాన్పించును. వీటికి నూగు ఈక లని పేరు. ఈ నూగు ఈకలను లాగివేసిన వెండ్రుకలవంటి చిన్న ఈకలు కనుపించును. వీటికి వెంట్రుం ఈకలనిపేరు. నీటికాకిలో వెంట్రుక ఈక లుకడు స్థలమున తెల్లమచ్చలు రెండు కనుపించును. కొన్నిపక్షులలో ఈ వెంట్రుక ఈకలు చాల పొడవుగ పెరుగును. రెప్టిలియనులమీది పొలుసులే పక్షులలో ఈకలుగ పరిణమించిన వట.

రంగు ఎటుల వచ్చును?

భౌతికముగ విశదీకరణ?


నిర్జీవ అణువులపొరలనుండియే గోళ్లు, వెంట్రుక లుద్భవించినటుల, ఈకలునూ ఉద్భవించినవి. కాన ఈకల కత్తిరింప జీవాణువులు తగులనంతవరకు జీవికి బాధకలుగదు. ఈక లేర్పడినపుడే నిర్జీవాణువులతోగాని వాని మధ్యగాని రంగు పదార్థ మమర్చియే యుండును. ఈ పదార్థము పరిసమానముగ నన్ని యీకల కందచేయబడును. ఎరుపు, పసుపు, నారింజ, గోధుమ, నలుపు రంగులు గల యీక లీ పంపకవిధానముననే తయారగును; కాన ఏవైపునుండి పిట్టను చూచినా రంగు మారదు. ఏరంగున నున్న దారంగుననే కనుపించును. ఉదాహరణగ, ఆఫ్రికాలో యరటి పండు తిని జీవించు టురాకోపక్షి కుండు యీ ఎర్రయీకలలో, టురాసిన్ అను రంగుపదార్థమున్నే, కాక నూటికి ఆరువంతులు రాగిని విడదీయనగును. దీని ఈకలను పలుచటి అమోనియా, ఎసిటిక్ ఏసిడ్‌లో కరగించి వడపోసిన, ఎర్రని లోహపుపిండి లభించును. వర్షపునీరు యీకల మీద పడిన యీ రంగు కానరాదు. ఈక లెండినంతనే రంగు కానవగును. ఈ పక్షులే నీటనైనను, స్నానము చేసిన, యానీ రెర్రగ కనుపించునట. ఈ యీకలలో యెర్రటిపదార్థము పరిసమానముగ పంపకమగుటవలన, సూర్యకిరణ మెటు పడి యెటు ప్రతిబింబించినను ఆ రంగుగానే కనుపించును.

రంగుపదార్థము - ఈకాకారము

రెండవరకపు రంగు ఈకల రంగు యీకలలోని రంగుపదార్థముమీదను, యీకయాకారముమీదను ఆధారపడియున్నది. ఆకాశపు రంగుటీకలు, యాకుపచ్చరంగుటీకలు యీ రకమునకు చేరినవి. రామచిలుకరెక్కకొన నుండు ఆకాశపురంగుయీకను వెలుగువైపుకు త్రిప్పిన, బూడిదరంగుగను, యాకుపచ్చరంగునను కలనేత కోకరంగువలె కనుపెంచును. అమెజాన్‌ప్రాంత రామచిలుకల ఆకుపచ్చయీకల నీట తడిపిన, గోధుమ్మవన్నె రంగు కానవగును. పక్షులఈకల నుండి, యాకాశపురంగుపదార్థము వేరుచేయుటకు వీలులేదు. కొన్ని యాకాశపురంగుటీకలను పరీక్షించిన, గోధుమ, నలుపు, నారింజరంగులు గల పదార్థము కానవచ్చినది.

నెమలిరంగులు—కటకములు

మూడవరకపురంగుటీకలు నెమలి, తేనెపిట్ట, పెడిసెవన్నె పులుగులందు కానవచ్చును. ఈక పైభాగమున సున్నితముగ నమర్పబడిన గట్టుల కరుసలు చూడనగును. ఒక గట్టువరుసను పరీక్షించిన సూక్ష్మదర్శినితో యీకయీనెలు కప్పబడియుండును. వీటినే పేపిలా లందురు. ప్రతిపేపిలా కటకమువలె వెలుగు కిరణముల విడదీసి, రంగుకాంతులు పృథక్కరించుచున్నవి. ఈ విశ్లేషింపబడ్డరంగులే కండ్ల కద్భుతముగనో, వినోదముగనో, ఆహ్లాదకరముగనో కనుపించుచున్నవి.



(2) మద్రాసు హైకోర్టు, డ్రామాటిక్ అసోసియేషన్‌వారు ఈమధ్య "డైవోర్సు" అను నాటకం ప్రదర్శించారు. నాటకంలో పాల్గొన్న సంఘసభ్యుల ఫోటో.

చాంగ్ "పునః ప్రవేశము"

ఆంధ్రా రాత్

చైనాలో, కమ్యూనిస్టుల ఇప్పటి ఉద్ధృతంలో, కూమింటాంగ్ పాలితభాగాలలో పెద్దపెద్ద తునకలు విడిపోయి, ప్రస్తుతం కమ్యూనిస్టుల అధీనంలో ఉన్న 20 కోట్ల ప్రజలతో బాటు, మరికొన్నికోట్ల ప్రజ కమ్యూనిస్టు పాలనలోకి వెళ్లే అవకాశం బలీయంగా కనబడుది. నాన్కింగ్ మొదలైనవాటిని పట్టుకోటంలో కమ్యూనిస్టులకు గల్గిన తొలి విజయాలు, కూమింటాంగ్ చైనాలో ఇంకా పెద్ద భాగాలను సంపాదించుకోగల వనే చూచిస్తున్నాయి.

కాని ఇదే, చైనా 'ఆఖరి"పోరాటం" అని భావించేందుకు అవకాశం లేదు. కమ్యూనిస్టు శ్రేణిలోని కోట్లకొద్ది సైనికులు, అల్పబలుపైన కూమింటాంగు శత్రువుని చీల్చి, మరికొంత భూభాగాన్ని కైవసం చేసుకోవచ్చును.

కాని కమ్యూనిస్టుల ముఖ్యసైనికబలం దక్షిణ చైనాసరిహద్దుకు వెయ్యిమైళ్లదూరంలోనూ, ఆసియా-చైనాలోపలి సరిహద్దుకు 3000 మైళ్ళ దూరంలోనూ ఉన్నది. ప్రస్తుత యుద్ధతీవ్రత మందగించాక అంటే సైనికులు, ఆహార పదార్థాలు, ఆయుధబలాలు, కొంత క్షీణించగానే యుద్ధ గమకం ఆగవలసివస్తుంది. కమ్యూనిస్టులు, దక్షిణ చైనా, ఫార్మోజా, పశ్చిమచైనాలలోని కూమింగ్‌టాంగ్ ప్రభుత్వయుద్ధ నాయకుల వలన కలిగే ఎడతెగని అలజడిని ఎదుర్కోవలసి వస్తూంటుంది.

అంటే, ప్రత్యక్ష రణరంగంలో కాక, రాజకీయ పోరాట రంగాలలో యుద్ధం చేయవలసి వస్తుంది. చైనాలో గత మూడునెలల-చాంగ్ కై షేక్ వెనుక కొదిగిన జనవరి 21 నుండి, కమ్యూనిస్టులు ఏప్రెల్ 23 న మళ్ళీ యుద్ధం ఆరంభించీ మధ్య మూడు నెలల విరామాన్నిచే సరిగ్గా అర్థం చేసుకొంటే సైనికయుద్ధం, రాజకీయాల యుద్ధముగా మార నున్నదన్న ముఖ్య విషయం గోచరిస్తుంది. ఈ విరామాన్ని చాలామంది అపార్థం చేసుకొన్నారు. కాని క్యూమింటాంగ్ లోపలి వర్గాల వైఖరులు, కమ్యూనిస్టుల దృక్పథము - దీనివల్ల స్ఫుటంగా తెలిసివచ్చాయి. జనరలిస్మో చాంగ్ "అధికారం" లోకి మళ్ళీ రావటానికి కారణాలుకూడా ఈ విరామం వల్లే తెలిసి వచ్చింది.

చాంగ్ నిష్క్రమణ

ఛాంగ్ కై షేక్ ది మొండిపట్టు. జాన్యువరి 21 న అధ్యక్షస్థానం లీ ట్సుంగ్ జెన్ కప్పగించి తను వైదొలగటానికి ఇష్టంలేక ఇష్టంలేక ఎల్లాగో ఒప్పుకున్నాడు. ప్రజలు "శాంతి" "శాంతి" అని పెద్దపెట్టున కోరిక వెలిబుచ్చకో, ఛాంగ్ సైన్యాధిపత్య నాయకత్వాన్ని ప్రతివారూ తూర్పారబట్టటంతో, కూమింగ్ టాంగ్ నాయకులు కొందరు, "ఈ ఎత్తు ఎత్తితే ప్రయోజనం కల్గితే కల్గుతుంది; లేదా కమ్యూనిస్టులతో రాయబారాల మిషమీద కొంత ఊపిరి తీసుకొనే వ్యవధి చిక్కుతుంది"—అని ఉపాయం సూచించటంతో ఛాంగ్ విధిలేక వెనక్కి తగ్గాడు.

ప్రభుత్వస్థానం వదిలి, చిటియాంగ్ రాష్ట్రంలో తన జన్మస్థానమైన చికో గ్రామానికి ఛాంగ్ చేరుకోటం, కేవలం తెరవెనుక నాటకానికోసమే రంగంనుంచి నిష్క్రమించటమనీ, చేతిలోని అధికారం వదులుకోటం ఏమాత్రమూ కాదని, మొదటినుంచీ స్పష్టంగా తెలుస్తూఉన్న సంగతే. కూమింగ్‌టాంగ్ డైరక్టరు జనరల్‌గా తన స్థానాన్ని అట్టే పెట్టుకొన్నాడు. తూర్పు దక్షిణ చైనాలలో తనకు నమ్మకస్థులైన బంట్లను కీలక స్థానాలలో అట్టే నిలిపాకే తను అధ్యక్షస్థానంనుంచి వైదొలిగాడు. తూర్పుదక్షిణ చైనాలలో, కమ్యూనిస్టులతో తుదియుద్ధాలు జరగితీరాలనేది, తర్కసిద్ధమైన సత్యం.

షాంఘై - నాన్కింగ్ గారిసన్ ప్రదేశంలో కమాండరైన టాంగ్ లిన్ పో, అమిత లంచగొండి, అవినీతిపరుడు, అసమర్థుడూ అయితేనేం ఛాంగ్‌కు నమ్మకస్థుడు. అదేమాదిరిగా, ఫార్మోసా, చికియాంగ్, ఫ్యూకీన్, క్వాంగ్‌టంగ్, దేశాలలో రాజకీయ సైనిక పోలీస్, అధికారస్థానాలన్నిటికీ ఛాంగ్ తన మనుష్యులనే నియమించాడు.

ప్రభుత్వానికి మిగిలిన బలగమూ, వైమానిక సైన్యాలూ, దాదాపు అన్నీకూడా, ఫార్మోజా, ఫార్మోజా దగ్గిర రేవుస్థలాలకు చేర్చబడ్డాయి.

ఛాంగ్ నిష్క్రమించిన మరు క్షణమే ప్రభుత్వసైనిక సర్వాధికారి, ఏరియా కమాండర్ల కందరకూ ఈవిధంగా తంతి నిచ్చాడు: "అధ్యక్షులు నాన్కింగ్ వదిలి వెళ్లారు - ముందు కావలసిన సన్నాహాలన్నీ పూర్తిగా జరిగాయి - అంతర్జాతీయ రంగంల్లో చాలా మార్పులు కలుగనున్నాయి. విజయం నిస్సందేహంగా మనదే- మనం అందరం జనరలిస్మో అనుచరులము, శిష్యులము. అందుకని మనమంతా సైన్యాలను అవసరానికి కావలసినట్టుగా తయారుగా ఉంచాలి" అని తంతి నిచ్చాడు.

తెరవెనుక భాగోతంలో చాంగ్ కున్న ప్రజ్ఞకు, నిత్యం అతని పల్లెటి ఇంటికి రాత్రిం బగళ్లూ, రాజధానినుంచి వచ్చిపోయే రాజకీయజ్ఞుల సమృద్ధమే మంచి తార్కాణము.

మొదటివారాలలో, రెండువిమానాలు, "రిపైరయిన" అధ్యక్షునివద్దనుంచి రాజధానికి ఫర్మానాలూ, సందేశాలూ, మోసుకు పోతూ వస్తూ ఉండేవి. జాతీయప్రభుత్వ రక్షణశాఖామంత్రి వర్గంతో, నిత్యం సంభాషణలు జరుపుతూ, విఫలంగా వాళ్లకు ఆదేశాలన్నీ పంపుతూండేవాడు. ఫిబ్రవరి 8 తారీఖున "ట్సింగ్‌టావ్"ను ప్రభుత్వసైన్యాలు వదిలి రావాలన్న ఆజ్ఞ ఛాంగ్‌నుంచే వెళ్లింది. ఈచర్యతో, ముట్టడిలో ఉన్న "టాయువాన్" పట్టణం నాశనమయిపోయే బెడద కల్గింది. అంతవరకూ ట్సింగ్ టావ్‌నుంచి అక్కడకు విమానాలద్వారా సరఫరాలు జరుగుతున్నాయి. టాయువాన్ లోని కమాండరు జనరల్ యెన్ హైషాన్, ఆ ఆజ్ఞ రద్దుచేయించుకొనేందుకు చికౌకు (ఛాంగ్ ఉన్నఊరికి) విమానంలో ఎగిరి ప్రాలవలసి వచ్చింది.

చాంగ్ యుద్ధనీతి

చాంగ్ యుద్ధవ్యూహంలోని ప్రాథమిక అంశాలను ఇల్లా క్రోడీకరించుకోవచ్చును. కమ్యూనిస్టులతో బేరసాలు గాని ఒక రాజీకి రాగలగటం గాని అసంభవం కాబట్టి వాళ్లతో యుద్ధం చేయటానికి, బాహాటంగానో, ప్రచ్ఛన్నంగానో సర్వసన్నాహాలూ సమకూర్చుకోవటం, సర్వశక్తులను సమీకరించుకోవటం జరిపితీరాలి.

పోరాడటంలో, వెనుకంజవేయటం అంతా, ఆగ్నేయదిశగా జరపాలి. ఇంకా వెనక్కి తగ్గవలసివస్తే ఆఖరికి ఫార్మోజాదీవి (టైవాన్)కి చేరుకోవాలి.

ప్రతిచోటా కమ్యూనిస్టులకు అలజడి కలిగించేందుకు రహస్యదళాలను నిలుపుకొంటూ రావాలి. కమ్యూనిస్టులకు అధికారం చిక్కగానే, యుద్ధఖర్చులు తగ్గిరావటంవల్లనూ, దేశప్రభుత్వ విధానాలలో కమ్యూనిస్టుల అనుభవం లేమిచేతను, తమకు పరిస్థితులు చాలా అనుకూలంగా బాగుపడిరావచ్చునని చాంగ్ భావిస్తున్నాడట. ఇక రెండేళ్లలో తృతీయప్రపంచ-సంగ్రామం రాగలదనే అప్పటికి అమెరికా సహాయంతో, ఫార్మోజాదీవినుంచి, చైనా నడిగడ్డమీదకు తను ఇట్టే ఉరికి దేశం స్వాధీనం చేసుకోవచ్చునని, ఈలోపుగా క్యూమింగ్ టాంగ్ రహస్యదళాలు ఇందుకు అనుకూలంగా ప్రజలలో అశాంతి రెచ్చగొట్టగలవనీ, చాంగ్ ఆశిస్తున్నాడు.

చాంగ్‌నుంచి అధ్యక్షపదవిని స్వీకరించిన జనరల్ లీట్సుంగ్ జెన్, కూమింగ్‌టాంగ్‌లోని మరొక తరహావారికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈయనా, పాయ్ ఛుంగ్ హ్సీ, ఇద్దరూ "క్వాంగ్సీముఠా"గా ఏర్పడి, చాలకాలంనుంచి జనరలిస్మోకు ప్రతికక్షులుగా ఉంటూవచ్చారు. 1933, 36 లలో ఛాంగ్‌పై తిరగబడ్డారు. గత సంవత్సరం ఛాంగ్ మనిషిని 'సన్‌ఫో'ను ఓడించి 'లీ' ఉపాధ్యక్షుడుగా ఎన్నిక అయ్యాడు.

లొంగి ఉండడం అల్లా లోబర్చుకొనేందుకే

"లీ" అభిప్రాయం వేరు. చైనావారు వస్తుతః సాంప్రదాయప్రియులు. వారికి ప్రాతినిధ్యం వహించే కూమింగ్‌టాంగ్, కమ్యూనిస్టులతో యుద్ధంచేయటంవల్లకన్నా కమ్యూనిస్టులతో కలిసి, కొంచెం తక్కువలోనైనా బ్రతకటంలోనే, జాతీయసిద్ధమైన "సాంప్రదాయ ప్రభుత్వం" బ్రతికి నిలచేందుకు అవకాశం ఉంటుంది. అదీ కాకుండా శాంతిదాహంతో తపిస్తున్న ప్రజలసానుభూతిని సంపాదించేందుకు, తద్వారా కమ్యూనిస్టుల వాదానికే మూలచ్ఛేదం చెయ్యగలిగేందుకు, కొన్ని రాజకీయ సంస్కారాలను ప్రవేశపెట్టి, కమ్యూనిస్టులతో శాంతి పడటం శ్రేయస్కరమని 'లీ' ఊహ. ఈ"నీతి" ప్రయోగంలో అమెరికా విదేశాంగశాఖ కూడా 'లీ'కి వత్తాసుగా ఉంది. ఇప్పటి క్యూమింగ్‌టాంగ్ లోని చాలామందిని విడదీసి, ఒక కొత్త ప్రభావానికి కేంద్రంగా చేస్తే, కమ్యూనిస్టు ఆధిపత్యం క్రింద ఉన్న చైనాలో తమ ప్రాభవానికి ముందు ముందు మళ్లీ ప్రాపకానికి స్థానం చిక్కుతుందని అమెరికన్ పాంబసీ ఊహ.

తన భావాలను ఆచరణలో పెట్టేందుకు, తాత్కాలికాధ్యక్షుడు "లీ" అవకాశం లేకపోయింది. కారణం ప్రభుత్వయంత్రంమీద అతనికి అధికారమే ఏర్పడలేదు. ఒక చిన్న ఘట్టం ఈ విషయాన్ని బాగా నిరూపిస్తుంది. 'లీ' అధ్యక్షుడు, రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేస్తున్నామని, జనకంటకంగా ఉన్న కూమింగ్‌టాంగ్ రహస్య పోలీసు శాఖను రద్దు చేస్తున్నామనీ ప్రకటన చేశాడు. ఈప్రకటనవల్ల తాను లిబరల్‌వాది అని ప్రజలూ, కమ్యూనిస్టులూ కూడా అనకోవాలని ఆశించాడు. వెంటనే ప్రజల దృష్టి, మార్షల్ చాంగ్ హ్సూన్ లియాంగ్‌ను బందీగా ఉంచిన ఫార్మోజా డిటెన్షన్ స్థానంమీదికి మళ్లింది. హ్సూన్ లియాంగ్ 1937 లో "సయాన్ ఘట్టం - "అనే దానిలో పాల్గొన్నందుకు - చాంగ్ కై షేకును ఎత్తుకొనిపోయి జపానువారితో యుద్ధం చేయమని బలవంతపెట్టినందుకు - అనాటినుంచీ జైలులో ఉన్నాడు. కాని "లీ" ప్రకటన తర్వాతకూడా హ్సూన్ లియాంగ్ విడుదల కాలేదు. కారణం అతను రహస్యరక్షకభట శాఖచేతుల్లో ఉన్నాడు. ఆ శాఖ ఇప్పటికీ, చాంగ్ కై షేకు ఆజ్ఞ ఇస్తేతప్ప, కాతరచెయ్యదు. చాంగ్ అతన్ని వదలిపెట్టవద్దన్నాడని తెలుస్తూనే ఉంది. షాంఘైలో గాని, చాంగ్ ఆజ్ఞలకు విలువఉన్న తదితర స్థానాలలోగాని ఒక్క రాజకీయ ఖైదీకూడా విముక్తుడు కాలేదు. కాబట్టి క్రియకు చూసుకొంటే, లీ ఎన్ని కబుర్లు చెప్పినా, చాంగ్ గీసిన గిరిని దాటి, ప్రభుత్వ కార్యాలు నెరపించలేడు. నాన్కింగ్‌లో ఒక సంపాదకుడు చాంగ్ రాజకీయాలలో కలగచేసుకోడం మాని దేశం వదిలిపోతే క్షేమకర మని సలహా ఇచ్చినప్పుడు, ఆ పత్రికకు నిషేధాజ్ఞ జారీచేసి, ఆ సంపాదకుణ్ణి ఖైదులో పెట్టారు. అధికారంలో లీకున్న స్థానమెంతో, ఇంతకన్నా వేరే మాచుకోనక్కరలేదు.

కూమింగ్‌టాంగ్‌లోని ఈ వ్యక్తివిభేదాలు, మాజీప్రధాని సన్‌ఫో ప్రభుత్వంలో సగంశాఖలను కాంటన్‌కు తర్లించి, ప్రభుత్వాధికారంలో సగాన్ని చీల్చి విడిగా చేర్చటంతో, పార్టీలో చీలిక ప్రత్యక్షరూప మందుకొని, రంగం రక్తి అందుకొంది.

సన్‌ఫో ఏ ఎండకా గొడుగు పట్టూ, అవినీతికి ఆటపట్టయిన, అవకాశవాది ఇప్పుడు ఛాంగ్ కై షేక్ అండ చేరి నిరంకుశ ప్రతీపశక్తులతో చేయి కలిపాడు. ప్రభుత్వాన్ని తన ధోరణిలోకి తిప్పుకోవాలని, రాజీనామా యిచ్చి కాంటన్ చేరుకొన్నాడు. ప్రభుత్వం దక్షిణానికి మారాలని మూడు రంగాల యుద్ధసైన్యాలను ఆగ్నేయ రంగానికి మార్చి, కమ్యూనిస్టులతో అంతిమ యుద్ధానికి అక్కడే తయారుకావాలన్నిల ఈ లోపుగా తృతీయప్రపంచ సంగ్రామ స్వరూపంలో తనకు రాగల రక్షణకై ఎదురుచూస్తూ ఉండాలనీ సన్‌ఫో అభిప్రాయము కాంటన్ మారటానికి నిశ్చయం చేసుకొనేముందు సన్‌ఫో, చికింగ్‌లో ఛాంగ్ కై షేక్‌ను దర్శించాడన్నది గమనింపదగ్గ విషయము.

మార్చి నెలలో సన్‌ఫో రాజీనామా యివ్వటం, ప్రభుత్వస్థానాన్ని నాన్‌కింగ్ వెనుకకు మరల్చిన హోయంగ్‌ఛిన్ అతని స్థానంలో ప్రధానిగా రావటం-కూమింగ్‌టాంగ్ లోని విరుద్ధపక్షాలు రెంటికీ కొంచెం సమాధానం సమకూర్చినట్లయింది. హోయింగ్‌ఛిన్- ఇంతకు పూర్వము రక్షణశాఖామంత్రి, ప్రభుత్వ ముఖ్య ఉద్యోగి. 'వ్హాంపో' ముఠాకు చెంది సేనాధిపతులకు నాయకుడు. మునుపటిరకం ప్రతీపశక్తులకు చెందినవాడు. జపాన్ పక్షపాతి అని, కమ్యూనిస్టు విరోధిఅనీ, చైనా చరిత్ర చదివిన ప్రతివారికీ ఇతని విషయమై తెలిసే ఉంటుంది. ఈతన్ని మంత్రిగా ఎన్నుకోటంకూడా, నలుగురుపేర్లు ఉన్న పట్టీలోనుంచి, చాంగ్ ఇతని పేరు స్వయంగా ఎన్నుకోటంవల్లనే జరిగిందని కూడా తెలుస్తూంది.

సైనిక బలాభివృద్ధి

అయితే కూమింగ్‌టాంగ్‌లో ఎన్నిపక్షాలున్నా, పార్టీ ప్రతిష్ఠను నిలపటం విషయంలో ఎన్ని అభిప్రాయభేదాలున్నా, కూమింగ్ టాంగ్ సైన్యాలను బలీయంచేసి, పునరుత్తేజితం చెయ్యాలన్న విషయంలో, అందరూ ఏకాభిప్రాయంలోనే ఉన్నారు.

వాస్తవానికి శాంతి రాయబారాల పేరిట చిక్కే వ్యవధిలో కూమింగ్‌టాంగ్ సైన్యాలకు బలం చేకూర్చుకొని, అంతిమయుద్ధానికి తయారుకావాలన్న యుక్తిమీదే, "పీస్ ఫ్రంట్"గా లీ ట్సుంగ్ జెన్‌ను ఉపయోగించుకొన్నాడు ఛాంగ్.

కమ్యూనిస్టుల చేతుల్లో కూమింగ్‌టాంగ్ సైన్యము పదిలక్షల సంఖ్యకు క్షీణించిపోయింది. దీన్ని పెంపుచేసేందుకు ఎంతో ప్రయత్నం జరిగింది. పైకిమాత్రం 63,00,000 సైన్యాన్ని తగ్గిచ్చేస్తున్నామని చెప్పుకొంటూ సైనికబలం వృద్ధిచేసేందుకు ప్రయత్నించారు. ఈ అరవైమూడులక్షల పేర్లు ఇంతవరకూ సైనిక చిట్టాలలోమాత్రమే ఉన్నాయి. ఈ లేని మనుష్యుల పేరిట, జీతాలు ఇన్నాళ్లూ సైన్యాధికారులు, దురాశాపరులై తమ జేబుల్లో వేసుకొంటున్నారు.

కూమింగ్‌టాంగ్ యుద్ధశక్తిని విస్తృతం చేసి హెచ్చిద్దామని, ఎంత ప్రయత్నాలు చేసినా, ఏటికి ఎదురీతగానే తయారయింది. ఫ్యూకిన్ గ్రామాలలో, బలవత్సైన్యీకరణం చేయటానికి వచ్చిన ఉద్యోగులమై మండిపడి గ్రామస్థులు వారిని చావ చితుక గొట్టారు.

కూమింగ్‌టాంగ్ యుద్ధయంత్రం, బలం చేకూర్చుకోటం పోయి, అంతకంతకు వేగంతో కొండ దిగువకు దొర్లిపోయినట్లు పడిపోయింది. భూతలసైన్యాలలో, పారిపోవటాలు, శత్రువుతో చేరటాలూ, ఎక్కువవటంతో, ఈ జాడ్యం, జల, వాయు సైన్యాలకు కూడా అంటుకొంది.

వైమానికుల బంధువులను చాలమందిని ఫార్మోజా దీవుల్లో, జామీనులుగా ప్రభుత్వం అట్టే పెట్టుకొన్నప్పటికీ, ప్రతివారం ఒకటో రెండో విమానాలు, శత్రుపక్షంలో చేరి పోతున్నాయి. నౌకాబలంలో కూడా, ఈ పద్ధతి చిన్నపెట్టున బయలుదేరి, నౌకాబలానికంతకు అగ్రస్థానంలో ఉన్న "ఛుంగ్ కింగ్" అనే బ్రిటిష్ నిర్మిత యుద్ధనౌకలోని, నావికులంతా శత్రుపక్షంలో చేరిపోవటంతో నౌకాబలంలో నైతిక పతనం బైలుపడింది. కూమింగ్‌టాంగ్ విమానదళాలు ఈ నావపై హులుటావ్ అనే కమ్యూనిస్టురేవులో దాడిచేసి నాశనం చేశాయి. కాని ఇంత ప్రముఖమైన నౌకా సైన్యం, శత్రుపక్షాలలో చేరటం, కూమింగ్‌టాంగ్ సైన్యాలకు నైతికపతనం సమకూర్చింది. కూమింగ్‌టాంగ్, యుద్ధ సౌభాగ్యం అంతా మునిగిపోటానికే సిద్ధముగా ఉందని ఇది ఋజువుచేస్తోంది.

(కాపీ రైటు)

ప్రపంచ సమస్యలపై ప్రజాభిప్రాయం!

[“ఈ విషయంలో ప్రజలంతా ఏకగ్రీవంగా ఇది కావా లంటున్నారు.” అంటూ ప్రతిక్షణమూ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట, ఎవరో ఒక నాయకుడు తనదైన ఏదో ఒక అభిప్రాయం ‘ప్రజాభిప్రాయ’ మంటూ ప్రజలతరఫున వకాల్తా పుచ్చుకొని ఉపన్యాసం దంచుతూనే ఉంటాడు. అసలు ప్రజల ఆలోచనలు ఏ విషయాల మీద ఉంటాయో తన అనుభవాల్ని బట్టి వ్యాసకర్త ఉల్లేఖించాడు.]

ఒక చిన్నపల్లెలోనో, పట్టణంలోనో ఉన్న ప్రజలను తీసుకొన్నామనకోండి. ఈ సమస్యను గురించో ఆ సమస్యను గురించో ప్రజలు ఏ మనుకొంటున్నారో చూసుకొనే లోపల, అసలు ప్రజలు ఆలోచిస్తూన్న విషయాలు ఏమిటీ అని ఒక్క సారి పరికించుకొంటే మంచిది.

సామాన్యమానవుని మస్తిష్కంలో నిత్యం ఉండే ఆలోచనలన్నీ, చాలామటుకు ఒక్క విషయం చుట్టూనే పరిభ్రమిస్తూంటాయి. “నేను”అన్న విషయంచుట్టూ! ‘నా ఆరోగ్యం’, ‘నామనస్థితి’ “నన్ను గురించి ఇతరు లే మనుకొంటున్నారు”, “ఇతరులను గురించి నే నే మనుకొంటున్నాను”, “నా ప్రత్యక్ష జీవితసమస్యలు”, “నాసంసారం, కుటుంబం, భార్యాకడ్డలూ, నాఉద్యోగం”—“ఫలాని వెంబియ్యతో నే నేమన్నాను”, “వెంకయ్య నాతో ఏమన్నాడు”, “ముఖ్యంగా నేను అన్న దేమిటి?”—ఈలాంటి విషయాలే కదా ఎక్కువగా సామాన్యుడు ఆలోచిస్తూండే విషయాలు? ఎంత ప్రజాసేవకు డన్న పెద్దమనిషికూడా, తన ఊరు, జిల్లా, దేశం, ప్రభుత్వం అన్నవాట్లను గురించి దృష్టి మరలించగల్గినకాలం బహు స్వల్పము - “సామాన్యప్రజాసర్వస్వంయొక్క అభిప్రాయం నిత్యం ప్రబలంగా, నిరూపితమాతూ, ప్రతిపోరుడూ, నిత్య జాగృతి తో పాల్గొంటూన్న, ప్రజాస్వామ్య ప్రభుత్వ మనేది - ఇంతవరకూ ప్రపంచంలో కేవలం భావనావీధిలో మెలగే రమ్యమైన స్వప్నం మాత్రమే.

మరి అల్లాంటప్పుడు, “ఈ ఊరి ప్రజలంతా ఇల్లా తీర్మానించారు” అని ఒక ఊరినో, సంఘాన్నో, జాతినో మొత్తంగా కలిపి చెప్పకోనేటప్పుడు, ఆ ప్రజాభిప్రాయమనేది అబద్ధమనకో అక్కర్లేదుగాని, ప్రజలు జాగృతితో నిత్యం ఆ విషయం ఆలోచిస్తూ ఆ తీర్మానానికి రాగలిగారని, ఏదో కొద్దికాలంపాటు మాత్రమే గాక, ఆ విషయంలో ఎగతెగని ఉత్సాహంతో నిత్యం ఆలోచిస్తూనే ఉన్నారనీ, అనకోటం పొరపాటు అవుతుంది.

రాక్సుబరో అనే చిన్నపట్టణం విషయంలో జనుల ఊహాపోహలను కొద్దిగా పరిశీలించటం మొదలుపెడితే, మన ముఖ్యవిషయాన్ని వదలకుండా ఆలోచించుకోగల్గుతాము. అంటే యిక్కడ నేను జనులు పరస్పరం కలుసుకొన్నప్పటి సాధారణ సంభాషణలను మాత్రమే తీసుకొంటున్నాను. అవి అయినా పరిపూర్తిగా అల్లాంటి సంభాషణ లన్నిటికీ ప్రాతినిధ్యం వహించగల్గుతా యని అనటం లేదు. నా అనుభవాలనిబట్టి నా అభిప్రాయాలు మాత్రమే వెలువరిస్తాను.

ఈ ఊరు పట్టణ మయాక“వ్యవసాయవృత్తి” ప్రథమస్థానంనుంచి తొలగినా, ఎవరైనా కలుసుకొన్నప్పుడు సంభాషణముఖ్యంగా వ్యవసాయం విషయాలమీదే ఎక్కువభాగం సాగుతుంది. కొత్త “ముసపటివాళ్లు” కలుసుకొన్నప్పుడు, పంటలు, వానల ఎక్కువ తక్కువలు, శీతోష్ణ పరిస్థితులు వీట్లమీదే అనవరతంగా సాగిపోతూ ఉంటుంది.

వ్యవయసాయం ముఖ్యజీవనం అయినస్థలాలలో, వ్యవసాయ సంభాషణలలో భాగంగా వ్యవ-

గ్రాన్ విల్లిహిక్సు
(వ్యాసం ఆధారంగా)

సాయంలో నూతన శాస్త్రీయవిధానాలు, పరిశోధనలు మీదకూడా ఎక్కువగా ఉంటాయి గాని రాక్సుబర్గు, కర్షకులు పత్రికలలోనూ ప్రభుత్వకరపత్రాలలోనూ రేడియోలోనూ ప్రచురితం అవుతూ ఉండే నవీన శాస్త్రీయసాధనాల మీదికి ఎక్కువ దృష్టి పోనీరు. ఆ చుట్టుపక్కల “నవీన శాస్త్రీయవిధానాలమీద నడుపుతూన్న కొద్ది వ్యవసాయాలు పోయి చూడటానికికూడా వాళ్లకు ఏమాత్రమూ ఉత్సాహం లేదు. ఇక వ్యవసాయసంభాషణ అంతా రెండు భాగాలుగా ఉంటుంది. వ్యవసాయ జీవితంలో గాధలూ, అభూత విశ్వాసాలూ, రెండుభాగాలుగానూ సంభాషణను ఆక్రమించుకొంటాయి.

వాళ్ల కబుర్లు వింటూంటే, వ్యవసాయం చేయవలసిన పద్ధతు లేవీ తెలియవు. కాని, ఆ సంభాషణలు వాళ్ల జీవితానికి ఎల్లా తుష్టినిస్తున్నాయో తెలుస్తుంది.

ఒక “పూర్వకాలపు మనిషి,” రాక్సుబర్గు పొలాలసారం గురించి కబుర్లు మొదలు పెట్టాడు. ఆ శ్రోతలకీ, అప్పటికి ఎన్నోవందలమార్లు ఆ విషయాలే అతను చెప్పి ఉంటాడు. శ్రోతలు కూడా, సమయస్ఫూర్తిగా తమ తమ అభిప్రాయాలుకూడా వందలమాట్లు ఆ ఉపన్యాసం “పట్టు”ల్లో అల్లాగే చేసి ఉంటారు.

ఆ పూర్వకాలపు మనిషి కేవలం సంభాషణ కోసమే “అంటే ఆ నల్గురితో బాంధవ్యాలు నిలుపుకొని సామరస్యంగా గడపగల బ్రతుకు ఉద్దేశంతోనే, ఆ సంభాషణ మొదలుపెట్టాడు. పైగా ఒక ప్రాథమికసత్యాన్ని తన సంభాషణలో పునరుద్ఘాటిస్తూ ఉంటాడు. ఆ “సత్యా”నికి నవీనత్వం ఉండాల్సిన అవసర మేదీ అతనికి కన్పించదు.

తక్కిన వృత్తులలోని మనుష్యులూ ఇదే మాదిరిగా సంభాషణలు నడుపుతారు. అయితే లాయర్లు, మాష్టర్లు, వ్యాపారస్థులు, వీళ్లకు కొత్త తొందరలోనో, కొత్త ఆలస్యంగానో తమ శ్రోతలకు విసుగెత్తుతూందన్న విషయము గ్రహింపుకు వస్తుంది. కాని ఈ “పూర్వకాలపు వాళ్లకుమాత్రం” - అల్లాంటి తత్తరబాటు ఏమీ కలగదు. వాళ్లల్లో వాళ్లుగా వాళ్లు ఉన్నంతసేపూ అల్లాంటి తత్తరపాటుకు అవసరంకూడా కనిపించదు.

వాళ్లదృష్టి, “చదువుకొన్నవాళ్లు” అనే వాళ్ల దృష్టికి సరిగా ఎదురుబదురుగా ఉంటుంది. నవ్యత్వం అంటే వాళ్లు అపనమ్మకంతో చూస్తారు. “చదువుకొన్నోరు” నవ్యత్వాన్ని మనసారా ఆరాధిస్తారు. ఏవిషయమైనా, “చదువుకొన్నోరి”లో ఇట్టే అరిగిపోయి, నూతనత్వం కోల్పోయి, అతిశీఘ్రకాలంలో విసర్జింపబడుతుంది. వాళ్లకు కొత్తవిషయం కాకపోతో, దాన్ని గూర్చే మాట్లాడుకోటానికే వీలుండదు. మాట్లాడుకోటానికి వీలే లేనిది మూలబడిపోవలసిందేగదా -దాన్ని వదిలేయటమే మేల్లు!

ఈ దృష్టికూడా, ‘జిజ్ఞాసు’ వుకు హానికరమే. అసలు ‘నూతనత్వాన్ని ఆరోగ్యవంతంగా గ్రహించి జీర్ణం చేసుకోగల శక్తికి ఇది అభ్యంతరంగా నిలుస్తుంది. పూర్వకాలపువాళ్ల పద్ధతి, ముందుకు నడవబోని మూర్ఖత్వంగా కనిపిస్తుంది. దానివల్ల సంఘానికి గట్టితనం ప్రయోజనాలు దానికున్నా, మార్పు అంటూ రావలసి వచ్చేటప్పటికి ఈ దృష్టి గలవాళ్లు అడ్డంగా నిలవబట్టె, అవసరం వచ్చినప్పుడు హానికరంగానే కనబడుతుంది. రాక్సుబరోలో వ్యవసాయ పద్ధతులు, తక్కినచోట్లకన్న చాలా “వెనుకపడి” ఉన్నయ్.

ఇంక మూఢనమ్మకాల విషయం: తక్కిన పట్టణాల జనానికంటే రాక్సుబర్గు జనానికే ఎక్కువ మూఢనమ్మకా లున్నాయని నిర్ధారణగా చెప్పటం కష్టం. అయితే తక్కినవాళ్లు రాక్సుబర్గు జనం అంత బాహాటంగా, తత్తరపాటు లేకుండా తమ నమ్మకాలను సంభాషణలలో వెల్లడించలేక పోవచ్చును.

నాకు తెలిసినంతవరకూ దయ్యాలూ, భూతాలూ, చాతబడులూ, అంటే నమ్మకాలు వెలువర్చినవారు లేరుగాని, తమ ఊళ్లో జరిగినదన్న కథను ఎంత పాతకథ వైనా పూర్తిగా విశ్వసిస్తారు.

చాలామంది కర్షకులు, తిథి వార నక్షత్రాలు చూసుకొనే (అమెరికాలో విషయమే చెప్పేది-సం॥) మొక్కలు నాటటం మొదలైన వ్యవసాయపు పనులన్నీ మొదలు పెడుతారు. దీన్ని మూఢనమ్మకం అని కాకుండా సశాస్త్రీయ విషయ మని చెప్పేందుకు చంద్రుడికి, సముద్రం ఆటుపోటులమీద లాగే మొక్కల పెంపుమీద కూడా ప్రభావం ఉందని మిడిమిడి శాస్త్రజ్ఞానముతో వాదిస్తారు.

హైస్కూలుపరీక్షలు ప్యాసయిన యువతులు కూడా, ఋతుకాలంలో వంట కాలు ముట్టుకోరు. అల్లా ముట్టుకుంటే వంట పాడవటం తమ అనుభవంలో విషయమే నని వాదిస్తారు, శుభాశుభ శకునాలు, వాతావరణాన్ని బట్టీవారఫలాలనుబట్టీ, మొదలెట్టె విషయాలు లెక్కలేనన్ని ఉన్నాయి.

“శుక్రవారంనాడు ఏదన్నా మొదలెత్తే వచ్చే ఆపదలకు విఘాతాలకు అంతు లేదు.” “నెల చివరి రెండు రోజుల వాతావరణాన్ని బట్టే ముందు నెల వాతావరణ మంతా ఉంటుంది.” “క్రిస్మస్‌లో పచ్చపచ్చగా ఉంటే మళ్లీ శీతాకాలంలో జబ్బులూ చావులూ ఎక్కువగా ఉంటాయి.”

మాండలికంగా ఉన్న “కథలు గాథల”విషయంలో ఒకొక్కళ్లుమాట్లాడుతూంటే బలే ఆశ్చర్య మేస్తుంది. ఉదాహరణకు మార్కుకట్టర్ అనే అతను ఉన్నాడు. గంటలకొద్దీ ఈ నమ్మకాలకథలు చెప్తూ వాట్లమీద అతి తీవ్రంగా వాదిస్తూంటాడు. అవన్నీ అతను నమ్ముతున్నాడో లేదో మాత్రం చస్తే తెలియదు. ఆ సామెతలు చెప్తూ, “ఏదో వాట్ల బతుకూ వాట్లనూ బతకనిద్దురూ” అన్న సహనం చూపిస్తున్నట్టుగా నటిస్తాడు.

నే ననుకోటంమాత్రం, “మార్కుకట్టర్‌కు, సంభాషణలు సాగించటానికి మంచి ఆశ్రయంగా మాత్రం ఇవి పనికొస్తున్నాయనే” అనుకొంటాను.

రాజకీయ సమస్యలమీదకూడా అతని దృష్టి అదే విధానంలో ఉండటమే చిత్రం. న్యూయార్కులో కట్టర్‌కు సోషలిస్టు స్నేహితు డొకడున్నాడు.

సోషలిస్టుసూత్రాలను గురించికూడా “కట్టర్”, చాలా మాట్లాడుతూంటాడు. కాని అతని ఓటు యిచ్చేటప్పుడు ఈ సూత్రాల ప్రభావం ఏమాత్రం కనబడదు.

ఒకసారి నాతో “ఏమండి నిన్న రేడియోలో ‘ఊరిపెద్దలసమావేశం’ విన్నారా -బలే చక్కని ఉపన్యాసా లిచ్చారు.” అన్నాడు.

“ఏ విషయంమీదా?”

“ఆ! ఏదో అదంతా జ్ఞాపకం లేదు. ఏదో యుద్ధాన్నిగురించి అనుకొంటాను” అన్నాడు.

ఇంకోవిషయంకూడా నాకు ఆశ్చర్యమేస్తుంది. “ఈపూర్వకాలపువాళ్లకు”, వ్యవసాయవృత్తికారణంగా, ప్రకృతితో ఇంత సన్నిహిత పరిచయం ఉంటుందికదా, కవులు వీళ్ల కుంటుందని వర్ణించే, ప్రకృతి రమ్యత్వంలో ఆకర్షణ నిజంగా వీళ్ల కుంటుందా అని పరిశీలించాను.

చాల నాళ్లదాకా లేదనే అనుకొన్నాను. కాని చాలా నికృష్టుడు అనుకొన్న ఒక ముసలి కర్షకుడులోనే, ఈ ఆకర్షణ, ఈ తాదాత్మ్య భావం ఒకసారి చూచాను. ఒకనాడు అతను అన్నాడు: “నా జీవితం ఇక్కడ సుఖంగానే గడిచిం” దన్నాడు. ఆ కళ్లల్లోకిచూస్తే, కవులలాగ బైటికి చెప్పకపోయినా ఆ ఆనందం వీళ్లల్లో ఉందని తెలిసింది. ప్రకృతి ఆనందాలనన్నిటినీ, తన అనుభవాలకొలతల్తోటే, తన స్వార్థాల ప్రభావంలోనే అతను ఆనందిస్తాడు. వాతావరణం విషయంలో అతను మాట్లాడినప్పుడల్లా, తన అవసరాలలో వాతావరణం ఎంత ఉపకరించిందో - ఆ ప్రమాణంలోనే అతను వాతావరణాన్ని అర్థం చేసుకొనేవాడు.

“ఇవాళ మంచి ఎండ కాసిందికాదూ!” అంటే “కాసింది, కాయదనే అనుకొని మోసపోయాను”అని చిరునవ్వు నవ్వేవాడు. మబ్బులు పట్టి ముసురులు గమ్మాక, చివరినాడు సూర్యుడు కనబడితే, అతని కెంతో సంతోష మయేది. “తుపానుగాలిగా ఉందంటే” - పొయ్యిసెగను కూర్చుని అంత సంతోషంగానూ, “ఆ! ...తే చెడ్డతుపానుకే” అనేవాడు.

అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా ప్రకృతి చర్యలు అతనికి, ఒక్క చక్కని నాటకాన్నో, ఒక మహావిద్యాప్రదర్శనాన్నో చూస్తున్న సంతోషాన్ని, ఉత్సాహ ఉద్రేకాలనూ కల్పించగలగటంమాత్రం నిజమని నాకు అనిపించింది.

ఈ పల్లెపట్టుల్లో, ప్రతి చిన్న సంఘంగాని, ఫ్యాక్టరీ పరిసరంగానే, పదిమంది ఇరుగూపొరుగూ ఉన్న మరే చోటునైనాగాని, ప్రతి గుంపులోను, ఎవరో ఒకమనిషికి మాట అంటే మంచి విలువ ఉంటుంది. సాధారణంగా ఈ మనిషికి రాజకీయాలలో ప్రముఖస్థానం అంటూ ఏమీ ఉండదు. ధనికుడుగా కూడా ఉండక్కర్లేదు. కాని అతని మాటంటేమాత్రం అతి గౌరవం ఉంటుంది. అతని వ్యక్తిత్వంవల్ల వాళ్లలో అతనిమాటకున్న విలువ, ఏ పత్రిక సంపాదకీయానికీ, ఏ నాయకుని ఉపన్యాసానికీ కూడా, ఉండదు.

ఈపలుకుబడి ఉపన్యాసాల ద్వారా రాదు, ఇరుగుపొరుగూ ఒకరిమాట ఒకరు కలబోసుకోటంలో వస్తుంది.

మంగలిషాపు లోనూ, హోటళ్లలోనూ, ఇరుగుపొరుగు సంభాషణలుగానే ఈ పలుకుబడులు పెరుగుతాయి. అయితే వాళ్లు మాట్లాడుకొనే విషయాలు మాత్రం స్థానికవిషయాలే అయిఉంటాయి. ఊళ్లో పుట్టుక, చావు - ఎవరికో కొత్త ఉద్యోగం - ఊళ్లోకి కొత్తమనిషి రాక, ఆస్తులు అమ్మకాలు, మార్పులు, ఈ విషయాలే ప్రాతిపదికలుగా సంభాషణలు సాగుతాయి. అల్లాంటిచోట్ల బాహాటంగా రాజకీయ ప్రచారాలు సాగించటానికే వీలు అవదు. ఒకొక్కప్పుడు ఆ మనిషి తనందలి పార్టీ సూత్రాలనుగాని ఆచరణలనుగాని ఏమాత్రం సంభాషణలోకి రానియ్యక్కరలేకుండానే, కేవలం తన భావాలు మాత్రమే తాను వెల్లడిస్తాడు. అంతే, ఆమాటే అక్కడి నల్గురూ పట్టుకొని కబుర్లు సాగించుకొంటారు. ఇల్లా తలపోతలలో కేవలం వార్తలే కాదు తెలిసేవి. అనాలోచితంగా, ఆ ఒక్కడి అభిప్రాయాన్నే, మంచిచెడ్డల విచారణ అక్కర్లేకుండానే వాళ్లు తమకు అంకితం చేసుకొంటారు.


ఇరుగూ పొరుగుల మంచి చెడ్డలను మించి పల్లెటి మనిషి తన సంభాషణలను విస్తరించుకోడు. అందుచేత వాళ్లవీ వీళ్లవీ కష్టసుఖాలూ, జబ్బులూ, చావులూ, పుట్టుకలూ వాళ్లనీ వీళ్లనీ గురించిన అపవాదులూ, అభాండాలూ, ఇవే సంభాషణలకు పోషకంగా ఉంటాయి.

అంటే పల్లెటి జనం కేవలం అమాయకంగా తమ ఒకొక్కరి విషయం మాత్రమే ఆలోచించుకొంటూ కూర్చునే అమాయకు లనక్కర్లేదు. వాళ్లకీ రాజకీయపక్షాలూ, మతపక్షాలూ, ద్వేషాలూ, కక్షలూ, ఉంటాయి. కాని ఈ రాజకీయపక్షాల తత్త్వాన్ని అడుగంటిచూస్తే, స్థానికంగా ఉన్న ఫలాన ఫలానవ్యక్తుల మీద ఉన్న అభిమాన ద్వేషాలవల్లే, ఆ రాజకీయపక్షాలూ, మతపక్షాల, మీది అభిమాన ద్వేషాలుంటాయి.

“ప్రజాభిప్రాయం కావలసిన ప్రజాస్వామ్య ప్రాతిపదిక సమస్యలు, మీద” వీరి పరిష్కారాభిప్రాయాలు, అభిమానాలూ కూడా, పై వాటిలాగే, వ్యక్తిగత అభిమానద్వేషాల పరిష్కారంలోనే ఇటూ అటూ మొగ్గవాల్చుకుంటాయి తప్ప, సమస్య యొక్క ప్రాతిపదిక సూత్రాలను అవగాహన చేసుకోటం మీద కాదు.

ఒకసారి రాక్స్‌బర్గు గ్రామ పంచాయితీ సభలో, ఊరివా రందరికోసం ఉమ్మడి ఆస్తిగా ఒక భూమిని కొందామని ఒక సూచనవచ్చింది. పంచాయితీసమావేశాలకు వచ్చేవాళ్ళే కొద్దిమంది. ఆకొద్దిమంధీ, సభ్యులుకాని తదితర గ్రామస్థులూకూడా అభ్యంతరం చెప్పారు.

(17 వ పేజీ చూడుడు)



★ ఐక్యరాజ్యసమితి సమావేశం
★ షాంఘై ముట్టడి

ఐక్యరాజ్యసమితి సమావేశం ఈవారం ముగిసింది. ప్రపంచంలో శాంతి నింతవరకూ కాపాడుతున్నది ఈ సమితే నని సమితి అధ్యక్షు కార్యదర్శులు పదేపదే చెప్తున్నారు. కాని సమితి నిర్జీవమైపోయిందని ప్రపంచమంతటా ప్రజలు అనుకుంటున్నారు. ప్రపంచంలో శాంతి ఇప్పు డెక్కడా లేదు. అంతర్యుద్ధాలు, సామ్రాజ్య వాదుల దురాక్రమణలనుంచి తప్పించుకోగలిగిన దేశాలలో ఆర్థికకల్లోలం ప్రజలకు శాంతిజీవనానికి అవకాశం ఇవ్వడం లేదు. రష్యా అమెరికాల శత్రుత్వాల మధ్య పడి అన్యదేశాలు నలిగిపోతున్నాయి. తృతీయ ప్రపంచసంగ్రామానికి రష్యా అమెరికాలు సిద్ధమౌతున్నాయి. ప్రపంచ వ్యాపారం, వాణిజ్యం పరిశ్రమలు అన్నీ యుద్ధకాలంలోవలెనే నిర్బంధాలకు ఒత్తిడికి లోబడినాయి. యుద్ధభీతి, సర్వత్రా వ్యాపించింది. యుద్ధభీతివల్ల ప్రభుత్వాలు ప్రజోపయోగమైన కార్యక్రమాలు విడిచి యుద్ధపరిశ్రమల్ని వృద్ధిపరుస్తున్నాయి. దేశరక్షణ ఒడంబడికలు, రాజ్యకూటాలు ఏర్పడుతుంటే ఐక్యరాజ్యసమితి నిస్సహాయంగా చూస్తూ ఊరుకుంటోంది. ఈ కార్యకలాపాలన్నీ ప్రపంచశాంతి సాధనకోసమేనని ఆయా దేశాలు చెప్తున్నాయి. ప్రపంచవాణిజ్యం పరస్పర ఆర్థిక సహాయ కార్యక్రమాలు యుద్ధనీతి ఆధారంపైనే నడుస్తున్నాయి.

యుద్ధభీతి ప్రజల ఆర్థికజీవనాన్ని ఏరీతిగా భగ్నం చేస్తోందో, వ్యక్తుల ప్రాణాల్ని కూడా అదేరీతిగా బలితీసుకుంటోంది. అమెరికాలో రూజ్వెల్ట్ ప్రభుత్వంలో దేశరక్షణశాఖామంత్రిగా పనిచేసి ఈ సంవత్సరం మార్చి నెలలో రాజీనామా నిచ్చిన ఫారెస్టల్ యుద్ధభీతివల్లనే ఆత్మహత్య చేసుకున్నాడట. యూరప్‌లో ప్రజలు నాయకులు తూర్పునుంచి పడమరకు, పడమరనుంచి తూర్పుకు పారిపోయి తలదాచుకోడానికి యత్నిస్తున్నారు. యుద్ధభీతి న టికి హెచ్చిపోతుండగా సమితి కాపాడిన శాంతి ఎక్కడుంది? శాంతి అనేమాట అగ్రరాజ్యాల రాజకీయచతురంగంలో తంత్రాలకు ప్రత్యక్షహేతువాదంగా మాత్రం మిగిలింది.

ఇటాలియన్ వలసలు:

ఆఫ్రికాలోని ఇటాలియన్ వలసలగురించి సమితి చర్చించిపెట్టి నిర్ణయం చెయ్యలేక వచ్చే సమావేశానికి విడిచిపెట్టేసింది. అగ్రరాజ్యాలు పరిష్కరించలేక విడిచిన ఈ సమస్యను సమితి కూడా పరిష్కరించలేకపోయింది.

ఆఫ్రికాలోని వలసలగురించి బ్రిటిష్ విదేశాంగ మంత్రి బెవిన్ ఇటాలియన్ విదేశాంగ మంత్రి స్ఫోర్జతో లాలూచీ అయినాడు. రష్యాతో చేయమన్న యుద్ధంలో ఉత్తర ఆఫ్రికా ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలకు ప్రధాన మిలిటరీ స్థావరం కాగలదు. అందువల్ల ఎలాగైనా ఉత్తరాఫ్రికాను తమ అదుపులోనే పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఈ పన్నాగం పన్నాడు బెవిన్. ట్రిపోలిటానియాను ఇటలీకి కట్టబెట్టి సిరనైకు, లిబియాలలో బ్రిటన్ స్థిరపడాలని ఈ లాలూచీ ఆంతర్యం. సమితి సర్వసభ్య సమావేశంలో ఆంగ్లో ఇటాలియన్ ప్రతిపాదించిన తీర్మానంలో ఇది ముఖ్యమైన భాగం. దక్షిణమెరికాదేశాలన్నీ ఈ తీర్మానాన్ని బలపరిచాయి, రాజకీయసంఘంలో ఈతీర్మానం కొద్దిలో వీగిపోయింది. సర్వసభ్య సమావేశంలో తీర్మానం నెగ్గించుకోడానికి దక్షిణమెరికా ప్రభుత్వాలు శతవిధాల యత్నించాయి. ఆస్ట్రేలియాను తమపక్షానికి కూడగట్టుకున్నాయి. రాజకీయసంఘంలో ప్రతికూలంగా వోటుచేసిన ఇథియోపియా, సయాందేశాలు, తటస్థంగా ఉండడానికి అంగీకరించాయి. ఇంక ఈకుతంత్రం సర్వసభ్య సమావేశంలో నెగ్గుతుందని అందరూ ఆశపడ్డారు. అయితే రాజకీయ సంఘంలో తటస్థంగా ఉన్న భారతదేశం ఇప్పుడు ప్రతికూలంగా వోటుచెయ్యడంతో తీర్మానం వీగిపోయింది. అయితే ఒక విషయం ఇప్పుడు స్పష్టపడింది. రంగుజాతుల ప్రజలకు సంబంధించిన వ్యవహారాలలో శ్వేతవర్ణజాతులు అన్నీ ఒకటేననీ, రంగుజాతుల వారిని అణచిఉంచడమే తెల్లజాతులవారి కోరిక అనీ మరొకసారి ధృవపడింది.

ఆంగ్లో-ఇటాలియన్ తీర్మానంలో మిగతా భాగాలు ఆమోదించబడినప్పటికీ ముఖ్యాంశం నిరాకరించబడినందువల్ల, దక్షిణమెరికా దేశాలు, బ్రిటన్ కలిసి తీర్మానం మొత్తాన్ని నిరాకరించాయి. చివరికి దీర్ఘచర్చఅంతా వ్యర్థమయిపోయింది. తిరిగి సెప్టెంబర్‌లో సమితి ఈ విషయం చర్చించవలసివస్తుంది.

దక్షిణాఫ్రికాలో భారతీయుల దుర్గతికి సంబంధించిన సమస్యపైకూడా సమితి చర్చ నిరర్థకమయిందనే చెప్పవచ్చును. దక్షిణాఫ్రికా, భారతదేశం, పాకీస్తాన్ ప్రభుత్వాలు రౌండ్ టేబిల్ సమావేశం జరిపి దక్షిణాఫ్రికా ప్రభుత్వం అక్కడ భారతీయుల్ని మానవ స్వత్వాధికార సిద్ధాంతాలకు విరుద్ధంగాగాని, ఐక్యరాజ్యసమితి సిద్ధాంతాలకు విరుద్ధంగాగాని నిరాదరిస్తున్నదేమో విచారించాలనే తీర్మానాన్ని సమితి ఆమోదించింది. కాని దక్షిణాఫ్రికా మొదటినుంచీ సమితి ఆదేశాలను ధిక్కరిస్తూనేవచ్చింది. రౌండ్ టేబిల్ సమావేశం జరపడానికి దక్షిణాఫ్రికాప్రభుత్వం నిరాకరించేపక్షంలో సమితి ఏమి చేయగలదో తెలియదు.

హంగేరీ, బల్గేరియా దేశాలలో క్రైస్తవమతాచార్యులపట్ల ప్రభుత్వ దమననీతిని విమర్శిస్తూ, మానవ స్వత్వాలు కాపాడే విషయమై సమితి కొన్ని నిర్ణయాలు చేసింది. కాని మానవస్వత్వాలను మన్నించనిపక్షంలో ప్రతీకారం ఏమి చేయగలదు? ఇట్టి తీర్మానాలు నిరర్థకాలేనని పూర్వానుభవం నిరూపిస్తోంది. ఇంక సమితి సాధించ గలిగిన దేమిటి?

హైద్రాబాదు సమస్య భద్రతామండలిలో తిరిగి చర్చకు తేబడింది. ఈ విషయం చర్చనీయాంశమేనా అనే ప్రశ్నపై పాకిస్తాన్ భారత ప్రభుత్వాలు వాదించాయి. భారతప్రభుత్వం చర్చలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు.

కాశ్మీర్, హైదరాబాద్, పాలస్తీనా, ఇండొనీషియా సమస్యల పట్ల భద్రతామండలి చర్చలు, నిర్ణయాలుచూస్తే ఏ సమస్యను గాని శ్వేతవర్ణజాతుల ప్రభుత్వాలు న్యాయదృష్టితో పరిశీలించి ప్రవర్తించడం లేదని తెలుస్తోంది. స్వార్థాశయాలు, అగ్రరాజ్యాల వైషమ్యాలే ప్రతి సమస్యలోనూ తల చూపెడుతున్నాయి. సమితి వ్యవహారాలన్నీ కుంటుపడినందు వల్లనే దేశాలన్నీ స్వతంత్రించి సమితి సిద్ధాంతాలకు విరుద్ధంగా దేశరక్షణ కూటాలు ఏర్పరచుకుంటున్నాయి. ఆసియా ఖండ దేశాలుమాత్రం ఒకత్రాటిపైనడవలేవని తెలిసిపోయింది శ్వేతవర్ణ తంత్రాలు నిరాటంకంగా సాగిపోతున్నాయి.

తెల్ల- జాతుల వైఖరి:

తెల్లజాతులవారి వైఖరి ఆసియాఖండదేశాల పట్ల ఏరీతిగా ఉందో మరొక విషయం చూస్తే తెలుస్తుంది. యూరప్ ఆర్థిక పునర్నిర్మాణానికి వందలాది కోట్లడాలర్ల చొ॥ వెచ్చించిన అమెరికా, దక్షిణమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని ప్రజలదుస్థితినివారణకు రెండున్నర కోట్ల డాలర్లుమాత్రం వెచ్చించడానికి నిర్ణయించారట. ఈ ధనం ఎందునా కొరకుండా ఎవరికీ ఉపయోగపడకుండా పోకతప్పదు. ఈసహాయం చేసినా ఒకటే చెయ్యకపోయినా ఒకటే. జాతీయపారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాల్లో బ్రిటన్ అమెరికాలు ఆసియాదేశాల పట్ల అవలంబిస్తున్న వైఖరిచూస్తే, ఈదేశాలమే లెప్పుడూ తమ కీడుగా వారు భావిస్తున్నట్లు తోచకమానదు. ఇండొనీషియా రిపబ్లికన్ల ఉద్యమంపట్ల పైపైకి ఎంత సానుభూతి చూపినా, డచ్చివారిని వారించడం అమెరికాకు వాస్తవంగా ఇష్టంలేక ఊరుకున్నదని తెలుస్తూనే ఉంది. ఇండోచీనాలో జాతీయోద్యమంపట్ల అమెరికా నిరసన సర్వజన విదితమే. నిత్యం వారిని కమ్యూనిస్టులని చెప్తూ వారికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్నారు. మలయాలో కార్మికోద్యమాన్ని అణిచివెయ్యడానికి కమ్యూనిస్టులనే పేరుతో నాయకులందర్నీ బ్రిటిష్‌పాలకులు నాశనం చేస్తుంటే అమెరికా ఆమోదం తెలిపింది. హైదరాబాదు, కాశ్మీరు సమస్యల సందర్భంలో అమెరికాలో ఆదినుంచీ భారతదేశానికి విరుద్ధంగా ప్రచారం జరుగుతూనే వుంది. వీనిని శ్వేతజాతులలో కొందరెంతగా జాతియోద్యమాలను స్తుతించినా రంగుజాతులవారికి సంబంధించిన విషయాల్లో వారంతా ఒకటేనని తెలుస్తోంది.

జర్మనీ సమస్య:

జర్మనీతో సంధి సమస్యనుగురించి చర్చించడానికి రష్యా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు దేశాల విదేశాంగమంత్రు లీవారం పారిస్‌లో సమావేశమౌతున్నారు. ఈ సమావేశానికి ముందు అమెరికన్, బ్రిటిష్ ఫ్రెంచి విదేశాంగమంత్రులు వారిలో వారు సమాలోచనలు జరిపారు. వారి ముగ్గురి మధ్యనూ అభిప్రాయ భేదాలు పరిష్కరించుకుని, రష్యాతో ఎలా తలపడాలో నిర్ణయించుకున్నారు. జర్మనీ భవిష్యత్తుగురించి నాలుగురాజ్యాలమధ్యనూ సమాధానం కుదిరితే దీనితో రష్యా అమెరికాలమధ్య విరోధం తీరిపోతుందని అగ్రరాజ్యాలలో రాజకీయవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కాని ఏదో ఒక పక్షం పూర్తిగా తన విధానం మార్చివేసుకుంటేగాని ఇది సాధ్యపడదు. జర్మనీదేశంఅంతకీ ఒకే ప్రభుత్వం స్థాపించాలని నలుగురూ అంటారు. కాని పశ్చిమజర్మనీలో ఫెడరల్ రిపబ్లిక్ స్థాపనతో ఈ అవకాశం సన్నగిలింది. పశ్చిమ రాజ్యాలవారు ఈ ఫెడరల్ రిపబ్లికన్ రాజ్యాంగంలోనే తూర్పుజర్మనీకూడా చేరాలంటారు. దీనికి రష్యా అంగీకరిస్తుందా? పశ్చిమజర్మనీ రిపబ్లిక్‌ను భగ్నపరచడానికి పశ్చిమరాజ్యాలు అంగీకరిస్తాయా? రష్యా అంగీకరించినా మరొక ఎత్తేదో వేస్తుందనే అనుమానం పశ్చిమరాజ్యాలవారిని పీడిస్తోంది. ఈపరిస్థితిలో సమస్య పరిష్కార సాధ్యంకాదని తోచకమానదు.

జర్మనీనుంచి అగ్రరాజ్యాలు తమతమ సైన్యాల్ని ఉపసంహరించుకోవాలని రష్యా ప్రతిపాదించగలదని కొందరు తలుస్తున్నారు. పశ్చిమరాజ్యాలు జర్మనీలో సముద్రతీర ప్రాంతంలోని నగరాలకు సైన్యాల్ని తర్లించడానికి అంగీకరించగలరని తెలుస్తోంది. జర్మనీ భవిష్యత్తునుగురించి, జర్మనీకి ప్రత్యక్షశత్రుత్వం వహించిన దేశాలన్నిటితో జర్మనీశాంతి సమావేశం జరపాలని రష్యా కోరవచ్చును. ఈ ప్రతిపాదనకు పశ్చిమ ప్రభుత్వాలు అంగీకరిస్తే, ఈ శాంతి సమాలోచనల్లో యూరప్‌లోని పశ్చిమ ప్రభుత్వాలూ తూర్పు ప్రభుత్వాలూ కూడా పాల్గొనాలి, అంటే రెండు సమఉజ్జీ లేర్పడతాయి. రష్యా అమెరికాల తగవు తిరిగీ అక్కడ తీవ్రతరం కావచ్చును. జర్మనీలో నాజీలనణచలేకపోయిన పశ్చిమ ప్రభుత్వాలకు, ఐక్య జర్మనీ రాజ్యస్థాపన ఏ పరిష్కారమార్గమైనాసరే రుచించకపోవచ్చును. అందువల్ల ప్రస్తుత పరిస్థితే ఉండిపోవడానికి ప్రత్యక్షంగా కాకపోతే ప్రచ్ఛన్నంగానైనా పశ్చిమ రాజ్యాలు యత్నించగలవు. దీన్ని భగ్నపరచడమే రష్యా ఆశయం.

బెర్లిన్ దిగ్బంధన తొలగించబడినా నగరవాసులకు కష్టనివృత్తి కాలేదు. సోవియట్ అధికారుల పర్మిట్లు లేవని కొన్ని రోజులు రవానా నిలిపివేయబడింది. అడపాదడపా ఆటంకాలతో రవానా తిరిగి సాగిపోవచ్చేసరికి నగరంలోని పశ్చిమప్రాంతాల రైల్వే కార్మికులు సమ్మె ప్రారంభించారు. బెర్లిన్‌నగరంలో పశ్చిమప్రాంతాలు పశ్చిమప్రభుత్వాల అధీనంలోనే ఉన్నప్పటికీ, రవానా అంతా రష్యన్ల నిర్వహణలోనే ఉంది. పశ్చిమ ప్రాంతాల్లోని రైల్వేకార్మికుల్ని, రష్యన్ అధికారుల్ని ఇబ్బంది పెట్టడంకోసమే పశ్చిమప్రాంతాల పాలకులు సమ్మెకు పురిగొల్పారని రష్యన్ అధికారులు నిందారోపణ చేశారు. బెర్లిన్‌నగర రవానా అంతా రష్యన్ అధికారుల అధీనంలోనే ఉన్నప్పటికీ, వారి ప్రాబల్యం తగ్గించడానికి పశ్చిమ ప్రభుత్వాలు ఈ తంత్రం పన్ని ఉండవచ్చును. బెర్లిన్ దిగ్బంధన తొలగింపువల్ల విజయం తమదేనని నిరూపించుకోడానికి ఉభయపక్షాలూ యత్నిస్తున్నాయి. ఈ యత్నాల ఫలితమే ఈ తాత్కాలికాటంకాలు, ఈ సమ్మె? విదేశాంగ మంత్రుల సమావేశ సమయానికి సమ్మె జరగడంలో ఇదే ఆంతర్యం. కార్మికులు చెప్తున్న కారణంమాత్రం సోవియట్ అధికారులు కార్మికులు కోరినప్పటికీ వారి వేతనాల్ని పశ్చిమప్రాంతంలో చలామణిలో ఉన్న మార్కులలో చెల్లించకపోవడం.

షాంఘై ముట్టడి:

షాంఘైనగరం ముట్టడి మే 11వ తేదీని ప్రారంభ మయిందని చెప్పవచ్చును. చీనాజాతీయ ప్రభుత్వానికి షాంఘై యుద్ధం తరవాత ఇంక యుద్ధం చేసే శక్తి ఉడిగిపోతుంది. అమెరికన్ మిలిటరీ నిపుణులచేత శిక్షణ నిప్పించి ఫార్మోజా దీవిలో ఇంతకాలం కూర్చోనున్న బలాన్ని షాంఘైలో వినియోగిస్తున్నారు. ఇప్పటికే జాతీయ సైన్యం నలుదిక్కులా చెల్లాచెదరైపోయింది. కాంటన్ రక్షణకు నిలువరించబడిన సైన్యంలో రెండు దళాలు కమ్యూనిస్టులతో కలిసిపోయాయి. కమ్యూనిస్టుదళాలు చాంగ్ కై షేక్ జన్మస్థానంపైకి శీఘ్రగమనంతో పోతున్నాయి. మరికొన్ని దళాలు నైఋతి దిశగా పురోగమిస్తున్నాయి. ఈ రీతిగా జాతీయ సైన్యాల్ని నాలుగు పాయలుగా విభజించారు. వీనిలో అధికబలం షాంఘై నగరంలో కేంద్రీకరింపబడింది. నగరరక్షణకు మూడు లక్షలమంది జాతీయసైనికులు పోరాడుతున్నారు. నగరంలో ఆరులక్షల ప్రజ లున్నారు.

ఈ నగర రక్షణ శ్రేణుల్ని భేదించి నగరం ప్రవేశించడం కమ్యూనిస్టుల ఉద్దేశ్యం కాదు. నగరాన్ని చుట్టుముట్టి జాతీయసైన్యాలు పారిపోడానికి వీల్లేకుండా ముట్టడించడం వారి ప్రధానలక్ష్యం. నగరాన్ని అంతనీ చుట్ట

(21-వ పేజీ చూడుడు)

టెంకణాదిత్యకవి చోడునిదేశకాలములు

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

జోను తెనుగు కుమారసంభవ కవి నన్నెచోడరాజను టెంకణాదిత్యుని దేశకాలములు ప్రబంధములో వ్యంగ్యవస్తు కవితగా సూచిత మైనవో? కాలేదో? పరిశీలింతము.

కావ్యావతారికలో చోడకవి వాచ్యముగా "పాకనాటియం దిరువదియొక్క వేయిటి కధీశుడు నాజనుచోడబల్లి కిఁ—శ్రీసతికిఁ—తనూజుడఁ,బరయూరి కధిపతి నలఘుపరాక్రముడఁ - టెంకణాదిత్యుండఁ" నే నన్నాడు. కాని, తండ్రి "పాకనాటి కధిపతి"కాగా, కుమారుడు "తమిళనాటి కధిపతి"కాడు. ఇది "ప్రాచీన రాజధాని" పేరు.

దేశకాలములు

కావ్యాంతకథలో "అయ్యుదయనగము" వస్తుకవిత కథేతరవ్యంగ్యముగా ఇట్లున్నది.

"ద్వాదశార్ధార్ధనియను నా ద్వాదశార్ధవదను డొగి జుట్టి నిజభుజద్వాదశమున నుదయదశశత కిరణు డయ్యుదయనగము గిట్టి దశశతకిరణముల జుట్టినట్లు." (కుమార. 12-215)

దీనిలో "ఉదయసూర్యు డుదయాద్రిని సమీపించి తనకిరణములతో దాని నావరించునట్లే, ఆ కుమారస్వామి తనతండ్రి శివుని సమీపించి కౌగలించె"ననుట కథాన్వయము.

దీనిలో కథతప్ప, మరేవిశేషార్థములు లేవనుట కంటె,వ్యంగ్యార్థమున్నదనుటే గణితసిద్ధాంతము. "యువాదిత్యుడు (యువరాజు టెంకణాదిత్య కవి) పాకనాటియందలి అయ్యుదయగిరిని సమీపించి, నిజభుజబలముతో దానిని ముట్టడించెను." ఇట్లున్నదనగా "కుమారుడు తనతండ్రిని సమీపించి తన చేతులతో నాతనిని కౌగిలించినట్లు" తోచుచున్నది. వ్యంగ్యకవి టెంకణాదిత్యుని బిరుద మిట్లు సార్థక మగుచున్నది.

ఇట్లే తేటగీతినంతను సంఖ్యలతో పేర్చుటకు కారణ మేదైన నుండకపోదు. ఇవి గణిత సమభాగసంఖ్య లన్న కథాన్వయము చెడును.

పూర్వార్ధగీతిలో "ద్వాదశార్ధార్ధ" సంఖ్య లొకరివిగాను, "ద్వాదశార్ధ......ద్వాదశ" సంఖ్య లింకొకరివిగాను విభాగమై యున్నవి. ఇట్టివి రెండు "12—6—3(+21), 12-6-12 (+30)" తీసివేత సంఖ్యలోగా మారి ప్రత్యేక ప్రత్యేక సంఖ్య లగుచున్నవి. తీసివేత సంఖ్యలతో తీసివేతలెక్క నూహింపవచ్చును. ఇది యొక పక్షము.

తదుత్తరార్ధగీతిలో "దశ శత..... దశశత" సంఖ్య లిద్దరికి సమభాగములుగా విభాగమై యున్నవి. ఇవి రెండు "10×100=1000, 10×100=1000" పెంపకపు సంఖ్యలై ప్రత్యేక ప్రత్యేకముగా నున్నవి. పెంపకపు సంఖ్యలతో పెంపకపు లెక్క నూహింపవచ్చును. ఇది మరియొక పక్షము.

ఇక నీ పెంపకము - తీసివేత లెక్కలఫలితము లేమగునో లెక్కింతము. (సమభాగసంఖ్యలలో "30—21=9" (తొమ్మిది) వ్యత్యాసము "నవ" కవిశేషమును ధ్వనించుచున్నది).

1000—సమ—1000

21—భిన్న—30

21,000 × గణితం—970.

"వ్యంగ్యార్థము వక్తృ, బోద్ధవ్య, ప్రకరణ, దేశకాలాదులనుబట్టి తెలియు"నన్న వ్యంగ్యకవి దేశకాలముల ఫలితము లివి.

మొదటి పెంపకములెక్క చోడకవి వాచ్యముగా పేర్కొన్న పాకనాటియం దిరువదియొక్క వేయిటి కధీశుడు" అన్న వ్యంగ్య సంఖ్యను తెలుపుటయేగాక, "అయ్యుదయనగము—అయ్యుదయగిరి" పాకనాటి రాజధాని యనికూడ తెల్పుచున్నది. మరియు "ఉదయకిరణుడు - యువాదిత్యుడు (యువరాజు టెంకణాదిత్య కవిచోడుడు)" "అయ్యుదయగిరి పాకనాటియం దిరువదియొక్క వేయిటి కధీశుడు"అనికూడ ధ్వనించుచున్నది. దీని కనుగుణముగా పెద్దచెరుకూరు శాసనమందలి చోడకవివంశీయులు "కందుకూరి పురవరేశ్వర...పాకనాంటి విషయ ఏకవింశతి సహస్రగ్రామావనీవల్లభ" ప్రశస్తిని [క్రీ. శ. 1209 లో] ప్రకటించియున్నారు.

హైద్రాబాదురాజ్యమందలి ఉప్పరపల్లి శిలాశాసనములో "ఉదయగిరి సాధించి పడియ రాయనిం దోలి (న)......రాజె నాయకుని" ప్రస్తావన క్రీ. శ. 1235-36 నాటిదికాక, శాసనదాత తండ్రికాలము నాటిది కనబడుచున్నది. ఇవి రెండు "కాకతీయగణపతి" సామంతులు ప్రకటించిన కాలము నాటివి.

నెల్లూరుజిల్లా పాకనాటిలో "అయ్యుదయగిరియు, కందుకూరును ప్రక్కప్రక్కనున్న సరిహద్దు తాలూకాలుగా నిప్పుడును,రాజధానలుగా పూర్వమును కలిసిమెలిసియున్నవి. పాతకోటలిప్పటికిని శిథిలములై కనబడుచున్నవి. నెల్లూరు జిల్లా శాసనములలోని "ఉదయగిరిరాజ్యానకుం జె(ల్లి)ల్లు కందుకూరిశీమ" సంబంధము చాల కాలము చెడలే దని తోచుచున్నది.

23-3-1091 తేదినాటి నన్నూరి శాసనములో "పొ(త్తె) పిచోడు" బిరుదు "పొత్తపియచెన్నగు పీడుగవాలి పాకనాం డిరువదియొక్క వేయిం జన నేలుచు" ఉన్న "పొత్తపిచోడవంశ" చరిత్ర నెరిగించుచున్నది. ఇదే పూర్వము "కరికాల చోడవంశము, ఒరయూరి చోడవంశము, సూర్య వంశము" అని మారుపేర్లతో పిలవబడుచున్నది. వెనుక నీ నన్నూరు గ్రామము పాకనాటి ఒంగోలు తాలూకాలో చేరినదైనను, ఇప్పుడది నెన్నూరుపాడై పాకనాటి కందుకూరు తాలూకాలో కలిసిమెలిసియున్నది. ఇప్పుడా మసియొద్ద నెన్నూరుపాడులో పురాతన శిథిల దేవాలయ మున్నది కాని, శిలాశాసనము లున్న రాళ్ళు కనబడలేదు. చిక్కలేదు. ప్రభుత్వకార్యాలయములో విచారించగా ప్రతిబింబమూలములు లేవని శాసనాధికారి తెల్పినాడు. కనుక, దీనిలో శిల్పిచెక్కిన చూచి వ్రాతతప్పను మరల మూలముచూచి పరిదిద్దుటకు వీలు చిక్కలేదు. చిక్కకపోయినను, పెద్ద చెరుకూరు శిలాశాసన ప్రమాణముతో తారుమారైన చోడవంశవృక్షమును, మరల పరిదిద్ద వీలున్నది. "బల్లెరాజు వీరి పుత్రుండు "కంట్పవంక్యరాజు"అని మార్చి శిల్పి చెక్కుట చూచివ్రాతదోషము. దీనిమూలము "కంటువెంకరాజు వీరి పుత్రుండు బల్లెరాజు వీరి కొడుక్క నన్నిచోడ" రాజుగా ఉండియుండును. దానకాలము లేని పెద్దచెరుకూరు శాసనములో "కంటు వెంకరాజు పేరు లేదు. కవి కావ్యమున కూడ లేదు. "చోడబల్లినృప స్తస్నా న్నన్నిచోడః" అన్నట్లే "చోడఒల్లికిం - శ్రీ సతికిం - తనూజుడు సత్కవి భువి నన్నెచోడుడు" కలదు. కనుక, శిలాశాసనములో కూడ నిట్లే, "(కంటువెంకరాజు వీరి పుత్రుండు) బల్లెరాజు వీరి కొడుక్క నన్నిచోడ" కవిగా చెక్కకపోవుట తప్పు. శిలాశాసనద్వయములో కవివంశము కొంత మార్పు లేకున్నది. "నన్ని చోడ - నన్నిచోడః, సూరపరాజు - సూర భూపః, రాజమహేంద్ర పొ(త్తె)పిచోడు - రాజరాజ మహీపతిః." ఇవి భిన్ననామము లనుట, భిన్నవంశము లనుట భ్రమ.

తరమునకు ముప్పది సంవత్సరముల పురుషాంతరకాలము లెక్కను నన్నిచోడకవికాలము లెక్కించవీ లున్నది. 23/3/1088 తేదీ నెన్నూరుపాడుకాలముతో దానకాలము లేని పెదచెరుకూరుకాలము నిర్ణయించ వీ లున్నది.

"అయ్యుదయగిరి" కవివంశ మునకును, "కందుకూరి" కవివంశీకుల వంశమునకును మధ్య దేశకాలభేదములు లేవు, నెన్నూరుపాడు కందుకూరు పాకనాటిలో నిప్పటికిని కలదు.

సూర్యవంశము

* * *

(1) నాగివంకన
క్రీ. శ. 938-968

(2) కంటు వెంకరాజు
క్రీ. శ. 968-998

(3) బల్లెరాజు
క్రీ. శ. 998-1028

(4) నన్నిచోడ
క్రీ. శ. 1028 - 1058

(5) సూరపరాజు
క్రీ. శ. 1058-1088.

(6) రాజమహేంద్ర
పొ(త్తె)పిచోడు.
క్రీ. శ. 23-3-1088 తేదీదానము.

మూలములో చెక్కినట్లు వరుస సంఖ్యలతో మార్చి చూపబడినది. ఇందలి చోడవంశవృక్షములో శిల్పి చూచి వ్రాత తప్పున్నట్లు చారిత్రకులు గమనించక, ఇది మరియొక వంశమని భ్రమించి వదిలి పెట్టినారేమో? అని నాకు తోచుచున్నది. నెల్లూరుజిల్లా శిలాశాసనములలో నిట్టి వంశవృక్షము మరియొకటి కనబడలేదు. (దానకాలములేని మరియొక శాసనము నెన్నూరుపాడులో నున్నది. దీని లిపి కాలము తెలియదు) ఇక, కడపటి తీసివేతలెక్క కవి వ్యంగ్యముగా సూచించిన "శుభోదయము - శా. శ. 970 కాలము" కాకపోదు. తెనుగునాటిలో శాలివాహనశకము వాడుట దేశాచారము. ఇది క్రీ. శ. 1048 సమకాలము. ఇట్టి సంఖ్యాగీతిలో అయ్యుదయగిరి కధిపతి టెంకణాదిత్యకవిచోడుని దేశకాలములు గణితనిదర్శన వ్యంగ్యసిద్ధాంతముగా కలవనుట చరిత్రప్రసిద్ధము.

కందుకూరి పాకనాటి నెన్నూరుపాడు శిలాశాసనమందలి "నన్నిచోడ"కవి (పురుషాంతర కాలము) క్రీ. శ. 1028-1058 మధ్యలోనిదే, అయ్యుదయగిరి పాకనాటి గీతి శాసనమందలి టెంకణాదిత్యకవి (గణిత నిదర్శన) కాలము క్రీ. శ. 1048. అయ్యుదయగిరి రాజధాని క్రమేణ కందుకూరి రాజధానిగా మారినదో, లేదో చారిత్రకులు నిర్ణయించుట శ్రేష్ఠము.

"ఒకప్పుడు (కవి) రమణీయముగా నుండుటకై నూటిమాటలతో జెప్పక, వేయిమాటలతో జెప్పియా యర్థమును సూచించును. ఇది వ్యంగ్యార్థము." విమర్శకు లన్నట్టిది "వొంకతిరుగుడు మార్గము"కాదు. మార్గకవి (స్తుతి) వ్యంగ్య మార్గము.

"వస్తుకవితను భారవియును బరగి, ఉదయపర్వతశిఖరాగ్రారోహణ-వర్ణనల జనారాధితు(డై)." ఇది "(భా-కాంతియందు) రవి-సూర్యుడు "కవియన్న శ్లేషవర్ణన ఇదే" నవభారవి-అభినవభారవి"దేశివస్తుకవితకాబోలన్న" టెంకణాదిత్యకవియు నయ్యుదయగిరి శిఖరాగ్రారోహణవర్ణనల వస్తుకవితను వర్ణించి జనారాధితుడై నవభారవి యన బరగె" ననుట కుదాహరణ కలదు. దీనికి "అయ్యుదయనగము-అయ్యుదయపర్వతము—అయ్యుదయగిరి" వ్యంగ్యసంఖ్యా వస్తు కవిత "నవ"కవిధ్వని చిహ్నముగా నిదర్శనమిచ్చుచున్నది. సమభాగసంఖ్యలలో "30—21=9" వ్యత్యాసమే ధ్వనిగా "నవభారవి—నవాదిత్యుడు" కవియని వ్యంజకముచేయుచున్నది. "నవకవి - నూతనకవి" శ్లేషవలన "నవ"సంఖ్య లోపించదు. ఉన్న సంఖ్యలున్నట్లే లెక్కలలో లెక్కించడమైనది.



సంగీతదర్శకుడు శ్రీ ఎస్. రాజేశ్వరరావుకు ఈమధ్య కాకినాడలో జరిగిన సత్కారసందర్భపు ఫోటో

కథానిక



మిత్రద్రోహి

శ్రీ వి సచ్చిదానంద శర్మ

ఉదయం వీధి అరుగుమీద కూర్చుని పళ్ళు తోముకుంటూ పరపరని తీరిగ్గా మొహం కడుగుతున్న వాణ్ణి కాస్తా పుల్ల అవతల పారేసి, పుక్కిలించి నీళ్ళు పుక్కిలించి రోడ్డుని పడ్డాను. బుఱ్ఱంతా ఒక్కసారి ఖాళీ అయిపోయిన ట్లనిపించింది; కొద్ది క్షణాలవరకూ నేనేం చేస్తున్నానో నాకే తెలీక పోయింది. అప్పటి నీ పరిస్థితినిగురించి ఆలోచిస్తుంటే - నిజంగా నే నానాడు శంకరశాస్త్రి చావునిగురించి అంత విచారించాల్సింది లేదేమో ననిపిస్తోంది. కాని, అప్పుడు తరవాత కొన్ని రోజులవరకుకూడా ఆ విషయాన్ని మరిచిపోలేక పోయానంటే. శంకరశాస్త్రి నాకు అప్తుడు కాకపోయినప్పటికీ, అప్తుణ్ణి చేసుకోవా లని అన్నాళ్ళూ ఉవ్విళ్ళూరటమే కారణమయుండాలి. ఇక నలాటి అవకాశం శాశ్వతంగా లేకుండా హఠాత్తుగా చనిపోయేసరికి నిజంగానే చాలా విచారించాను.

వీధి మలుపు తిరిగేసరికి వచ్చే జనం, పోయే జనం గల్లంతుగా వున్నారు. కాని, ఏడుపులు, పెడబొబ్బలుమాత్రం ఏమీ లేవు. సామాన్యుల ఇళ్ళల్లో అయితే అలాటి హంగామా అంతా వుంటుందికాని, శంకరశాస్త్రిలాంటి నాగరికుని ఇంట్లో ఏడుపు బయటి కెందుకు వినిపిస్తుంది? - చే, పోయేవాళ్ళ ముఖకవళికల్ని బట్టి త్వరగా ముందుకి అడుగు వేశాను. చివరిచూపులు కూడా అందవని ఇందాకనే గ్రహించాను. లోపలజనం చాలామంది మూగి వున్నారు. చిన్న చిన్న ఏడుపులుకూడా వినబడుతున్నై. జనాన్ని నెట్టుకుంటూ ముందుకి వెళ్ళి గబగబా మేడమెట్లు ఎక్కాను. జనమంతా శంకరశాస్త్రి పడకగదిలోనుంచి వస్తుండేసరికి లోపలికి అడుగు పెట్టాను.

అంత నెత్తురు కక్కుకు నిమంచం మీద పడున్న శంకరశాస్త్రిశవాన్ని చూచేసరికి హఠాత్తుగా ఈ వార్త ఎందుకు వినాల్సివచ్చిందో గ్రహించాను. దిండంతా పరుపు కొంత మేర - చెరువంత రక్తం మరకఅయి వుంది. అందులోనే బోర్లబడి శంకరశాస్త్రిశవం ఉంది. ఆ దృశ్యం చూచేసరికి ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచింది. ఇంతలో ఎవరో దుప్పటి తీసుకొచ్చి శవంపైన కప్పారు. ఇది సామాన్యమైన చావు కాదనీ, కాకపోతే అంత హఠాత్తుగా మరణించడనీ గుసగుసలు ప్రారంభించారు. నిజానికి, శంకరశాస్త్రి రక్తం కక్కుకుని చచ్చిపోయినట్లుంది. కాని, వంటిమీద దెబ్బ లేమీ లేవు. దానికితోడు ఈమధ్య శంకరశాస్త్రి దగ్గుతో బాధపడుతున్నాడని కూడా చాలామంది బలపరి స్తున్నారు. ఈ తర్జన భర్జన రోడ్డుపొడుగునా సాగుతుంది వచ్చేపోయే జనంలో. ఇదంతా చివరికి దేనికింద తేలుతుందోనని నాలో నాకే చాలా భయంగా వుంది.

వెంకటేశ్వర్లు అక్కడెక్కడన్నా కనిపిస్తాడేమోనని చూశాను. కాని, అతని జాడెక్కడా కనిపించలేదు. నే నెరుగున్నప్పటినుంచీ శంకరశాస్త్రి నీడలాగా మెలుగుతూ వచ్చిన వెంకటేశ్వర్లు ఇలాంటి ఆపత్సమయంలో అక్కడ లేడంటే చాలా ఆశ్చర్యపోయాను. వాళ్ళిద్దరి స్నేహం ఈనాటిది కాదు. నా కళ్ళ ముందు అనేకమంది స్నేహితుల మంటూ పూసుకు, పూసుకు తిరిగి - రెండోరోజుకల్లా ఈ జన్మలో కలియటానికి వీలులేనంత ఎడమొహాలూ, పెడమొహాలూగా మారటం నే నెరుగున్నాను. అలాటప్పుడు శంకరశాస్త్రి, వెంకటేశ్వర్ల స్నేహం చూస్తుంటే నా కెందుకో ముచ్చటవేసేది వాళ్ళ స్నేహం ఈ జన్మలో ఏర్పడింది మాత్రమే కాదనీ, చాలా పూర్వజన్మలనుంచీ ఇలాగే ఉండివుంటా రనీ అనుకున్నాను.

శంకరశాస్త్రితో స్నేహం చెయ్యా లని నేనూ చాలాసార్లు ప్రయత్నించాను ఆ రోజుల్లో అతను నాకు అత్యంతస్నేహపాత్రుడుగా కనబడేవాడు. వెంకటేశ్వర్లు అతనితో స్నేహం నిలుపుకోవటానికి ఆచరిస్తున్న పనులన్నీ నేను కూడా ఆచరించటానికి ప్రయత్నించేవాణ్ణి. కాని, అంతమాత్రంచేత అతనికి వెంకటేశ్వర్లంత స్నేహితుణ్ణి ఎప్పుడూ కాలేకపోయాను. పైగా, అతనిముందు నా చర్యలన్నీ ఏదో ఎరువు తెచ్చుకున్నట్లు నాకే కనబడేవి. కాని, కొన్నాళ్ళకి అతనితో స్నేహం కలవటం అసంభవం; ఒకవేళ ఏనాటికైనా వీలున్నా - ఇదికాదు మార్గం అనుకున్నాను. నిరాశతో వాళ్ళిద్దరినీ మాత్రం చూస్తూ ఉండేవాణ్ణి.

వాళ్ళతో నాకు స్నేహం ఏర్పడలే దని శంకరశాస్త్రిమీద, ముఖ్యంగా వెంకటేశ్వర్లు మీద నాకు ఈర్ష్య లేదని నేననను: శంకరశాస్త్రి మనస్సులో నే నాక్రమించా లనుకునేది,అప్పుడు వెంకటేశ్వర్లు ఆక్రమిస్తున్న స్థానం అవటంవల్ల వెంకటేశ్వర్లు నాకు ప్రత్యర్థిగా కనబడేవాడు. దానికితోడు వెంకటేశ్వర్లు వీలు దొరికి నప్పుడల్లా శంకరశాస్త్రితో తన కున్న పూర్వపరిచయాన్ని వినియోగించి నన్ను అతని దగ్గరనుంచి ఒక మెట్టు దిగజారదీస్తూ ఉండేవాడు. ఇదంతా గమనించిన నాకు శంకరశాస్త్రితో స్నేహం చెయ్యా లన్న కోర్కెకూడా క్రమంగా సన్నగిలింది. వెంకటేశ్వర్లుమీద అసహ్యం మాత్రం నాలో గట్టిగా నిలిచిపోయింది. అతని ప్రతి చర్యలోనూ, ఒక విధమైన వెకిలితనం; స్వార్థం కనిపెట్టాను.

నిజం చెప్పాలంటే శంకరశాస్త్రికి, వెంకటేశ్వర్లుకి ఉన్న సంబంధం స్నేహం కాదు; వెంకటేశ్వర్లు శంకరశాస్త్రిభృత్యుడు. అన్నీ ఉన్న శంకరశాస్త్రి స్నేహం చెయ్యా లంటే వెంకటేశ్వర్లే కావాలేమిటి? తన ఛాయాలోవాళ్ళే కావలసినంతమంది ఉన్నారు ఎదురుచూస్తూ. అసలు శంకరశాస్త్రి వెంకటేశ్వర్లు నెప్పుడూ స్నేహితుడిగా చూడలేదు. అతన్ని పనివాణ్ణిలాగా మందలిస్తూ ఉండేవాడు. ఇది నేను అనేకసార్లు గమనించి అసహ్యించుకున్నాను. అవన్నీ గుట్టుచప్పుడు కాకుండా మింగి ఊరుకుని, అంత బ్రహ్మాండమైన హోదాని నే నెక్కడ లాక్కుపోతానో నని నన్ను దగ్గిరికి చేరనిచ్చేవాడు కాదు. శంకరశాస్త్రివెంట అలా తోక ఆడించుకుంటూ కుక్కలాగా వెంకటేశ్వర్లు తిరుగుతుంటే నేను తరవాత తరవాత అనేకసార్లు అసహ్యించుకున్నాను. వెంకటేశ్వర్లు అతనిదగ్గిర పడిగాపులుపడటం చూస్తుంటే నేను వాళ్ళ స్నేహితుణ్ణి కాకపోతి నన్న విచారం ఏమాత్రం లేకుండా పోయింది.

శంకరశాస్త్రి చనిపోయిన తరవాత వెంకటేశ్వరు నా కెందుకో ఆప్తుడుగా కనబడడం మొదలు పెట్టాడు. శంకరశాస్త్రిమరణానికి మే మిద్దరం సమానంగా విచారపడవలసినవాళ్ళ మనిపించింది నాకు. దానికి తోడు, వెంకటేశ్వర్లు ఊళ్ళో లేడన్నారు. అతనాక్షణాన అక్కడుంటే ఎంత విచారించేవాడో నేను తేలిగ్గానే ఊహించుకోగలిగాను. మిత్రుడికోసం తన వ్యక్తిత్వాన్నికూడా అవసరమైతే ఒదులుకుంటూ వచ్చిన వెంకటేశ్వర్లు ఈ దుర్వార్త వింటే... అత నుండబోయే స్థితి తల్చుకునే సరికి భయం వేసినది నాకు.

ఈ వార్త వెంకటేశ్వర్లుకి ముందు అందించినది నేనే. సంధ్యవేళ అలా, వాళ్ళింటి మీదుగా వెడుతుంటే అప్పుడే అతనూ బయటి కొచ్చాడు. నన్ను చూచి కన్నెగరేసి పలకరించాడు. నేనూ నవ్వుతూనే లోపలికి ప్రవేశించాను. అసలు, మే మిద్దరం బయటికి గుర్తించతగ్గంతగా ఎన్నడూ మాటామాటా అనుకుని ఎరగం. అందువల్ల "ఊరు వెళ్ళారుటే.." అన్నాను పరామర్శగా.

"అవునండీ...ఇందాకనే వచ్చాను" అన్నాడు తనుకూడా కూర్చుంటూ.

అతని మాటతీరునిబట్టి శంకరం చనిపోయిన విషయం ఇంకా అతనికి తెలియలే దని గ్రహించాను. ఆ విషయం బయటపెట్టటానికి ఉపోద్ఘాతం ఏమిటా అని ఆలోచిస్తున్నాను. కొంచెం సేపు నిశ్శబ్దంగా కూర్చుని అతనివైపొకసారి చూశాను.

"విన్నారా?" అన్నాను చివరికి—చాలా కలుపుగోలుతనంగా.

"ఏమిటి?" అన్నాడు ఇందాకటి ధోరణిలోనే.

"మన శంకరశాస్త్రి పోయాడు....." అన్నాను విచారం గొంతులోకి తెచ్చుకొని.

"పాపం..." అన్నాడు అతి మామూలుగా, పరాయివాళ్ళు పోయారంటే మనమంతా విచారించేలాగా.

అతని తీరు చూచేసరికి నేను చెపుతున్నది శంకరశాస్త్రి విషయ మని అతను సరిగా వినలేదేమో ననిపించింది. లేకపోతే నా మాటలు అంత చులకనగా తీసుకుని ఉండడు.

అందుకని "మన శంకరశాస్త్రి విషయమండీ నేను మాట్లాడుతోంది!" అన్నాను.

"విన్నాను. పాపం, రక్తం కక్కుకు చచ్చిపోయాట్ట" అన్నాడు.

ఆయన ఇంతకుపూర్వమే ఇదంతా విన్నాడని గ్రహించాను.

"పాపం, చాలా నికృష్టమైన చావు చచ్చాడండీ" అన్నాను ఏమీ మాట్లాడలేక.

"అవును" అన్నాడు వెంకటేశ్వర్లు ముక్తసరిగా.

"ఏమి టంటారు మీరు అది?" అన్నాను మళ్ళీ.

"మీరే చెప్పారుగా..." అన్నాడు తర్కపండితుడిలాగా.

అతని ముఖంలోకి తేరిపారజూశాను. విషాదచ్ఛాయ లేమాత్రం లేవు. అలా చూడటానికి, కనీసం అక్కడ కూర్చోటానికి నా కెందుకో కంపరంగా వుంది. ఇన్నాళ్ళూ వెంకటేశ్వర్లు కపటస్నేహం నటిస్తుంటే శంకరశాస్త్రి ఒక్కసారన్నా అతన్ని అనుమానించలేదే అని విచారించాను.

"అతన్ని గురించి నాకే అలా ఉంటే, మీ కెలా ఉంటుందో అనుకున్నానండీ" అన్నాను ధైర్యంచేసి.

"ఏం? నిజంగా మీరు విచారిస్తున్నారా?" అన్నాడు.

నేను తెల్లబోయాను. ఏమీ అనలేక చూస్తూ కూర్చున్నాను.

అతనే మళ్ళీ సంభాషణ ప్రారంభిస్తూ, "నిజంగా నా కేమీ విచారం కలగలేదండి; కొంతవరకూ సంతోషించానేమో!" అన్నాడు.

నేను ఒక్కసారి తృళ్ళిపడి వింటూ కూర్చున్నాను.

"ఇది మీకు ఆశ్చర్యం కలిగిస్తోందంటే నా పరిస్థితి మీరిన్నాళ్ళూ సరిగా అర్థంచేసుకోలే దని అనుకుంటున్నాను. నిన్న రాత్రితో నా శని వదిలిపోయింది. ఇహనించీ నేను మనిషిగా బ్రతగ్గలను."

అలా తూచి, తూచి మాటలు మాట్లాడుతుంటే ఒంటరిగా అతనిముందు కూర్చుని వినటానికి నా కెందుకో భయంభయంగా వుంది.

"ఇదంతా మీకు చెప్పవలసిన అవసరం చాలా ఉంది. ఎందుకల్లనంటే, మీ మనస్సుని చాలాసార్లు కష్టపెట్టిఉంటాను. ఆపైన మీ రేమనుకున్నా, నేన లా ఎందుకు చేశానో ఇప్పుడు మీకు చెప్పదలుచుకున్నాను."

నే నలా ఏమీ అనుకోలేదని ఆయనకి చెపుదామనుకున్నాను. కాని ఆయనధోరణి నడ్డగించటానికి ధైర్యం చాలకపోయింది. ఆయన ఒక విధమైన ఆవేశంలో, ఉన్న విషయాలన్నీ బయటపెట్టి, తన గుండెబరువు ఒదుల్చుకోవాలని కూర్చున్న ట్లనిపించింది. అందువల్ల కనీసం కాదన్నట్లు తలకూడా తిప్పకుండా వింటూ కూర్చున్నాను.

"మనిషికి మనిషిపైన వీలు చిక్కిందంటే అధఃపాతాళానికి అణగతొక్కెయ్యటానికి సాధ్యమైనన్ని విధాలా ప్రయత్నిస్తాడు. ఏదో కాలం, ఖర్మం వనగూడి వాడు వేసిన ఉచ్చులో అవతలివాడు పడ్డాడూ అంటే, దాన్ని ఆధారంగా తీసుకుని శాశ్వతంగా వాడిపైన స్వారి చేస్తూనే ఉంటాడు అవతలివాడు ఎంత తగ్గితే స్వారి మరింత ఎక్కువౌతుంది. తను శాశ్వతంగా అధికారం చలాయించటానికి, అవసరమైనప్పుడల్లా ఆ వెనక జరిగిపోయిన విషయాలు బయటికి లాగి బెదురుపెడుతూ ఉంటాడు. ఈ సుడిగుండంలోనుంచి బయటపడటం - ఇద్దరిలో ఎవరో ఒకరు అవతలికి తప్పుకుంటేనే. అలాటప్పుడు నే నెందుకు విచారపడాలి? సంతోషిస్తున్నా కూడా!"

అంత పెద్ద ఉపోద్ఘాతం వినేసరికి నా బుఱ్ఱ ఒక్కసారి దిమ్మెత్తినట్లయింది. వాళ్ళిద్దరిమధ్యా ఇన్నాళ్ళూ ఏదో అసాధారణమైన సంబంధం ఉన్నట్లుమాత్రం గ్రహించాను. వెంకటేశ్వర్లు మాట్లాడే ప్రతిమాటలో కృంగి, కృశించిపోయిన అతని గౌరవం, వ్యక్తిత్వం వెల్లువలుగా బయటికి వినబడుతోంది.

"శంకరశాస్త్రిదగ్గిరికి మిమ్మల్ని చేరనివ్వక పోవటానికి గల కారణం ఇప్పటికి మీకు కొంత అర్థమైందనుకుంటాను. ఉన్న విషయం చెప్పేస్తున్నాను. అతనంత దుర్మార్గుడు ఈ ప్రపంచంలో మరొక డుండడు. దగ్గరకు చేరిన మరునాటికల్లా మిమ్మల్ని బానిసకింద మార్చేస్తాడు. అంతే! ఇహ మీకు శాశ్వతంగా ముక్తి ఉండబోదు. మిమ్మల్ని కాస్తకూడా బెసిగి అవతలకి పోనియ్యడు.

"మోసపోయి అతని ఉచ్చుల్లో పడ్డందుకు చచ్చేటంతవరకూ నన్ను కాలికింద పెట్టి రాచేస్తూనే వున్నాడు. అసలు దుర్మార్గాన్ని ప్రేరేపించింది వాడే. అయితేనేం? నన్ను దోషిగాను, దాన్నుంచి నన్ను రక్షించగలవాడు తనుగాను పర్యవసానం తేలేట్లు చేశాడు. మంచీ, చెడూ

(17-వ పేజీ చూడుడు)

వార్తా

రమణ మహర్షి ఆశ్రమంలో




తిరువణ్ణామలై పోతూ మీనంబాకం విమానాశ్రయంలో దిగిన గవర్నరు జనరలు రాజగోపాలాచారిగారికి మద్రాసు గవర్నరు భావనగరు మహారాజా స్వాగతం చెప్ప అటు చేసిన ప్రయాణం కరిదయం చేయడానికి తోడ్పడిని వస్తున్నారు.



తిరువణ్ణామలైలోని అరు




రమణమహర్షి



పాతాళలింగేశ్వరుడు: ఎదురుగా ...




పాతాళ ఆశ్రమంలో పూజారి సమర్పిస్తున్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న రాజాజీ.



ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ మద్రాసు గవర్నర్ భావనగర్ మహారాజుతో కరచాలనం చేస్తున్న దృశ్యం.


వార్తా




శతావధాని హోమా వెంకట స్వామి గుప్తగారికి విజయవాడలో జరిగిన సన్మానము సందర్భమున తీసిన ఛాయాచిత్రము.

చిత్రాలు

గవర్నరు జనరల్ రాజాజీ




...శాచలేశ్వర ఆలయదృశ్యం.



మండపం చెక్కడాలను పరిశీలిస్తున్న రాజాజీ



... రమణమహర్షి చిన్నతనంలో ఉగ్రతపస్సుచేసిన స్థలం.




శ్రీ రమణమహర్షి ఆశ్రమంలో గవర్నర్ జనరల్ రాజాజీ పాతాళలింగ గుహను ఆవిష్కరిస్తూ ఉపన్యసిస్తున్నప్పటి దృశ్యం.



చిత్రాలు

భారతదేశంలో రేడియో బ్రాడ్‌కాస్టింగ్ ప్రారంభమై మొన్న 16-వ తేదీతో పాతికసంవత్సరాలు పూర్తి అయినవి. సి. వి. కృష్ణస్వామి చెట్టిగారు మద్రాసు ప్రెసిడెన్సీ రేడియో క్లబ్‌ను స్థాపించడమే దీనికి నాంది. ఆ క్లబ్ ఉపయోగించిన ప్రథమ 'రిసీవింగ్ సెట్' చిత్రం ఇది. మొన్న 16-వ తేదీన మద్రాసు రేడియో కేంద్రం ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నడిపింది.





'జాలరి - భూతం'

'శ్రీ ఆచార్య భార్గవ'

అతడొక జాలరి. బాగా వయస్సు మళ్లినవాడు. చాలా పేద. అశక్తుడు. అతడికి ఒక భార్యా, ముగ్గురు పిల్లలూ ఉన్నారు. తనతో మొత్తం ఐదుగుర్ని తానొక్కడే పోషించాలి. తన రెక్కల కష్టం మీదనే వాళ్లు పొట్టుపోసుకుని కాలం వెళ్లబుచ్చాలి. పగలల్లా పాటుపడినా పట్టుమని పదికాసులైనా గిట్టేది కాదు పాపమతడికి. పెళ్లాం బిడ్డల్ని పోషించే భారం రోజు రోజూ చాలా కష్టతరంగా ఉండేద తగాడికి. 'దినగండం నూరేళ్లాయుస్సు'—అతడి పరిస్థితి.

ఓనాడతడు చేపలు పట్టడానికై, తన వలను తీసుకుని సముద్రానికి పోయాడు. వెళ్లి నీళ్లలోకి దిగి తన వల విసిరాడు. కొంచ సేపుండి లాగి చూచాడు. చాలా బరువుగా వుంది వల. ఏదో పెద్ద చేప దొరికిందనీ దాన్ని అమ్ముకుంటే చాలా డబ్బు వస్తుందనీ చాల ఆశపడ్డాడు ఆ జాలరి. కాని తీరా లాగి చూచేసరికి అందులో ఆవుశవం చిక్కుకొని ఉంది. పాపం అతడి స్థితి అప్పుడెలా ఉంటుందో ఊహించండి!

మళ్లీ వల విసుగుతో విసిరాడు. ఈ సారి ఏదో బరువుగా తగిలింది. లాగి చూచాడు. పనికి రాని పాతకుండలు మూడు వల్లో చిక్కు పడ్డాయి.

దీంతో అతడికి కోపమూ, విసుగూ, చిరాకూ జాస్తైంది. "ఇవాళ పొద్దున్న ఎవడి మొహం చూశానో కాని, నా కర్మ కాలి ఒక్క చేప ఐనా పట్టుపడదే! అయ్యో! నా పెళ్లాం బిడ్డల్ని పస్తుపెట్టవలసిందేనా? నాకే రోజేమీ చిక్కేట్లు లేదు. ఐనా ముచ్చటగా మూడో సారి ఇంకో చోట వల వేసి చూస్తాను. ఈ సారేదైనా దొరికిందా సరి, లేదా ఇక జన్మలో ఈ పనే పెట్టుకోను." అనకుని వల వేసి కాచుకూచున్నాడు. కొంత సేపటికి ఏదో కాస్త బరువుగా వలకు తగిలేసరికి ఆశగా వలను లాగాడు. ఒక బంగారపు జాడీ దొరికింది. ఆ జాడీ మూత దిట్టంగా బిగింపబడి వుంది. మూతమీద ఏవో కొన్ని అక్షరాలుకూడా కనిపిస్తున్నాయి. ఏమని వ్రాసి ఉందో మనకేం తెలుసు? ఐనా చూద్దాంగా.

"అబ్బ! ఎలాగైతేనేం ఏవో ఒకటి దొరికిందిలే, ఇప్పటికి. దీన్ని అమ్మేస్తే చాలా డబ్బు వస్తుందిలే. కొంత కాలం పాటైనా నిశ్చింతంగా బతకొచ్చు" అని అనున్నాడు ఆ చేపలవాడు.

ఓ సారి జాడీని తేరిపార చూచాడు. "ఇదేదో వింత జాడీగా ఉందే. దీన్లో ఏముంటుందో ఓ సారి చూస్తే? విలువైన బంగారు జాడీలో ఏవో విలువైన వస్తువులే ఉండి తీరాలి." అనుకుని ఆత్రంతో ఆ జాడీమూతను బలం కొద్దీ లాగాడు. మూత ఊడి వచ్చేసింది.

ఇంకేముంది? కొంప మునిగింది! ఆ జాడీ లోంచి అమాతంగా ఓ పేద్ద పెను భూతం పైకి దూకింది. జాలరి భయంతో గడగడా వణికి పోయాడు. కాని ఎట్లాగో ధైర్యం కాస్త చిక్కబట్టుకున్నాడు. అప్పుడా భూతం జాలరితో ఈలా సంభాషణ సాగించాడు.

"జాలరీ, నిన్ను నే నిప్పుడు చంపేస్తాను!"

"నన్నెందుకుగాను చంపుతావు? నా జీవితంలో ఎప్పుడూ ఒకళ్లకు అపకారం చేసి ఎరుగనే" అన్నాడు జాలరి.

"అపకారమో, గిపకారమో అదంతా నాకు తెలీదు. నీవీ జాడీమూత తీశావు. అందుచే నిన్ను చంపాలి. కాని నీకు ఒక సౌకర్యం కల్పిస్తాను. నీ వే రకం చావు కోరుకుంటావో అది నీ చేతుల్లో ఉంది. నా చేతుల్తోనో నలిపి, పిసికి ముద్ద చేశేదా? మరి ఈ సముద్రంలోకి తోసేయమంటావా? వేగిరం చెప్పు."

"ఊఁహూఁ, నాకు చావడాని కిష్టంలేదు. నేను నిరపరాధినికదా? నన్నెందుకు నువ్వు చంపాలో చెప్పు."

"అయితే చెప్తావిను. ఓనాడు మారాజుగారికి, అంటే భూతాల రాజుకి— ఎందుకో నా మీద పట్టరాని కోప మొచ్చింది. అంతటితో అతడు నన్నీ జాడీలో పదిలంగా బంధించి మూతపైన తన పేరు వ్రాశాడు. అందుచే నే నీ జాడీ లోంచి బైటికి రాలేను. ఆ జాడీని నా కర్ల చేతి కిచ్చి సముద్రంలో విసిరేయమన్నాడు.

"నే నెన్నో వందల సంవత్సరాలనుంచీ ఇందులో పడరాని బాధలు పడుతున్నాను. ఇలా అనుకునే వాణ్ణి: 'ఎవడైనా పుణ్యం కట్టుకొని ఈ మూత తీసి కాస్త సాయం చేశాడా వాణ్ణి గొప్పరాజును చేశేస్తాను' అని కాన్ని ఎవళ్లూ ఆ పుణ్యం కట్టుకొన్న వాళ్లు లేక పోయారు. ఇలా ఒక వందయేళ్లు గడిచాయి. నే నిక 'నన్ను విడిపించిన వాణ్ణి పెద్ద రాజుగా చేయను. ఒక సామాన్యరాజుగా చేస్తాను' అని అనకోసాగాను. ఊఁహూఁ. నాకు గతీ మోక్షం లేదు. మళ్లీ ఇంకో నూరు సంవత్సరాలు జర్రున జారిపోయాయి. 'అప్పుడు నన్ను విడిపించినవాణ్ణి జమీందారుగా చేస్తాను' అనుకునే వాణ్ణి. అప్పటికీ ఎవ్వరూ తెరవలా. మళ్లీ శతస్రాలు కడిచి పోయాయి. నాకు విసుగేసింది. 'ఈ జాడీమూత ఎవడైనా తీశాడంటే వాణ్ణి అమాంతంగా చంపేస్తాను' అని అనుకున్నా. ఈ రోజున నీవు దీన్ని తెరిచావు. నే ననుకున్నట్లుగా నిన్ను చంపేయాలి. నీ చావు ఎలా కోరుకుంటావో కోరుకో!"

"నేను నిన్నొక్క సంగతి అడగాలి. అడగొచ్చా?" వీడి దుంప తెగా, వీడి ధైర్యం తగలడా, మన జాలరి భయం లేకుండా భూతం గాడితో ఈలా సంభాషణకి లంకించుకున్నాడు

"అలాగే చెప్తా. కాని తొందరగా అడుగు"

"ఏమిటీ, నువ్వు.. ఆ జాడీలో ఉన్నావా?"

"ఔను, నిజమే."

జాడీని దీక్షగా నాలుగువైపులా చూస్తూ జాలరి—

"అబ్బే! నీ మాట శుద్ధాబద్ధం. నేను నమ్మను. ఇంత పెద్ద భూతంగాడివి నీ వేమిటి? ఇందులో ఇంత చిన్న జాడీలో పట్టడ మేమిటి? ఎవరైనా వింటే నవ్విపోతారు! నీ వొక్క పాదం కూడా ఇందులో పట్టదే? ఏదైనా బొంకినా కాస్త నమ్మేట్లు బొంకాలి. దానికీ కొంచెం ఆలోచన కావాలి. నీ కేమైనా బుర్ర ఉందా?"

ఈ మాటలు వినేప్పటికి భూతానికి ఎక్కడ లేని ఆగ్రహమూ ఒక్కసారి ముంచుకొచ్చేసింది. వెంటనే చిన్నవాడుగా మారిపోయి జాడీలోకి దూరుకున్నాడు. "ఏయ్! జాలరీ, చూస్తున్నావా? నే నీ విధంగా జాడీలో ఉంటూ వచ్చాను." అని అన్నాడు భూతం.

వీడి తెలివి తేగలు తింటోంది! చేపలవాణ్ణి నమ్మించాలని దాంట్లో దూరాడేగాని, ముందు ముంచుకొచ్చే ముప్పు తెలుసుకోగలిగే ముందు చూపు లేకపోయింది. భూతాలకు బుర్ర ఉండదేమో!

ఇదే మంచి సమయమనుకొని జాలరి చటుక్కున చలాకీగా క్షణంలో జాడీకి మూత బిర్ర బిగించాడు.

"ఒరేయ్! భూతంగా, ఈ జాడీతో సహా నిన్ను మళ్లీ ఈ సముద్రంలోకి తోసేస్తాను. పైగా మావాళ్లందరితోనూ చెప్తాను— ఈ జాడీజోలికి పోవద్దని. యుగాల తరబడి నీ విందులో మురిగి చావాలిసిందే!" అన్నాడు.

భూతాలకు చాలా బలం ఉంటుంది. ఒక్క దెబ్బతో ఆ జాడీ పగల గొట్టుకొని బైటికొచ్చేయొచ్చు. కాని మూతమీద భూతరాజుగారి పేరుండడంవల్ల ఆ పని పడింది కాదు. కోరలు తీసిన కోడెతాచులా గుంది అతడి దీనస్థితి. పాపం!

భూతం అన్నాడు గదా— "నీ వీ మూత తీశావంటే నిన్ను గొప్ప ధనవంతుణ్ణిగా చేశేస్తాను—" అని.

"కాదు. నిన్ను నమ్మకూడదు. కోపంతో నన్ను మింగేస్తావు!"

"లేదు. నిన్ను నేను చంపను. ఇది ముమ్మాటికీ నిజం. నిన్ను గొప్ప జమీందార్నుగా చేస్తాను."

"అయితే మీ రాజుగారి మీద ప్రమాణం చేయి— నన్ను చంపననీ."

దానికి భూతం ఒప్పుకున్నాడు. భూతాలు ఎంత క్రూరస్వభావం కలవైనా ఆడినమాటలు తప్పవు. ఆ విషయం చేపలవాడికి తెలుసు. అతడు జాడీమూత తీశాడు.

ఈ సారి మాత్రం భూతం బుద్ధిగా తాను బైటపడగానే ఆ జాడీని సముద్రంలోకి గిరువాటేశాడు. "జాలరీ, పోదాం పద. నీవల తీసుకుని నాతో రా" అన్నాడు.

వాళ్లిద్దరూ బయలుదేరారు. ఆ నగరానికి ప్రక్కగా వెళ్లి వెళ్లి, వాళ్లొక కొండకు చేరుకున్నారు. దానిమీదనుంచి దాటుకుని, అవతల ఉన్న మూడు కొండలదగ్గరికి చేరారు. అక్కడ సముద్రం ఉంది. ఆ సముద్రంలో నీళ్లు నీలంగా ఉన్నాయ్.

భూతం జాలరిని వల వేయమన్నాడు. జాలరి అల్లే చేశాడు. భలే అందమైన చేపలు మూడు దొరికాయి. అవి ఒకటి తెల్లగా, ఇంకోటి ఎర్రగా, మరొకటి బంగారు ఛాయగా ఉన్నాయి.

"ఈ చేపల్ని పట్టికెళ్లి రాజుగారికిచ్చావంటే, ఆయన సంతోషించి, నీ కరువు తీరేంత డబ్బు ఇస్తాడు."

అని జాలరితో చెప్తూ భూతం కాలితో భూమిని ఒక తన్ను తన్నాడు. ఆ దెబ్బకు భూమిలో ఒక సొరంగం ఏర్పడింది.

ఆ సొరంగంగుండా చేపలవాడు వెళ్లి చూసేసరికి, అక్కడ ఒక పెద్ద హాలులో ఒక రాజుగారు కొలువు తీర్చి ఉన్నారు. అతడా చేపల్ని రాజుగారి ముందు పెట్టాడు. ఆ చేపల్ని చూచి రాజు చాలా ఆశ్చర్యపడ్డాడు. "అరరే! ఈ చేపలు ఎంత అందంగా ఉన్నాయ్! మంత్రీ, ఈ చేపల్ని వంటశాలకు పంపించి ఈ పూటకు వీట్ని సిద్ధం చేయించమను" అన్నాడు.

ఆ చేపలిచ్చినందుకు రాజు సంతోషించి జాలరికి చాలా బంగారం ఇచ్చాడు. జాలరిసంతోషపడ్డాడు. ఆ డబ్బు పెట్టి పెళ్లాం బిడ్డలకు బట్టలూ అవీ కొన్నాడు. ఇంటికి కావలసిన సరకు సరంజామాఅంతా కొనుక్కున్నాడు.

రాజుగారి వంటవాడు ఆ చేపల్ని కుండలోపెట్టి ఆ కుండను పొయ్యి మీద పెట్టాడు. అప్పుడా గది లోని ఒక గోడను పగలగొట్టుకొని ఒక చక్కని సుందరి వెలికొచ్చింది. ఆమె ఆ చేపలకుండవద్దకు వెళ్లి "చేపలూ, మీ పని మీరు సక్రమంగా చేస్తున్నారా?" అని అడిగింది.

చేపలు బదులు పలుకలేదు. మళ్లీ ఆమె అదే ప్రశ్న వేసింది. ఈ సారి చేపలు తలలు పైకి నిక్కబెట్టి "మాపని మేము చేస్తున్నాము. అలా చేయడానికి మేము చాల సంతోషంగా ఉన్నాం" అన్నాయి. అంతట ఆమె ఆ కుండను కిందికి తోసి పారేసి, గోడలోకి దూరుకుంది. చేపల మంటలో బడి మసిబొగ్గయాయి.


రాజుగారు చేపల పలహారం వస్తుందని లొట్టలు వేసుకుంటూ ఎదురు చూస్తున్నారు. కాని ఎంత సేపటికీ రాలేదు. "మంత్రీ, చేపల వంటకం ఇంకా ఎందుకు పూర్తి అవలేదో, కనుక్కోనిరా" అని మంత్రిని పంపించాడు.

మంత్రి వెళ్లి సంగతి సందర్భాలన్నీ తెలుసుకున్నాడు. రాజుకు కోప మొస్తుందని గుట్టు చప్పుడుగా చేపలవాడికి కబురుచేసి మరో మూడు చేపల్ని తెప్పించి వంటచేయమన్నాడు. వంటలవాడు వంట ప్రారంభించాడు. మునుపటిలాగే ఆ స్త్రీ రావడం చేపలు మంటలో పడి మసి అవడం జరిగింది.

ఈ సమాచారం రాజుగారి చెవులకు సోకింది. ఈ వింత చూసితీరాలనుకున్నాడు. ఆ జాలరికి కబురుచేసి మూడు చేపల్ని తెమ్మన్నాడు. వాడల్లే తెచ్చాడు. అతడికి కావలసినంత డబ్బు ఇచ్చి పంపించేశాడు రాజు.

ఈమారు రాజే స్వయంగా ఈ వింతలు చూడ్డానికి వంటసాలకు వెళ్లాడు. వంటవాడు చేపల్ని కుండలో పెట్టి పాకం ప్రారంభించాడు. కుండను పొయ్యిమీద పెట్టేప్పటికి ఆ గదిలోని

(17-వ పేజీ చూడుడు)



రైతు తీర్పు

శ్రీ గ్రిద్దలూరు గోపాలరావు

పూర్వము, గ్రీకురాజు అలెగ్జాండరు మన యిండియాపై దండెత్తి రాజుల నందరిని ఓడించిన చరిత్రాత్మకమైన విషయము మీరంతా చరిత్రల్లో చదివివుంటారు. అలెగ్జాండరు తన విజయ భేరి యిండియాలో మ్రోగించి, తర్వాత తన దేశం తిరిగి వెళ్లేటప్పుడు కొంత దూరం సముద్రం మీద, కొంతదూరం నేలమీద దేశమంతా చూచుకొంటూ తిరిగి వెళ్ళిన సంగతిగూడా మీరు చదివే వుంటారు; లేక వినివుంటారు. అతను నేల మీద ప్రయాణం సాగించే సమయంలో ఒక విశేషం జరిగింది. దానిని మీకు చెప్తాను.

అలెగ్జాండరు అలా తన సైన్యం నడిపించుకొంటూ వూరు వూరు దాటి పోతున్నాడు. హిందూదేశంలోని ప్రకృతి సౌందర్యాలను పొగడుతూ పోతున్నాడు. ఒక వూరి సమీపమునకు వచ్చునప్పటికి ప్రొద్దు క్రుంకింది. ఆవూరి సమీపమునవున్న పెద్ద మైదానంలో గుడారాలన్నీ వేసి విశ్రాంతి తీసుకోవా లనుకున్నారు. సైన్యమంతా ఐదు నిమిషాల్లో గుడారాలు బిగించారు. అలెగ్జాండరు, తన సేనాధిపతి యింకా మరికొందరు చల్లనిగాలి అనుభవిస్తూ హాయిగా గుడారంబైట కూర్చొని వున్నారు.

యీ విషయం తెలిసి ఆ వూరి పెద్ద రైతు కొంతమంది రైతులను పోగుచేశాడు. అలెగ్జాండరును గౌరవించేందుకు, బంగారు అరటిపండ్లు, మామిడిపండ్లు, తీసుకొని అలెగ్జాండరుదగ్గరకు వచ్చాడు.

అలెగ్జాండరు అవంతా చూచి—'యివంతా నా కెందుకు?' అన్నాడు.

"మీరు తింటారని తెచ్చాము"—అన్నాడు పెద్ద రైతు.

'బంగారు మామిడిపండ్లు ఎట్లా తింటారు?'— అన్నాడు అలెగ్జాండరు ఆశ్చర్యంగా!

'యింతమంది ప్రాణాలు తీసి యింత విజయం సంపాదించిన మీరు... అందరూ తినే మామిడి పండ్లు తింటే మీలో గొప్ప తనమేమిటి?'—అన్నాడు పెద్ద రైతు.

అందరూ విస్తుపోయి ఆ రైతును వింతగా చూచారు.

యింతలో ఆ వూరిలో యిద్దరి రైతులకు తగవు పడి తీర్పు చెప్పించుకునేందుకు ఆ వూరి పెద్దరైతును వెతుక్కుంటూ యిక్కడకు వచ్చారు.


'అందులో ఒక రైతు పెద్దరైతుతో చెప్పకున్నాడు. 'అయ్యా! యితను నాకు తన యింటి స్థలం నెలక్రిందట అమ్మినాడు. యిప్పుడు నేను ఆ స్థలంలో యిల్లు కట్టుకునేందుకు త్రవ్వుతూ వుంటే రెండు బంగారు బిందెలు చిక్కాయి. ఆ స్థలం యింతకు ముందు అతనిదికాబట్టి యింతకు ముందు అతనుగాని అతని పెద్ద వాళ్ళుగాని, ఆ బంగారం భూమిలో దాచిపెట్టుకొని వుంటారు. కాబట్టి ఆ బంగారం బిందెలు అతన్ని తీసుకోమంటే తీసుకోనంటున్నాడు"— అన్నాడతను

రెండవ రైతు యిలా చెప్పకున్నాడు: 'అయ్యా! నేను ఆ స్థలం అతనికి నెలక్రిందట అమ్మేశాను. ఆస్థలంపై నాకు అధికారం లేదు. అధికారమంతా అతనిదే కాబట్టి, ఒక వేళ మా పెద్ద వాళ్ళు ఆ బంగారం అక్కడ దాచి వుంచినా, దానిపై నాకు అధికారం లేదు... అంతా అధికారం అతనిదేను... నాకు ఆ బంగారం అవసరం లేదు.' అన్నాడతను..

యిదంతా వింటూవున్న అలెగ్జాండరు, అతని సేనాధిపతీ ఆశ్చర్యపడిపోయారు...'వీళ్ళిద్దరూ పిచ్చివాళ్ళులా వున్నారే!—' అనుకున్నాడు అలెగ్జాండరు... వారిని చూచి పెద్ద రైతు నవ్వుకున్నాడు...

'మా యిద్దరికి తీర్పు చెప్పి యీ తగవు పరిష్కారం చేయండి' అన్నారు ఆ యిద్దరు రైతులు.. పెద్ద రైతు చెప్పాడు... 'ఏమోయ్ నీకు ఒక కూతు రుందిగదా!.. ఏమోయ్ నీకు ఒక కొడుకు వున్నాడు గదా!'—

(17-వ పేజీ చూడుడు)



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౨౮

అన్నమయ్యగారి రచన: (సంపు. 3; ప. ౨౦3)

జౌళిరాగం - ఆదితాళం(త్ర్యస్రగతి) లేక, చతురశ్ర రూపకం

[రాగలక్షణం]

మాళవగౌళజన్యం. స రి గ ప ధ స - స ని ధ ప గ రి స. ఇట్లు దీని యిప్పటి సంచారం. ఔడవ షాడవరాగం. స ని స ధ ప గ ధ ప గ రి స - గ ప ధ ని ధ ప—ఇట్లుగూడా సంచరించవచ్చును. ప్రాచీనగ్రంథాలలో 'ఝావళి' అని దీనిని వ్యవహరించినారు.

దీని గ్రహస్వరం మధ్యమ మట! వేరువేరు రాగాలకు భిన్నస్వరాలు గ్రహంగా తీసుకొని పాడే పద్ధతి పూర్వకాలంలో ఉండేది. కాని స్థిరస్వరంగా షడ్జం నిలిచిన తరువాత అది అంతరించింది. కాని కొన్నివందల యేండ్లుగా ఈ రాగానికీ స్వరం గ్రహ మని చెప్పే శాస్త్రంమాత్రం నిలిచినది. కొందరు గాయకులలో ఆ పద్ధతి కేవలం గ్రహభేదంతో స్వరరచన చేసే వింతవ్యాయామంగా ఉండేది. ఇప్పుడు అదికూడా కానరాదు; అదృష్టమే!

గోవిందదీక్షితుల కాలానికే ఇందులో మధ్యమస్వరం వర్జించవలె నని వైణికు లనేవారట. కాని మధ్యమం గ్రహస్వరంగా శాస్త్రనిదేశ మున్నప్పుడు దానిని వర్జించేది న్యాయం కా దన్నా డాయన. ఐతే ఆలాపరాగాదులలో షడ్జమే గ్రహంగా అప్పటికి 'సర్వజనప్రసిద్ధం'గా ఉండినది. కాబట్టి ఈ శాస్త్రవ్యవహారవిరోధానికి ఆయన యేదో చమత్కారమైన పండితసమాధాన మిచ్చినాడు. కాని నాకది అవగతం కాలేదు. (సం. సుధ. పు. ౧౪౯) రామామాత్యుడు దీనిని 'మధ్యమాంశగ్రహన్యాసా జాలీ పంచమవర్జితా' అని లక్షించినాడు (స్వ. మే. క. రా. ప్ర. 3౧). అప్పటి కది ఇప్పటి 'లలిత'రాగ మగును. సోమనాథుడేమో షడ్జమే దీని గ్రహాంశన్యాసస్వరంగా గ్రహించి మధ్యమనిషాదవర్జితంగా లక్షించినాడు (రా. వి. ర. ౧౯). కాని లక్ష్యప్రదర్శనంలో 'రి ని స ధ' అనే అల్పనిషాదప్రయోగాన్ని చూపినాడు (౨౨-౭౯). వెంకటముఖి మధ్యమమే గ్రహస్వర మని శాస్త్రాన్ని అనువదించినా, తత్కాలవ్యవహారాన్ని మన్నించి 'మధ్యమవర్జనాత్ షాడవో గీయతే సోఽయం' అని వివరించినాడు (చ. ప్ర. రాగప్ర. ౮౪). ఒక గీతమూ, ప్రబంధమూ లక్ష్యంగా రచించినాడు. అందు 'ని స ధ - స ని ధ' అనే రెండు ప్రయోగాలూ చూపినాడు. (సం. సం. ప్ర ౨౧౨-3).

ఇది ఘనరాగాలలోనిదే. షడ్జపంచమాలూ, గాంధారధైవతాలూ వాదిసంవాదులు. నిషాదం దుర్బలమైన అనువాది. ఉదయకాలపు రాగంగా దీన్ని పలువురు గ్రహించిరి. సోమనాథుడేమో ఇది 'అపరాహ్ణగేయా' అన్నాడు! (రాగవి. ర. ౧౯) తాళ్లపాకవా రెక్కువగా వాడిన రాగాలలో ఇదొకటి.

[పల్లవి]

(౧) , గ గ పా ప పా ధ పా ప । ప గా ప ధా ధ ప గ గ రి స
ఎం డ గా ని నీ డ గా ని యే మై నా గా ని

(౨) , గ గ పా ప ప ధ ని ధ ప ప । గ ప ధ స ధా ప ధ పా గా గ రి స
ఎం డ గా ని నీ డ గా ని యే మై నా గ ని

(౩) , గ గ ధ ప ప గ ప ప ధ ధ రి సే ని ధ ప । గ ప ధ సా, స రి నీ ధా పా ధ ప ప గ గ రి స
ఎం డ గా ని నీ డ గా ని యే మై నా గా ని

(౧) , గ గ ప గ గ రి రి సా సా రి రి స । సా స రి గ ప గా ప గ ధ ప గ రి స
కొం డ ల రా య డే మా కు ల దై వ ము

(౨) , గ గ ప ధ ప గ రి సా సా గ రి రి స । స ధ స రి గ ప గా ప పా ని ధ ధ ప ప గ గ రి రి స
కొం డ ల రా య డే మా కు ల దై వ ము
సా (ఎండగాని)

[చరణం]

, గ గ పా ప పా ధ పా ప । ప గ ప ప ధా ప ప గా గ గ రి స
తే లు గా ని పా ము గా ని తే ు ప దై న గా ని

, గ గ రి స సా ని సా గ రి రి స । సా స రి గ రి గ పా ని ధ పా
గా లి గా ని ధూ ళి గా ని కా ని యే మై న

, ప గ పా ధ స సా సా గ రి రి స । సా స రి గ ప గ రి రి సా ని స ధా ప
కా ల కూ ట వి ష మై . న గ్ర క్కు న మ్రిం గి న నా టి

, గ ప ధ స స స రి ని ధ ప గ । , గ ప ధ ని ధా ప పా ని ధ ధ ప ప గ గ రి రి స । సా ॥
నీ ల వ ర్ణు డే మా ని జ దై వ ము (ఎండగాని)

ఇట్లే క్రింది చరణములు :

(౨) చీమగాని దోమగాని - చెలగి యేమైనగాని,
గాముగాని నాముగాని - కాని యేమైనా;
పాముల నన్నిటి మ్రింగే - బలుతేజిపై నున్న
ఘూమకేతువే మాకు - దొర దైవము. (ఎండగాని)

(౩) పిల్లిగాని నల్లిగాని - పిన్నయెలుకైనగాని
కల్లగాని పొల్లగాని - కాని యేమైనా;
బల్లిదుడై వేంకటాద్రి - పై నున్న యాతడే ము
మ్మెల్లకాలమును నేలే - యింటిదైవము. (ఎండగాని)

లఘుటీక : తేమపట్టు=ఉబ్బలి నేల; కాలకూట.. మ్రింగిన=పూతనచంటి విషము ఇక్కడ కవి ఉద్దేశించినట్టున్నది; గాము = గ్రహము; నాము=మత్తు; పాముల.. తేజి=గరుత్మంతుడు; ఘూమకేతువు=ఒట్టి మా శత్రువులపాలికెల్ల తోకచుక్కవంటివాడు; పొల్ల=నిస్సారము.

ముద్రితపాఠము : తేమపట్టయిన.

నాకబలి

(5-వ పేజీ తరువాయి)

నగవు దాచుకుంటూ వెక్కిరింపు వెలగబెట్టక పోతే, తన కింత ఉడుకుమోతుతనం వచ్చేదికాదు.

ఆ అబ్బాయినే తండ్రి అడుగుతున్నాడు:

"మీ రే ఊరు వెళ్తారండీ!..."

"కాశీ.. మీ అబ్బాయిని నే జాగ్రత్తగా తీసికెళ్తాగా. మీ కేం పర్వాలేదు. బాబుగారూ మీరు ఉండండి. ఏమిటోయ్, ఎప్పుడూ రైలు ఎక్కలేదా ఏమిటోయ్! పెద్దవార్ని ఇంత హైరాన పెడ్తున్నావ్!"

తండ్రి ఇతనికి తన నప్పచెప్పటంతో, ఈ మొగం ఆరిందాతనం అంతా బైలు పెట్టకుం టున్నాడు. తనకు మనస్సు కుమిలిపోతోంది.

తండ్రి కంఠస్వరం మారింది. "అబ్బాయి జాగ్రత్త! వెళ్ళగానే ఉత్తరం వ్రాయి."

ఒక క్షణంపాటు గుండె తండ్రిపట్ల కొంచెం కరుగుతూంది.

"మీరుకూడా కాస్త జాగ్రత్తగా కనిపెట్టారు కాదు."

కరుగుతూన్న గుండె మళ్లీ కటు వౌతోంది. రైలు బయలుదేరింది.

"ఉత్తరం వ్రాస్తూండు రాఘవా. ఉంటాను ఉంటాను బాబూ!"

ఆ కుఱ్ఱవాడు అదను తీసుకుంటున్నాడు.

"వెళ్ళొస్తామండి బాబుగారు. మీ అబ్బాయి కేం పరవా లేదు. నే నున్నానుగదండి-ఉత్తరం తప్పకుండా వ్రాయిస్తాను."

అతని మాటలు చెవిని బట్టించుకోకుండా, కిటికీలో నుంచి వంగి తనూ ప్లాటుఫారం మీదికి చూచాడు. "లోపల కూర్చో" అని తండ్రి కేక వేశాడు.

రైలు వెళ్లిన ఒక్క క్షణందాకా అల్లాగే చూస్తూ నుల్చున్నాడు తండ్రి. తల్లి నుల్చున్న రూపంలోని ఏదో వేదనే తండ్రి నుల్చోటం లోనూ క్షణకాలం మెరిసింది. ఇంతలో తండ్రి అడుగు కదిపాడు. అవి వేదనలుగా ఆ క్షణాన్న మనసుకు పట్టే, స్థాయిగాని పరిణతిగాని ఆ మనస్సుకు అప్పుడు లేదు. మనస్సులో అజ్ఞాతంగా కదిలింపులు మాత్రం జరుగుతున్నాయి.

2

బెజవాడలో తన రైలు దిగాక ఎక్స్ప్రెస్ వచ్చేందుకు మూడుగంటలు వ్యవధి ఉంది.

తన ఊళ్లో రైలు ఎక్కినప్పుడు తనమీద పెత్తనం స్వయందత్తం చేసికొన్న కొత్త స్నేహితుడు తనమీద పెద్దరికం అల్లాగే చూపుతూనే ఉన్నాడు.

అతని పేరు శర్మట. అడ్మిషన్ పరీక్షకు అంతకుముందు అప్పడే రెండుసార్లు కాశీ వెళ్లి రావడంతో ఘామేదా అయాడు. ఈఏడు పరీక్ష ప్యాసయి, ఇంటర్మీడియేటులో చేరటానికి వెళ్తూంటే అతన్ని పట్ట పగ్గాలు లేకుండా ఉన్నాయి. తనకంటే చిన్న చదువువాడిముందర తన కీ చులకనదన మేమిటి?

కాని వేషభాషల్లో, నవీనత్వంలో, తన కంటె నిజంగా ఘనుడే అనిపించగల్గుతున్నాడు. ఇది తండ్రి ఇతనికి తన నప్పగించటంలో తనకు వచ్చిన చులకనదనమని ముందు మనస్సులో తండ్రి మీద చిరాకుపడ్డాడు. కాని తనకు తనుగానే ఈ ప్రపంచజ్ఞానిముందర, తన మనస్సులో తాను న్యూనత కల్పించుకొన్నాడు. దానిని ఛేదించుకొని బయలుపడటం తనకు అసలే చేతకావటం లేదు.

బెజవాడ చేరేదాకా రైలులో అతను ప్రపంచవిశేషాలన్నీ లెక్చర్లు ఇస్తూ కూర్చున్నాడు. రైలులో జనం ముగ్ధులయి వింటున్నారు.

కాశీ విశ్వవిద్యాలయం విషయాలు అతను చెప్తూంటే కేవలం శిష్యపరమాణువులాగే నోరు వెళ్ల బెట్టుకొని అతనిముందర కూర్చున్నాడు. రైలులో వాళ్లతో ఎంత కొత్తవాళ్లతోనైనా అతను ఇట్టే కలిసిపోయి మాట్లాడుతున్నాడు. అతను కాశీవిశ్వవిద్యాలయంలో చదువుతున్నానని, ఘరానాగా చెప్పకోటంతోనే రైలులో వున్న అలగాజనంకూడా, అతనిమాట ఫాయిదా ప్రకారమే అతనికి గౌరవ మియ్యటానికి సంసిద్ధులయ్యారు. యఫ్. ఏ. చదువుతున్నాననకుండా ఐ. యస్. సి. చదువుతున్నానని, అంతకన్నా పెద్ద చదువు లేదన్న భ్రమ కల్పిస్తూ, ఒక పెద్దాయనతో చెప్పతున్నాడు వాళ్ల ఊళ్లూ పేర్లూ కనుక్కొని వాళ్లతో ఆంతర్యం ఏర్పరచుకొని ఇట్టే మాటలు కలుపుతున్నాడు.

తన దంతకన్నా పెద్దచదువని అక్కడ చెప్పకొనేందుకుకూడా ఓపట్టాన నోరు పెగలలేదు.

అతనే కదిలిస్తూ, "ఏం చదువుతావోయ్ కాశీలో?" అని తనను పలికించాడు.

"ఫార్మసూటికల్!" - పెద్దపేరు వినేటప్పటికి గ్రామస్థులు కాస్త తెల్లబోవటం కొంచెం తృప్తినే ఇచ్చింది.

"అంటే ఏటండీ?" అని ఒకరు తన నడగకుండా అతన్నే అడిగారు.

"అంటే మందు కుప్పెలు, ద్రావకాలూ అవి తయారుచేసే చదువు. దాన్నే ఇంగ్లీషులో అల్లాఅంటారు. అంతే కాదోయ్?" అని పళ్లు బైటపెట్టి నవ్వుతూ ఆతను తనకు వచ్చిన కాస్త తృప్తినీ తుడిచేశాడు.

"అంతేనా! మారాజయ్యకు ఇంగ్లీసు రాదు కాని మంచిని కొర్సు మందులు తయారు సేత్తాడు. ఏదో సదువుకొంటారు గాని ఈళ్ళంతా నికార్సుగా సెయ్యగలరా?"

ఆ తృణీకారధోరణి రైలులో ఉన్నవాళ్లందరకూ అంటుకొంది. ఆయుర్వేదమందుల తయారీలోని ప్రజ్ఞ, బుజుత్వం, కేవలం లాభానికి తయారుచేసే ఇంగ్లీషు కంపెనీ మందుల తయారీలో లేదని ఏకగ్రీవంగా రైలుపెట్టెలోవాళ్లంతా అంగీకరిస్తున్నారు. ఎవరికి వారు తము ఎరిగున్న ఉపాఖ్యానాలబలంతో బుజువు చేస్తున్నారు. ఆ మిత్రుడూ, ఇట్టే ఆకథకులకు అగ్రేసరుడై, వారిపక్షాన నాయకత్వం వహించేశాడు.

కేవలం ఆంగ్ల ఆయుర్వేద వైద్యాల తారతమ్యాల వాదం, తన కెల్లా న్యూనత కల్పిస్తుందో రాఘవరావు తెలుసుకోలేపోయాడు. కాని న్యూనతమాత్రం అనుభవిస్తూ, కిమ్మనకుండా కూర్చున్నాడు.

బెజవాడలో అతను తనను ముందు దిగమని రైలులోనుంచి పెట్టెలు తనకు అందిస్తున్నాడు. ఆ పనిలోకూడా అనవసరంగా తనకు తక్కువతనం వచ్చి ప్రవేశించినట్లు కించపడ్డాడు.

"ఇక్కడే సామానుదగ్గర ఉండవోయ్. నే నిప్పడే బైటికి వెళ్లివచ్చేస్తాను. ఎక్స్ప్రెస్ ఇంకా మూడుగంటలదాకా రాదు. ఎక్కడికి వెళ్లకు; ఇక్కడే ఉండేం!" . .

అతనిపట్ల ఏ వచనప్రయోగం జరపాలో ఇంకా మనస్సు నిర్ధారణ చేసుకోలేదు.

"వచ్చేలోపల ఎంత ఆలస్యం అవుతుంది?" అన్నాడు.

"అబ్బే! ఇప్ప డొచ్చేయనూ! ఈ ప్రక్కపేటలోనే కాస్త పని ఉందిలే. జాగ్రత్తగా ఉండు. దొంగలున్నారు జాగ్రత్త! ఎహ్హెహ్హె" అని నవ్వుతూ అతను వెళ్లిపోయాడు.

అప్పటినుంచీ గోళ్లు గిల్లుకుంటూ ట్రంకు పెట్టెలమీదే కూలబడ్డాడు.

స్టేషనులో హడావుడిగా ఇటూ అటూ పరుగెత్తుతున్న ఇంజన్లు చూస్తూ కాసేపు గడిపాడు. ప్లాటుఫారం మైళ్ళపొడవున ఉన్నట్టు అనిపిస్తూంది. తను మును పెప్పుడూ చూడలేదు. తన వాళ్లు తన పెంపకం ఇంత అధ్వాన్నంగా చేసి విడిచారు. ఇక్కడ బెజవాడ చూస్తేనే తన కింత గాభరాగా అనిపించింది. తనకు కొత్తదనం ఉన్నట్టే ఎక్కడా బైలుపడనీయకుండా గంభీరంగా ఉండాలని ఇంటిదగ్గిర ఎన్నాళ్లో నిశ్చయించుకున్నాడు. కాని రైలు ఎక్కి ఎక్కటంలోనే తండ్రీ, ఈ నూతనుడూ కలిసి ఆ నిశ్చయం ప్రకటితం కాకుండా ఇట్టే అడ్డుపుల్ల విసిరేశారు.

ప్లాటుఫారం వరాండాలో ఎండ ఎదుగుతూంది. సామాన్లు రెస్టురూమ్ గోడదరికి చేర్చి గోడ కానుకున్నాడు. స్టేషను మరీ పెద్దదిగా కనబడుతూంది. ఎడతెరపి లేకుండా జనం అడావుడిగా ఇటూ అటూ తిరుగుతూనే ఉన్నారు. ఎనిమిదేళ్ల కూలీ కుఱ్ఱవాళ్ల దగ్గిరనుంచీ తన కంటే నిబ్బరంగా ప్లాటుఫారంమీద సునాయాసముగా పచార్లు చేస్తున్నారు.

గడిచిన టిక్కెట్టు ఇచ్చెయ్యలేదు. కాశీకి టిక్కెట్టు కొనుక్కోలేదు. గంటలు గడిచిపోతున్నాయి. టిక్కెట్టు ఇయ్యటం మొదలు పెట్టారో లేదో.. శర్మ వచ్చేదాకా టిక్కెట్టు కొనటం ఆపకపోతే బాగుండదు.

ప్లాటుఫారం ఇంత పొడుగునా ఉంది, ఎక్స్ప్రెస్ ఎక్కడ ఆగుతుందో! కూలీ కుఱ్ఱవాడి నడిగితే తక్కినవాళ్ల ముందరలాగా నామోషీ పడక్కర్లేకుండా ఉంటుందని అడిగాడు. "ఇక్కడే" అని చెప్పి కుఱ్ఱవాడు వెటకారంగా సాగిపోయాడు.

ఇంటి జ్ఞాపకాలు బలవంతాన తోసేసుకొంటున్నాడు. అవికూడా బలం కూడుకోని జ్ఞాపకాలలాగే వెనక్కి ఒదుగుతున్నాయి. తమ్ముడికిందాక రూపాయి యిస్తే బాగుండేదేమో అనిపించింది. "ఆ! ఎందుకు, పాడేసుకొంటాడు" అనుకొని సర్దుకొన్నాడు.

ఏమీ లేకుండానే ఏవో ఆదుర్దా, చిరాకూ మనస్సులో మెదులుతున్నాయి. పట్టాలమీద పచార్లు చేస్తూన్న ఇంజనుల వంకదీక్షతో చూస్తూ, మనాదిగా కూర్చున్నాడు.

"మీరు ఏ ఊరు వెళ్తారండీ?"

ఉలిక్కిపడి చూసి నుల్చున్నాడు. నల్గురు చదువుకొనే ఈడుల కుఱ్ఱవాళ్లే ముందు నుల్చున్నారు. ఒకతను ఖద్దరుబట్టలలో ఉన్నాడు. అతనే పలకరిస్తున్నాడు.

"కాశీ వెళ్తున్నానండి."

"మీకు కన్సెషన్ ఉందా?"

"కన్సెషన్ ఏమిటీ?"

అతను చిరునవ్వు నవ్వాడు. అందులో న్యూనత పరచట మనేదే లేదు.

"మీ రిదే మొదటిసారా కాశీ వెళ్లటం?"

చదువుకొంటున్న కుఱ్ఱవాళ్లు నలుగురైదుగురు కలిసి ప్రయాణం చేస్తే ముందుగా సగంఛార్జికి కన్సెషన్ తెప్పించుకోవచ్చు ననీ, తమదగ్గిర అల్లాంటి కన్సెషన్ ఫార్మ ఒకటి ఉందనీ ఒక పేరు ఖాళీగా ఉంచినీ, టిక్కెట్టు కొనిఉండకపోతే, రాఘవరావు కూడా కన్సెషన్లో టిక్కెట్టు కొనవచ్చుననీ, తప్పకుండా కొందామనీ అతను విశదపరిచాడు.

రాఘవరావు, ఈ నూతనుల కలయికకి ఉత్సాహంతో పుంజుకొంటున్నాడు. ఆ మాట్లాడిన అతని పేరు వెంకట్రావు. అడ్మిషన్ కాశీలోనే ప్యాసయి, ఐ యస్ సి తర్వాత ఇప్పుడు ఫార్మసూటికల్ కెమిస్ట్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. వెంకట్రావ్తో ఇట్టె స్నేహం కలిసింది. తక్కినవాళ్లూ తనతో సమానఫాయిదాలోనే మాట్లాడుతున్నారు.

శర్మ తిరిగి వచ్చాడు. "వీళ్ల కన్సెషన్లో ఒక ఖాళీ ఉందట- నన్ను-" అని చెప్పేలోగానే శర్మ అందుకొన్నాడు!

"ఇంకేం - బెస్టూ. ఆ ఒకటీ ఇద్దరం చెరి సగం పంచుకొందాం."

వెంకట్రావు స్నేహితులు సన్నగా మొగం ముడుచుకొన్నారు.

శర్మ ఏమీ బెదరలేదు. వెంకట్రావుతో మాటలు కలపబోతున్నాడు.

"మీరు కాశీలోనే చదువుతున్నారా? బాగుంది. ఎప్పడో అక్కడ చూసేఉంటాను. నన్ను చూశారా? మీ రే హాస్టలులో ఉన్నారు?"

"మేం హాస్టలులో లేం. 'నగ్వా'లో రూమ్ పుచ్చుకొని ఉంటున్నాం" అన్నాడు వెంకట్రావ్ ముభావంగా.

"అల్లాగా! అదీ సంగతి! సరే. ఇంకేమోయ్ రాఘవరావ్! నక్కను తొక్కి వచ్చావ్ ఇవ్వాళ; కన్సెషన్కూడా దొరికింది. ఎవరండీ రాని అతను - ఊర్కే అడుగుతున్నాను - గబుక్కున దోవలో చెక్కింగ్ వాళ్లు అడిగితే ఆ పేరు చెప్పొద్దూ? అహ్హహ్హ" అంటూ నవ్వాడు.

వెంకట్రావు చిరునవ్వు తప్పించనీకుండానే ఏదో పేరు చెప్పి ముభావంగా ఊర్కొన్నాడు.

"అతనా! అతను ఫోర్తుహాస్టల్ వాడు కాదూ? చదువైపోతే! - పోనీలెండి. ఎవరైతే మనకేం? కాఫీ తాగివద్దాం వస్తారా?"

"ఎందుకులేండి, మీరు వెళ్లి రండి."

శర్మ కాఫీ తాగి వస్తానని వెళ్ళాడు.

"ఎవరండీ యీయన, మీకు బాగా స్నేహితుడా?"

ఈ అవకాశం చిక్కినందుకు రాఘవరావు మనస్సు వికసించింది.

"అబ్బె! కాదండీ. రైలులో కలిశాడు."

"ఆబాల్యస్నేహితుడిలాగ మాట్లాడ్తాడే! అయినా కన్సెషన్ చెరిసగమని అంతా ఆత్రంగా అతను పంచుకోటం ఏమీ బాగుండలేదు. మాకు కనబడింది మీరు. మిమ్మల్ని మేం రమ్మని కోరింది.. ..." అంటూ వాళ్లలో ఆంజనేయులు అనే అతను అందుకున్నాడు.

"ఏదయినా కలిసివచ్చాం అంటూంటే కాదనటం వారికి మాత్రం ఎల్లా—అయినా మీరు మాట ఇచ్చేశారుగా పోనిద్దురూ" అన్నాడు వెంకట్రావ్.

రాఘవరావు ఎటూ అనలేక మాట్లాడక ఊర్కొన్నాడు. తనకు అదృష్టవశాత్తు సగం టిక్కెట్టు కలిసివస్తే, అందులో పాతిక శర్మ లాగేశాడని లోపల బాధగానే ఉంది. కాని వెంకట్రావ్ తన గౌరవప్రవర్తనానికి, దోవవేసేసి, "నడూ"అన్నట్లుగా మర్యాదగానే చూపించాడు.

"మాట ఇయ్యట మేంటండీ? ఇవాళే గా అతనితోటి పరిచయం. మేం మీకు మాతో కొనేస్తాం. మీరు మాట్లాడక ఊరుకోండి." అన్నాడు ఆంజనేయులు. మూడో అతను నవ్వాడు.

వెంకట్రావుకూడా నవ్వుతూ "ఈయనలో ఆ లోభిత్వం ఉన్నట్లు లేదులేవోయ్. అయినా కాస్తకు వెల్తిపడటం దేనికిలే. ఏమంటారండీ?"

"ఔనండీ, ఎందుకూ!.." - అన్నాడు నసుగుతూ రాఘవరావు.

"మీ కెందుకు నేను టిక్కెట్లు తెస్తాను; డబ్బిల్లా యియ్యండి." అని ఆంజనేయులు అందరి దగ్గిరా డబ్బు వసూలు చేసికొని వెళ్తూంటే శర్మ వచ్చాడు.

"నేనూ వస్తున్నానోయ్!" అంటూ ఆంజనేయులువెనుకే వెళ్ళాడు.

ఆంజనేయులు తన టిక్కెట్టూ మిగిలినడబ్బూ తనకు యిచ్చాడు. రూపాయిలూ చిల్లరాయింకా చేతిలోనే ఉన్నాయి. శర్మ వచ్చాడు— "హుహూ!" మని నవ్వుతూ.

"మన కెంత అయిందోయ్ రాఘవరావు? నువ్వు నా కియ్యాల్సింది - ఆగు- సగమూ ఎనిమిదిన్నర అయితే-నాలుగూ..." అంటూ దీర్ఘాలు తీస్తూ లెఖ్ఖ చెప్తున్నాడు.

రాఘవరావు మాట్లాడకుండా అతనికి డబ్బు ఇచ్చేశాడు. ఆంజనేయులు కోపంతో మొగం తిప్పకొన్నాడు. వెంకట్రావ్ ముసిముసి నవ్వుతో తనవంక సస్నేహంగా అర్థవంతంగా చూశాడు. శర్మ ఇది గమనించాడో లేదో అన్నట్లే ఉన్నాడు.

ఎక్స్ప్రెస్ అక్కడ ఆగలేదు. ఫర్లాంగు ముందుకు పోయి ఆగింది.

వాళ్ళేకూలీలను పిలిపించి వాళ్ల సామానులతో పాటు తన సామానులూ, శర్మవీకూడా పట్టుకు వెళ్తున్నారు.

ఎక్కువ రద్దీ లేని పెట్టెలోకే చేరారు.

"ఖాలీ ఎంతయిందండీ?" అన్నాడు శర్మ ఆంజనేయులుతో.

తను అడుగలేదే అనుకొని రాఘవరావు నాలుక కరుచుకొన్నాడు.

ఆంజనేయులు కటువుగా "మీవంతు అరణాలు" అని చెప్పి పుచ్చుకొన్నాడు.

తనూ అరణాలు ఇయ్యబోయాడు. వెంకట్రావ్, ఆంజనేయులూ మూగసంజ్ఞలతోనే వారించి, వద్దన్నట్లు చిరునవ్వు నవ్వారు.

శర్మ ఓమూల బెడ్డింగు పరిచేడు. తక్కిన వాళ్లూ సర్దుకొంటున్నారు. తను ఒదిగి కూర్చుంటున్నాడు.

"నీపక్క చుట్ట విప్పతావా ఏం ఖర్మమోయ్" అని శర్మ నవ్వాడు.

"ఉహూ, కూర్చుంటాను"

వెంకట్రావ్, పై బల్లమీది తన ప్రక్కను

రెండు చేసి, పై బల్లమీదే జంబుఖానా, తలగడా పరచాడు.

"మీ రిక్కడ పడుకోవచ్చునండీ - పక్క చుట్ట విప్ప అక్కర్లేదు. మూడుగంటల ప్రయాణమా, పడుకోకతప్పదు చూడండి."

అంటూ పక్కలు పూర్తిచేసి ఎదురు బల్లమీద కూర్చున్నాడు.

శర్మ తన పక్కమీదే బైరాయించి, "ఇప్పటినుంచీ పడుకోం కాదండీ! ఇక్కడ కూర్చోవచ్చు రండి."

అని వెంకట్రావును పిలిచాడు.

రైలు బయలుదేరింది.

రాఘవరావు కిటికీవైపుకు వచ్చి కూర్చున్నాడు. తక్కిన నలుగురూ, తమ పర్సులు తీసి, టిక్కెట్లు డబ్బులు లెక్కపెట్టుకొంటున్నారు.

రాఘవరావు పర్సు తీసి టిక్కెట్టు లోపల పెట్టాడు. అటూయిటూ చూశాడు. ఎవరిధోరణిలో వాళ్లున్నారు. పర్సు జేబూన ఉన్న పిన్ను గప్‌చిప్‌గా తీసి కిటికీలోనుంచి అవతలకు విసిరి, ఏమీ ఎరగనట్టు లోపలికి చూశాడు.

వెంకట్రావు చొక్కాలోపలి జేబుకు పిన్ను తగిలించుకుంటున్నాడు.

మిత్రద్రోహి

(11వ పేజీ తరువాయి)

కష్టం, నష్టం...అన్నిటికీ తెగించిన నేను ఆనాడు ఎలా ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను ఎదుగూబొదుగూ లేకుండా. తను మాత్రం బయట కూర్చుని, నన్ను ఎక్కేసి, ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుని అన్నివిధాలా బాగుపడ్డాడు. నిజానికి, ఆనాడు ఇద్దరం ఒకమాదిరిగానే నిరాశతో నీళ్లుకారుతూ ఉండేవాళ్లం. అలాంటి నాకు - మనం బాగుపడాలంటే దుర్మార్గం ఒకటే దారి - అని నూరిపోశాడు. దాన్ని సద్వినియోగం చేసుకున్న అతని కొనూత్రం బాగానే సరిపోయింది; నాస్థితి మాత్రం మరింత అధోగతిపా లయింది.

"ఆనాటినుంచీ అతని స్నేహితుణ్ణి కాస్తా సేవకుణ్ణి అయిఊరుకున్నాను. ఇదంతా మీరు ఎప్పుడో గమనించిఉండాల్సింది. ప్రతినిమిషం అతను నామీద అధికారం చలాయించటానికి ప్రయత్నించేవాడు. అవసరమైనప్పుడల్లా నేను దోషి నని జ్ఞాపకం చెయ్యటానికి ప్రయత్నించేవాడు. నేనుకూడా ఈమాత్రంగానన్నా నలుగురిలోనూ ఉండాలంటే అతనికి కష్టం కలగనియ్యకూడదని నా వ్యక్తిత్వాన్ని చంపుకుని అన్నిటికీ తలొగ్గిఉండేవాణ్ణి. నేనెంత తగ్గితే అతని కంత సంతోషం; ఇంకా అధికారం చలాయించటానికి అంత వీలూ అయేది రోజులు బాగుండక, చేసినదానికి అనుభవించక తప్పేదేముందని ఇన్నాళ్లూ అన్నిటికీ తలొగ్గిఉన్నాను. అలాటి మనిషిదగ్గిరికి మీరు ఒస్తుంటే చూస్తూ, చూస్తూ అతను తివ్వే గోతులో ఎలా పడనివ్వను?

"తగుమైన చావు చచ్చాడు! అసలు పురుగులు పడి చావాల్సింది! బతికినన్నాళ్లూ నా సహనం అంతు కనుక్కున్నాడు, దుర్మార్గుడు! మనిషి సహనానికీకూడా కొంత పరిమితంటూ ఉంటుంది. ఇదంతా బయటపెట్టి, దీనిలో ఎవరెంతవరకూ బాధ్యులో నిరూపించి, కడిగి ఒదిలిపెడదామని అనేకసార్లు అనిపించేది. కాని ధైర్యం చాలేది కాదు. ఇప్పు డెవర్నిని సాధిస్తాడు? అవతలివాళ్లని అంతే ఉసురుపెడితే - వాళ్లు చివరికి చచ్చేది ఇలాటి బలవంతపు చావే. ఇంకా నయం అదృష్టవంతుడు కుళ్లికుళ్లి చావాల్సింది!"

అతనిగుండె బరువు చాలావరకు తగ్గి మెదలకుండా కూర్చున్నాడు. నేనూ, వెంకటేశ్వర్లంటే నా కేప్పుడూ కోపంలేదన్నట్లు శాంతంగా కూర్చున్నాను. కొంచెంసేపు గడిచాక - శంకర శాస్త్రినుంచి నన్ను రక్షించావు - అన్నట్లు అతనివైపొకసారి చూచి—"వెళ్లి వస్తా"నని బయటపడ్డాను.

ఇంతకూ వాళ్లిద్దరూ చేసిన దుర్మార్గ మేమిటో తెలుసుకుందా మని మీకు ఆసక్తి కలిగి ఉండవచ్చు. వెంకటేశ్వర్లు మాటలన్నీ విన్న మీ కెంత తెలుసో, నాకూ అంతే తెలుసు. ఆ విషయం బయటపడిందంటే మనమంతా అతని "స్నేహితులం" అవతామని అతనిభయం. అసలిప్పుడు ఆరహస్యం అతనిదగ్గరనుంచి మనం గ్రహించే అవకాశంకూడా లేదు. వెంకటేశ్వర్లు ఈమధ్య ఇక్కడెక్కడా కనిపించటం లేదు.

అతని ఆచూకీ ఇంకా బయటపడవలసి వుంది. శంకరశాస్త్రిచావునిగురించి అనుమానమంతా ఇప్పుడు వెంకటేశ్వర్లుపైన ఉంది. నిజం ఒప్పుకోవలసివస్తే, ఈ విషయం నామనస్సు కెంతో స్వస్థత చేకూర్చింది.

రైతు తీర్పు

(15 వ పేజి తరువాయి)

'వున్నారండి'— అన్నారు యిద్దరు రైతులు...

'నీ కూతుర్ని యితనికొడుకుకు యిచ్చి పెళ్ళి చేసి ఆ బంగారమంతా వీళ్ళిద్దరికీ యిచ్చెయ్యండి'— అని పెద్దరైతు తీర్పు చెప్పాడు...

ఆ తీర్పు విన్న అలెగ్జాండరు ఆశ్చర్యపడి... 'ఏమయ్యా! యిలా చేశావే!...మా రాజ్యంలో యిలా చేయరు... భూమిలో చిక్కిన ధనమంతా ప్రభుత్వపరం కావలసిందేను...అంతగా వాళ్ళిద్దరూ ఆ ధనం కొరకు తగాదా పెంచితే, వాళ్లిద్దరికీ ఉరిశిక్ష యిచ్చేస్తాము'— అన్నాడు...

రైతు ఆశ్చర్యపడి 'ఏమండీ మీ దేశంలో వర్షాలు కురుస్తాయా?'— అన్నాడు.

'ఓ! ఎందుకు లేదు?' అన్నాడు అలెగ్జాండరు...

'మీ దేశంలో పచ్చిగడ్డి మేసే పశువులున్నాయా?' అన్నాడు రైతు...

'ఎన్నో వున్నాయి'— అన్నాడు అలెగ్జాండరు...

'అందుకే వర్షాలు కురుస్తున్నాయి'— అన్నాడు రైతు.

అలెగ్జాండరుకు అర్థం కాలేదు. అలాగే రైతు వైపు కొంతసేపు చూచి— 'నీ మాటలు నాకర్థం కాలేదు'— అన్నాడు.

'భగవంతుడు వర్షాలు ఆ నోరు లేని పశువులు మీ దేశంలో వుండబట్టి, వాటి మేతకొరకు వర్షాలు కురిపిస్తున్నాడు గాని, రక్తం ప్రవాహాలు కట్టించి, అన్యాయం చలామణీ చేశే మీ కొరకు గాదు'— అన్నాడు రైతు...

అలెగ్జాండరు యిదంతా బాగా అర్థం చేసుకోని, భారతదేశంలో అప్పటి న్యాయపాలన, ఆ రైతు తీర్పు, ఎంతో మెచ్చుకున్నాడు.

(అనుకరణ

'జాలరి - భూతం'

(14-వ పేజీ తరువాయి)

గోడ ఒకటి ఫళ్లుమని పగిలి దోవ యిచ్చింది. దాంట్లోంచి ఎర్రటిగడ్డంగల ఒక పెద్దమనిషి ఇవతలికి వచ్చి - "చేపలూ, మీవిధిని మీరు నిర్వర్తిస్తున్నారా?" అని అడిగాడు.

"ఔను, సంతోషంగా చేస్తున్నాము." అని చేపలు బదులు చెప్పాయి. అపుడా పెద్దమనిషి ఆ కుండని కిందికి నెట్టేశాడు. ఆ చేపలు అగ్గిలో పడి బుగ్గి అయ్యాయి; మాడి మసి అయిగాయి. అంతట ఆ వింతమనిషి గోడలోకి చేరాడు. మళ్లీ ఆ గోడ యథాప్రకారంగానే తయారయింది.

"ఇదంతా ఏదో చాలా తమాషాగా వుంది. దీని రహస్యం తెలుసుకుని తీరాలి." అని అనుకున్నాడు రాజు.

చప్పున రమ్మని జాలరికి చెప్పి పంపాడు. వాడొచ్చాడు.

"జాలరీ, నీవెక్కడ చేపలు పట్టావు"? అని రాజు ప్రశ్నించాడు.

"నగరానికి ప్రక్కగా కొంతదూరం పోతే కనబడే మూడుకొండల సమీపాన వున్న నీలపునీళ్ల సముద్రంలో పట్టాను." అని అన్నాడు చేపలవాడు.

"మంత్రీ, నీ వా ప్రదేశం ఎరుగుదువా?"

"ప్రభూ, ఆ ప్రాంతానికి ఎన్నోసార్లు వెళ్లాను గాని, నా కెపుడూ ఆ పర్వతాలు కానీ, సముద్రం గానీ కనిపించలేదు."

"ఐతే, ఆ ప్రదేశం ఎంతదూరంలో ఉంది?"

"మూడుగంటల ప్రయాణం" అన్నాడు జాలరి.

"ఐతే చూస్తాం, పదండి." అని రాజు, తన అంగరక్షకుల్ని కొందర్నీ, ఆ చేపలవాణ్ణీకూడా తీసుకుని ప్రయాణం కట్టాడు. ఆ ప్రదేశానికి వెళ్లి, నీలపునీళ్ల సముద్రం చూచేప్పటికి జాలరి తెచ్చియిచ్చిన చేపల్లాంటి చేపలు చాలా కనిపించాయి.

"మీ రంతా ఇక్కడే ఆగండి. నేను వెళ్లి సంగతంతా తెలుసుకుని వస్తా నని చెప్పి నెమ్మదిగా కొండమీది కెక్కాడు రాజు.

కొండ కవతలప్రక్క ఓ పెద్ద రాజభవనము కనబడ్డది. ఆభవనం ఎర్రరాళ్లతో కట్టబడివుంది. అక్కడికి వెళ్లి రాజు తలుపు తట్టాడు. అతీ గతీ లేదు. పిలిచి చూచాడు. మనిషిపత్తా లేదు. తలుపులు తోసుకుని లోపలికి వెళ్లాడు. లోపలంతా చిత్రవిచిత్ర అలంకారాలతో శోభించే గదులెన్నో ఉన్నాయి. కాని ఎక్కడా మనిషి వాసనే లేదు. ఆ బంగళాచుట్టూ తోట ఉంది. ఆ తోట రకరకాల పూలతో పండ్లతో అందముగా ఉంది. ఈ గదులన్నీ దాటుకుని రాజు హాల్లోకి వచ్చాడు. అతడి కక్కడ కొన్నిమాటలు వినిపించాయి: "నాకు బతకాలనే ఆశ ఎంతమాత్రం లేదు. ఎంత త్వరగా చనిపోతే అంత మేలు" అని ఎవరో విచారంతో భారంగా వాపోతున్నారు. రాజు ఇంకా ముందుకు సాగిపోయాడు. అక్కడ ఒక యువకుడు కూర్చుని వున్నాడు. అతడివద్దకు వెళ్లాడు రాజు. "ప్రభూ, నీవు రాజు వని తెలుసును. ఐనా నిన్ను మర్యాద చేయడానికి నిలుచుకోలేను" అని ఆ యువకుడు చెప్తూ, తన కాళ్లమీద గుడ్డను తొలగించి చూపించాడు. అతని పాదాలు తెల్లరాళ్లతోచేయబడినబొమ్మ పాదాలల్లేవున్నాయి.

"ఇదేమిటి! నీకీ రాతికాళ్లేమిటి? వంటకై పొయిమీద పెట్టిన చేపలు మాట్లాడ్డ మేమిటి? ఆ ఎర్రగడ్డంమనిషి గోడలోంచి రావడ మేమిటి? ఇదంతా ఏదో గందరగోళంగా వుంది. ఈ వివరాలంతా చెప్పు" అని రాజు ఆశ్చర్యంతో రాతికాళ్లవాణ్ణడిగాడు.

యువకు డిలా చెప్పడం ప్రారంభించాడు:

"ఈ మూడుకొండలూ ఈ రంగు సముద్రమూ వున్నచోట పూర్వం ఓపెద్ద రాచనగరుఉండేది. ఆ నగరానికి ప్రభువు మాతండ్రి. మా నాయనగారు మరణించిన తరువాత ఆ రాజ్యం నాకు వచ్చింది. నే నొక చక్కని చుక్కను పెండ్లాడాను. కాని కృతఘ్నురాలు ఆమెమాత్రం నన్ను ప్రేమించలేదు; ఒక సేవకుణ్ణి ప్రేమించింది. ఇది సహించలేక నే నాసేవకుణ్ణి చంపేయాలనుకున్నాను. అతణ్ణి మొత్తాను. కాని అతడు చావలేదు. ఈ చర్యవలన నాపెళ్లానికి చాలా కోపం వచ్చింది. ఆ దేవో మంత్రాలో ఏవో నాలుగు మాటలు పలికింది. వెంటనే ఆశ్చర్యంగా నా కాళ్లు రాళ్లుగా మారిపోయాయి. నా నగరమంతా ఈ మూడు కొండలుగా సముద్రంగా మారిపోయింది. నా ప్రజ లందరూ చేపలుగా మారిపోయారు. అల్లదిగో, ఆ కనబడే ఉద్యానవనంలో ఒక చిన్న చలవరాతి మేడ ఉంది. ఆ మేడలో ఆ సేవకు డున్నాడు. అత డింకా బతికే వున్నాడు. కాని కదల్లేడు, మెదల్లేడు. ప్రతిరోజూ నా పెళ్లాం వాడిదగ్గరకు పోయి వస్తూంటుంది."-ఈవిధంగా తన కథ సాంతంగా వినిపించాడు.

ఆ సంగతి విన్న రాజుకి, రాజకుమారుడికి తగిన సహాయం చేయాలని సంకల్పం కలిగింది. వెంటనే పాలరాతి మేడ కెళ్లాడు. అక్కడ సేవకుడు మంచంలో పడివున్నాడు శవాకారంగా. రాజు అతడిదగ్గర కెళ్లి కిక్కురు మనకుండా గొంతు నులిమేసి వాణ్ణి చంపేశాడు. ఆ సేవకుడి స్థానంలో రాజే స్వయంగా - అచ్చు సేవకుడిలాగా వాడి వేషంతో పడుకుని ఉండినాడు.

కొంతసేపటికి రాణి వచ్చింది. సేవకుడే అనుకుని రాజుని పరామర్శించింది-"ఓ నా సేవకుడా, సుఖంగా వున్నావా"? అని.

"నా కెలా నిద్రపడుతుంది? ఈ రాజకుమారుడు అస్తమానం అరుస్తూ, ఏడుస్తూ గోల పెట్టూంటే నా కెక్కడి నిద్ర? తన కాళ్లు రాయిలా అయిపోయాయని ఒకటే గోల, పాడుగోల!" అన్నాడు రాజు.

ఆ మాటలు విని రాణి ఆ రాజకుమారుడి - తన భర్త - వద్దకు వెళ్లి కొన్ని నీళ్లు అతడిమీద చిలకరించింది. అతనికాళ్లు మామూలుస్థితిని పొందాయి. అత డిప్పుడు నడవగలడు.

మళ్లీ వచ్చి "సౌఖ్యంగా వున్నావా?" అని రాణీ అడిగింది.

"రాత్రిపూట ఆ సముద్రంలో చేపలుగా మారిఉన్న జను లంతా అరుస్తూంటే నా కెలా నిద్రపట్టుంది?" అని జవా బిచ్చాడు రాజు.

అప్పుడు రాణీ ఎలాగయినా తన ప్రేమపాత్రుడైన ఆ సేవకుడికి సౌకర్యం కల్పించాలనే తలంపుతో ఆ సముద్రం వద్దకు వెళ్లి, ఏవో నాలుగుముక్కలు చెప్పింది. అంతటితో ఆమూడు కొండలూ, ఆ సముద్రమూ యథాప్రకారం పెద్ద నగరం అయిపోయింది. చేపలన్నీ, ప్రజలయాయి.

అలా చేసి ఆమె తిరిగి రాజుదగ్గిరికి వచ్చి "నీ సుఖానికి అడ్డాలైనవాటి నన్నిటనీ తొలగించాను. ఇప్పుడైనా నీకు సుఖం కలిగితే నా కదే పదివేలు" అని అంది.

"రా, నారాణీ, దగ్గిరకు రా! మరీ దగ్గిరికి రా!" అన్నాడు రాజు.

పాపం రాణీకి ఇందులో ఉన్న మోసం తెలియక తన వేలపుకాడే అత డనుకొని దగ్గిరికి వచ్చింది.

అమాంతంగా పైన బడి, ఆమెను అదిమి పట్టి, పీక నొక్కేసి చంపేశాడు రాజు.

అత డప్పుడు రాజకుమారుడివద్దకు వెళ్లి "రాణీ పీడవదలింది. ఆమె ఇక లేదు. నీ నగరం మామూలు స్థితి కొచ్చింది. నీ ప్రజ లంతా మళ్లీ మనుష్యు లయ్యారు. అంతా యథాప్రకారం ఐంది. నీ రాజ్యాన్ని నీ విక ఒడిదుడుకులు లేకుండా పాలించుకో!" అని చెప్పి రాజు వెళ్లిపోయాడు.

తన కష్టా లన్నీ గట్టెక్కడానికి ఆ జాలశే కదా కారణం అని, అతడికి చాలా డబ్బు ఇచ్చి గౌరవించాడు. అది మొదలు ఆ చేపలవాడు, భార్యా, బిడ్డలూ సుఖంగా వుంటూ వచ్చారు.

[ఆంగ్లకథ ఆధారంగా]

ప్రజాభిప్రాయం

(8 పేజీ తరువాయి)

ఒక సభ్యుడులేచి, "భూఖామందు అడుగుతూన్న ధరచాలా ఎక్కువ అనీ పంచాయతీ భరించకూడదనీ" తీవ్రంగా వాదించాడు. అంతవరకూ బాగానే ఉంది. కాని మర్నాడునుంచి గ్రామస్థులు తమ తమ సంభాషణలలో, "వెంకయ్యకు, రామయ్యమీది పగ బయలుదేరింది! మొన్నటిదాకా కలిసే ఉండేవారుగా" అనుకొనేవారు. ప్రజాక్షేమసూత్రాల ప్రత్యక్షస్వరూపం వాళ్లకు ఆ రూపంలో కనబడేది.

కాని పల్లీయులకు "మానవస్వభావం" తెలిసినంతగా "చదువుకొన్నోరి" కెవరికీ తెలియదని మాత్రం నాకు విశ్వాసంగా తెలిసివచ్చింది. ప్రజల ననేకమందిని, అనేకస్వభావ స్వరూపాలలో, ప్రత్యక్ష జీవితపరిస్థితుల్లో వాళ్లు చూసి తెలుసుకొన్నారు. పట్టణాల "చదువుకొన్నోరికి" వారికి మానవుని విషయంలో తెలిసిన జ్ఞానంలో శతాంశం తెలియదు. "చదువుకొన్నోరికున్నంత"నోరు వాళ్లు బైలుపెట్టరు. అల్లా వాళ్లు బయలుపెట్టేదాకా ఏ సమస్య మీద అయినా నిజమైన ప్రజాభిప్రాయ మేమిటో బైలుపడదు.

గ్రంథ స్వీకారము

రైతుబాబు :

సాంఘిక పద్యకావ్యము. ప్రతులకు రచయితకే వ్రాయునది. డాక్టరు పొందూరి సాంబమూర్తి, రావులపట్టు - ఉంగుటూరు పోస్టు, వయా తాడేపల్లిగూడెం. వెల 1-0-0.

శ్రీజానకీశతకము :

రామదండకము · రచయిత ఉపేంద్రము శంకర నారాయణరాజు, బోర్డుహైస్కూల్, మదనపల్లి. వెల లేదు.

విజ్ఞాన సాహిత్యవనం బెజవాడవారి ప్రచురణలు

ప్రేమలేఖలు :

రచన ఉగ్రజీ. అనువాదం శర్మ. వెల 1-0-0.


పరీక్ష :

నవల. జైనేంద్రకుమార్. అనువాదం అయాచిత్. వెల 1-8-0.

నేరస్థులు : వారి స్థితిగతులు :

రచన. ఎ. ఎం. సోమసుందరం. వెల 2-0-0

లేఖలు



పంచాయితీ ప్రభుత్వం

మనరాష్ట్ర స్థానిక స్వపరిపాలనా మంత్రిగారు ప్రజాభిప్రాయముకొరకు ప్రకటించిన పంచాయితీబిల్లులో గ్రామోద్యోగులను కూడా పంచాయితీ సిబ్బందిక్రిందకు మార్చిననాడు మహాత్మాజీ వాంఛించిన గ్రామస్వరాజ్యం పూర్ణము కాగలదు. కొందరు కాంగ్రెస్ ప్రముఖులే బిల్లులో సూచించిన ప్రకారం పంచాయితీ అధ్యక్షుని సాముదాయకంగా ఎన్నుకొనటం గురించిన్నీ, కొన్ని కులములకు ప్రత్యేకస్థానములకు అవకాశం లేకపోవటం గురించిన్నీ విమర్శించుట శోచనీయం.

గ్రామపంచాయితీలకు సివిలు, క్రిమినలు అధికారాలు దఖలు పర్చడంతోపాటు బ్రిటిషు వారికాలంనుంచి వంశపారంపర్యా వస్తోన్న గ్రామోద్యోగులను వారి సిబ్బందిని పంచాయితీ అధీనపుసిబ్బందిగా మార్చిననాడుగాని స్వరాజ్యం గ్రామస్వరాజ్యం పూర్ణమైనదిగా నుండనేరవు. గ్రామోద్యోగులు (విలేజి ఆఫీసర్సు) గ్రామాలలో ప్రజల అందరిపైనా సర్వాధికారములు గలిగినవారగుచున్నారు. ప్రజలు మంత్రులను, యితర పెద్ద అధికార్లను మార్చుటగాని, బదిలీలు చేయించుకొనుటకుగాని హక్కులు కలిగియున్నారు. యీ గ్రామాధికార్లపై గ్రామీణులకు అట్టి హక్కులు లేకపోయినా కనీసం గ్రామపంచాయితీఅధీనంలో పరిశీలనలో వారి కార్యక్రమవిధులు అనుసరించేటట్లు అయినా చేస్తే ప్రజలు స్వతంత్రులయి స్వరాజ్యంయొక్క గ్రామపాలనయొక్క ఫలితములను పొందగలరు.

వాస్తవమునకు గ్రామోద్యోగులు చిన్న వుద్యోగులయిననూ గ్రామప్రజలు ఏది కోరిననూ గ్రామఅధికార్ల ద్వారానే వారి అభిప్రాయంతోనే దరఖాస్తులు పై అధికార్లకు వెళ్లవలెను. లేదా పైఅధికార్లు గ్రామాధికారి రిపోర్టుకొరకు అయినా పేపర్లు పంపడం జరుగుతూండడం సంప్రదాయం అయింది. అందువల్ల గ్రామవుద్యోగుల ఆదరాభిమానములకు గురిఅగుటకు ప్రజలు వినయవిధేయతలు కలిగివుంటున్నారు. అట్లా తప్పినవారికి గ్రామాలలో నివాసమునకు కూడా తావు లేదు. బండి పట్టాలు కావలిస్తే, కిరసనాయిలుకు పర్మిటు కావలిస్తే, రెండవ పంటకు నీరు హక్కు కావలిస్తే—ఒకటేమిటి ప్రతీది, ఆఖరికి జనన, మరణ రిజష్టరులో నమోదుకు కూడా వారిని ఆశ్రయించడం తప్పుటలేదు. అవసరమా? న్యాయవిచారణలతో నిమిత్తంలేకుండా శిఫార్సులు జరుగుతూ వుంటాయి. గ్రామాలలో సాముదాయకంగా చెర్వులు, పుంతలు, కాల్వగట్ల పాటలు ప్రయివేటు పాటలకు పాడించి, తిరిగి పెద్ద మొత్తములకు పాడించి ఆ సొమ్ములు అన్నీ జమాబందీ, యితర మామూళ్ల క్రింద ఎంతెంత మొత్తములు పంచాయితీ చిరాలకు రాకుండా గ్రామాధికార్ల చేతులలో హరించిపోతున్నాయో గ్రామాలలో విచారణ చేస్తే బోధపడగలదు. గ్రామపంచాయితీలు జమీందారీగ్రామాలకు సంబంధించినవి అయితే పుంతలు, పొరంబోకులు వృక్షములు అన్నీ జమీందారువే అని అనేకవిధముల పంచాయితీల ఆదాయమునకు ఎంతో హాని కలుగచేయున్నారు. అందువల్ల యిప్పటి విధులను పంచాయితీఅధీనంలో పరిశీలనలో జరిగించేలాగున బిల్లులో మంత్రిగారు చేర్చినట్లయితే క్రొత్త సూచన చేసినవారగుదరు.

గ్రామోద్యోగుల వంశపారంపర్యా హక్కుకు ఏమాత్రం భంగం తేనక్కరలేదు. బదిలీలు చేయనక్కరలేదు. పరిశీలనాధికారం కొంతయినా గ్రామపంచాయితీలకు కల్పించవలెను. గ్రామాలలో భూమినెంబర్లు, పరిమితములు వలయుచో నకళ్లు దొరకటమే కష్టం. అందులో యిప్పుడు కంట్రోళ్లు వచ్చిన తరువాత వారి కలమునకు వున్న విలువ ఏ ఆఫీసరుకూ లేదు. అన్ని శాఖల అధికార్లు గ్రామోద్యోగులపై ఆధారపడి వ్యవహరిస్తూ వుంటారు. అటువంటప్పుడు గ్రామవుద్యోగుల రిపోర్టులు, గ్రామపంచాయితీపరిశీలన జరిగిన పిమ్మటనే వారి కాగితములకు విలువ వుండేలాగున వుండుటకు అనువైన పద్ధతులు ప్రభుత్వం బిల్లులో చేర్చవలెను.

గ్రామ పంచాయితీ అధ్యక్షుని ఎన్నికలు సాముదాయకంగా జరుగించుటలో గ్రామంలో అందరి ప్రేమకు, నమ్మకమునకు గురి అయిన వ్యక్తి ఎన్నుకోబడుటకు అవకాశం వున్నది. ప్రజలు కోరిన వ్యక్తి రావలెనంటే సాముదాయిక ఎన్నికయే! మెంబర్లలో నుండి అధ్యక్షుని ఎన్నికవలన అనర్హత, ప్రజావ్యతిరేకులు కూడా అధ్యక్షులుగా వచ్చుటకు వీలున్నది. ప్రజల అభీష్టం నెరవేరవలెనంటే మెంబర్లలో నుంచి అధ్యక్షుని యెన్నిక అక్రమము. మైనారిటీలు వుంటే వారి ప్రాతినిధ్యం వహించుటకు మెంబర్లు బోర్డులో వుండెదరు. మెంబర్ల అవిశ్వాస, విశ్వాసములపై అధ్యక్షుడు ఆధారపడితే రోజూ మారుచుండుట తటస్థించును. అందువల్ల ఆర్థికంగా అధ్యక్షుడు తప్పు చేసినట్లు రుజువు చేసిన యెడల అట్టి అధ్యక్షుని తొలగించుటకు మెంబర్ల ఆరోపణలు రుజువయిన పిమ్మట ప్రభుత్వమునకే అధికారం వుండవలెను. లేనియెడల 3 సం॥ రములు అధ్యక్షుడుగా వుండవచ్చును. రాష్ట్ర సమస్యలే గ్రామాలలో వుత్పన్నమగును. ప్రధాన మంత్రిని రాష్ట్ర సాముదాయకంగా ఎన్నుకుంటే పరిస్థితులు వేరుగా వుండును కదా? కావున నియోజకవర్గంయొక్క వైశాల్యం కుశలమగుటచే ఎంతెంత పెద్దవారయినా, ప్రజాభిమానులయినా ఓటమికి గురి కావలసినదే. నియోజకవర్గ వైశాల్యం ఎంత విశాలమయితే అంత విశాల బుద్ధి గలవారు మాత్రమే ఎన్నుకోబడుటకు అవకాశం వున్నది.

జిల్లాబోర్డుకు మెంబరుగా ఎన్నుకోబడలేని వ్యక్తి ఎస్సెంబ్లీకి ఎన్నిక కావచ్చు. ఎస్సెంబ్లీకి ఎన్నిక కాలేని వ్యక్తి సెంట్రల్ గవర్నమెంటులో వుపమంత్రి అయినా కావచ్చు. ఆఖరుకు గవర్నరు జనరలు అవవచ్చును. కావున గ్రామ పంచాయితీ అధ్యక్షులను సాముదాయకంగా ఎన్నుకొనే పద్ధతియే వుత్తమమయినది. యీ సూచనకు మంత్రిగార్ని ఎంతనో అభినందింపవలసియున్నది.

యిక కొన్ని కులముల వారికి ప్రత్యేకస్థానముల గురించి ఆందోళన చేయుచున్నారు. ఈ ప్రత్యేక స్థానములు బ్రిటిష్ వారి హయాములో ఏర్పాటు అయినవి. సవర్ణ, అవర్ణ భేదములు రేకెత్తించి భిన్న, భిన్న అభిప్రాయములు రేకెత్తించే వుద్దేశంతో ఏర్పాటు చేసినవి కోరుట జాతీయ దృష్టి కానేరదు.

కులములవారి చూచుకుంటే ఎవ్వరికి వారే అల్పసంఖ్యాకులు అయ్యివున్నారు. ఆ విధానం దేశ, గ్రామ క్షేమములకు ఎంతనో హానికరములు. అందుచేత వర్గములకు ప్రాతినిధ్యం యిచ్చేటట్లు చేయుట మంచిది. వ్యవసాయ కూలీలకు, మధ్యతరగతుల వారికి, భూస్వాములకు జనాభా నిష్పత్తిని బట్టి స్థానములు వుంచుట మంచిది. అది అసాధ్యమైననాడు అన్నియు జనరలు స్థానములుగనే వుంచుట మంచిది. యీ బిల్లు త్వరలో ఎస్సెంబ్లీలో ప్రవేశపెట్టి, త్వరలో ఎస్సెంబ్లీ మెంబర్లు శాసనం చేసి ప్రసాదిస్తారు అని ఆశిస్తున్నాము.

తంగిరాల కృష్ణానందతిలక్.

గ్రామపంచాయితీ కోర్టులు : న్యాయ పరిపాలన

అయ్యా,

ప్రస్తుతం అమలులో వున్న గ్రామపంచాయితీ కోర్టుల ఆక్టు చాలాకాలము క్రింద చేయబడి ప్రజలకు సరిఅయిన న్యాయమును కలుగచేయ లేకున్నందున ప్రస్తుతం సదరు ఆక్టును సవరణ చేయవలసిన అంశములను యీ దిగువ నమోదు చేయబడినది.

(1) మద్రాసు గ్రామపంచాయితీ కోర్టుల 1949 సవరణ ఆక్టు అని పిలువవలెను.

(2) 5000 లకు తక్కువలేని జనాభాగల్గిన ప్రతిగ్రామమునకు ఒక పంచాయితీ కోర్టు అయిదుగురు మెంబర్లకు తక్కువ లేకుండా వెయ్యి మందికి ఒక మెంబరు చొప్పున 11 మంది సభ్యుల కంటె యెక్కువ లేకుండా ఉండులాగున ఒక కోర్టు ఉంచవలెను.

(3) అట్టి పంచాయితీ కోర్టు మెంబర్లు ప్రస్తుతం అమలులో వున్న ఆక్టు ప్రకారం చేతులు ఎత్తించు పద్ధతిని గాక వయోజన వోటర్సు లీస్టు ప్రకారం ఉండే ఓటర్లుచే, తాహస్సీలుదారు హోదాకు తక్కువలేని అధికారి యొక్క నిర్వహణ క్రింద ఎన్నిక జరుపవలెను. అట్లు ఎన్నిక అయిన మెంబర్లచే ఒక ప్రెసిడెంటు, వైస్ ప్రెసిడెంటును ఎన్నుకోబడవలెను. అట్లు ఎన్నిక అయిన ప్రెసిడెంటును మెంబర్లు పదవి నుంచి తీసివేయుటకు అధికార ముండకూడదు.

(4) అట్లు పంచాయితీ కోర్టువారు యిప్పుడు అములులో వున్న ఆక్టు ప్రకారం Rs. 1 to 50 లు వరకు కాక Rs. 1 to 100 వరకు గల దావాలు విచారించుటకు అధికారము కల్గియుండవలెను.

(5) అట్టి కోర్టుపైన అప్పీలు అధికారం సివిల్ కేసులలో ప్రాంతీయ డి॥ మునసబు కోర్టుకున్నూ—క్రిమినల్ కేసులలో డిప్యూటీ కలెక్టర్ కోర్టుకు అధికారము కల్గియుండవలెను. సదరు కోర్టు మెంబర్లయొక్కగాని, ప్రెసిడెంటుయొక్కగాని అవినీతిని రుజువుచేయుచూ డి॥ మునసబు కోర్టులో పిటిషన్ యెవరు దాఖలు చేసిననూ అట్టి పిటిషన్ విచారించి మెంబర్లనుగాని ప్రెసిడెంటునుగాని పదవి నుండి తొలగించుటకు మునసబుకోర్టువారికి అధికారము వుండవలెను.

(6) యిక మునిసిపల్ లిమిట్సులో వున్న పట్టణములలో గ్రామ పంచాయితీ కోర్టులు పనికి రావు. అందువల్ల ప్రజలుకు యెట్టి ఉపయోగం జరుగుట లేదు గాన, టౌన్ సివిల్ కోర్టులు మాత్రమే పెట్టవలెను. అట్టి టవున్ సివిల్ కోర్టులకు సివిల్ కోర్టులో మంచి అనుభవము కల్గి హెడ్ గుమాస్తా హోదాకు తక్కువకాని వారిని ఆయా జిల్లా జడ్జీలవల్ల నామినేట్ చేయబడవలెను. అట్టివారి పదవి 3 సం॥ లకు మించి వుండరాదు. అట్లు నామినేట్ కాబడిన ఆఫీసరు తన సౌకర్యం కొరకు ఆ పట్టణంలోని ముగ్గురు ఘరానా మనుష్యులను మెంబర్లుగా నామినేట్ చేయుటకు జిల్లా జడ్జీకి రికమెండేషన్ చేసినదానిని అంగీకరించిన వెంటనే వారు గౌరవ సభ్యులుగా ఉండి కేసులలో ప్రెసిడెంటుకు సహాయపడగలరు. అట్టి టవున్ సివిల్ స్మాల్ కాజు కోర్టుల పైన, గ్రామపంచాయితీ కోర్టుల పైన ప్రతి సం॥ రం తనిఖీ చేయు అధికారం ఆ ప్రాంతీయ మునసబు కోర్టువారికే ఉండవలెను.

పోతుకూచి సుబ్రహ్మణ్యం.

ఆయుర్వేద వైద్యులకు అన్యాయం

దేశీయవైద్య కేంద్ర సంఘపు ఎన్నికలలో B క్లాసు వైద్యులకు న్యాయముగా ప్రత్యేకింపదగినన్ని స్థానములను ప్రత్యేకింపక, అల్పసంఖ్యాకులయిన A క్లాసువారికి అత్యధిక స్థానములను ప్రత్యేకించి, ఆయుర్వేద వైద్యులకు ప్రభుత్వమువారే చాలా అన్యాయమును చేసియున్నారు. అందువలన కేంద్రసంఘమునందు, యథార్థముగా ప్రజాసేవ చేయుచున్న, అధిక సంఖ్యాకులయిన, B క్లాసు వైద్యులకు, తగినంత ప్రాతినిధ్యము లేకపోయినది. కావున లోగడ, B క్లాసు వైద్యులకు జరిగిన అన్యాయమును తొలగింపవలసిన బాధ్యత ప్రభుత్వము వారిపై నున్నది.

సెంట్రల్ బోర్డుకు గల 26 స్థానములలో, 23 స్థానములకు ఎన్నికలు జరిగినవి. తక్కిన 3 స్థానములను, ప్రభుత్వ నియామకములై యున్నవి కావున, ప్రభుత్వమువారు, సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులును, పండితులును, ఆయుర్వేదాభివృద్ధికై నిరంతరమును కృషిసల్పుచున్న శ్రీ భిషగర్వ పండిత మల్లాది రామమూర్తిశాస్త్రి (ఆంధ్ర రాష్ట్ర ఆయుర్వేద కాంగ్రెస్ అధ్యక్షులు), 2. శ్రీ వస్తాదు వెంకటస్వామినాయుడు (పశ్చిమ గోదావరిజిల్లా ఆంధ్రవైద్యమండలి అధ్యక్షులు), 3 శ్రీమాన్ అగ్నిహోత్రం విజయసారథి ఆచార్యులు (ఆంధ్ర వైద్యమండలి అధ్యక్షులు) గార్లను, సభ్యులుగా నియమించి, B క్లాసు వైద్యులకు న్యాయమును కలుగజేయగలందులకు కోరుచున్నాము.

గోనెళ్ళ వెంకటేశ్వర్లు.

"దత్తమండలాని కొక"స్పిన్నింగు మిల్లు

అయ్యా,

"ఈ నెల 10వ తేదీన వెలువడిన ఆంధ్రపత్రికలో, మద్రాసురాష్ట్రీయ చేనేత పనివారల సంఘం ఒక స్పిన్నింగ్ మిల్లును కొనడానికి నిశ్చయించినట్లు, ప్రచురింపబడినది. ఈ సందర్భమున తెలుపున దేమనగా, ఇదివరలో 1947 సంవత్సరంలో, కడపజిల్లా కమలాపురములో, ఒక స్పిన్నింగుమిల్లు "కమలాపురం స్పిన్నింగ్ అండ్ వీవింగుమిల్సు లిమిటెడ్" అను పేరుతో ప్రారంభింపబడి, దాదాపు ఒకలక్ష రూప్యములు షేరు ధనము వసూలుకాబడి, కడప సెంట్రల్ బ్యాంకిలోను, కెనరా బ్యాంకిలోను డిపాజిటు చేయబడియున్నది. కొన్ని కారణములచేత, పై మిల్లు కంపెని అధికారము గజరాజ్ అండ్ కంపెనీ మద్రాసువారికి మార్పబడెను. తదుపరి ఆకంపెనీ మేనేజింగ్ డైరెక్టరుగారైన శ్రీ గజపతిరాజుగారు హఠాత్తుగా కాలగతి నొందుటచే, మిల్లు కార్యక్రమము నిలచిపోయినది. కనుక, రాష్ట్రీయ చేనేత పనివారల సంఘమువారు, పై మిల్లును పునరభివృద్ధికి తెచ్చి, వసూలుకాబడిన ధనసహాయమును స్వీకరించి, దత్తమండలములో, అనుకొన్నట్లు, ఒక స్పిన్నింగుమిల్లును, కడపజిల్లా కమలాపురములో నెలకొల్పెదరని కోరుచున్నాను."

బి. నాగభూషణం.

ప్రాథమికోపాధ్యాయుల జీతాలు

ఆర్యా,

ఎయిడెడ్ ప్రాథమికోపాధ్యాయుల నెల జీతాలు, జాన్యువరి నెలజీతం మార్చిలోను, ఫిబ్రవరి నెలజీతం మే నెలలోను యివ్వబడినవి. క్వార్టర్ల గ్రాంటులు యిచ్చేటప్పుడు, జాన్యువరి, ఫిబ్రవరి, మార్చితో అంతమయ్యే క్వార్టరుకు మే నెలలో యివ్వబడేవి. ఈ నెలవారీ జీతాలవల్ల మార్చి నెల జీతం జూన్ నెలలోగాని వచ్చేట్టు లేదు.

క్వార్టర్ల గ్రాంటులు చెక్కులు ద్వారా పంపేవారు. అందుచేత ఎంత సొమ్ము అయినా రూ. 0 5-6 తో తేలిపోయేది. ఈ నెలజీతాలు మనియార్డర్లలో పంపుతున్నారు. అనగా 100 కి రూ 1-4-0 చొ॥ న ఉపాధ్యాయుల జీతముల నుండి మనియార్డరు కమీషను క్రింద మినహాయింపబడుతుంది. ఈ సందర్భములో ప్రాథమికోపాధ్యాయునికి మానేజర్లు యిచ్చేప్రావిడెంటు ఫండు కంట్రిబ్యూషను 0-12-6 ఉపాధ్యాయునికయే మనియార్డరు కమీషను ఖర్చు 0-8-6, పోను 0-4-0 మాత్రమే ప్రావిడెంటు ఫండు సేవింగ్సు తేల్తుంది. దుంగరాజు పోయి లింగరాజు వచ్చినట్టుగా ఈ నెల జీతాలవల్ల ఎయిడెడ్ ప్రాథమికోపాధ్యాయుల ఆర్థిక స్థితి నీరసిస్తున్నదే గాని లాభించుట లేదు. గాన జిల్లా బోర్డు ఉపాధ్యాయుల కిస్తున్నట్లుగా, ట్రజరీకి 5 మైళ్లలోపు ఉన్న ఉపాధ్యాయుల జీతములు చెక్కులద్వారా పంపిస్తూ 5 మైళ్లు దాటిన ఉపాధ్యాయుల జీతములు ప్రభుత్వమే మనియార్డరు ఖర్చులు భరిస్తూ, సకాలంలో నెలవారీ జీతములు అందే ఏర్పాట్లు చేయగలరని మనవి చేస్తున్నాను.

కొడుకుల నారాయణ.

రష్యా రైతుజీవితం

(ఒక అమెరికన్ ఉద్యోగి)

[ఈ వ్యాసం, రష్యానుంచి తిరిగివచ్చిన ఒక యునైటెడ్‌స్టేట్సు గవర్నమెంటువుద్యోగి, సోవియట్ యూనియన్ సహకార సాగుబడి చేసే రైతుల జీవితాలు ఎంచుమించు తను పేర్కొనబోయే "యివాన్" అనే రైతుజీవితం వలెనే వుంటుందని వెల్లడించిన విషయాలు.]

యు. యస్. యస్. ఆర్. లో వున్న 240,000 కలెక్టివ్ ఫారమ్స్‌లోని ఒక ఫారంలోని 40 యేళ్ల రైతు "యివాన్" 36 సంవత్సరముల అతని భార్య "మేరియా," 14 యేళ్ల కొడుకు "స్టెఫెన్," 12 యేళ్ల మరోకొడుకు "మైకేల్" యుద్ధానంతరం జన్మించిన 2 సంవత్సరముల కుమార్తె "గాల్యా" యిదీ అతని కుటుంబము. వీ రయిదుగురుగాక వీరిలో అశక్తురాలయిన మేరియాతల్లి ఒకర్తె యుంటూ వున్నది.

సుమారు 700 జనాభా గల్గి 200 యిళ్లలో వున్న గ్రామంలోని ఒక యింటిలో వుంటున్నాడు "యివాన్". ఈ ఇండ్లనీ "రెడ్ అక్టోబర్" గ్రామం అనే కలెక్టివ్ ఫారం (దీనినే రష్యాలో "కోల్‌ఖోజ్" అంటారు) కు సంబంధించినవే.

"రెడ్ అక్టోబరు" గతించిన యాభైసంవత్సరములలోను ఏమీ మారలేదు. అందుకే ఆ గ్రామము యిప్పటివరకు విద్యుత్ దీపాలుకు నోచుకొనలేదు. ఆ గ్రామంలోకల్లా చెప్పదగ్గ విశేషం ఆ వూరు పుట్టేముందు కట్టబడిన క్లబ్ ఒకటి వున్నది. ఫారంయొక్క ఛైర్ మేన్ ఆఫీసుకొరకు, బుక్‌కీపర్ కొరకు, ఒక చిన్న యిల్లు వున్నది.

ఆ గ్రామంలోని యిండ్లన్నీ దూలములతో కట్టబడిన పూరిగుడిశెలే. చాలామటుకు పాతపడిపోయి పెద్ద మరమ్మతులు,రంగులు వేయవలసియున్నవి. కొన్నింటికి పూర్తిగా కాలమే తీరిపోయినది. వారికి తమ యిళ్లను పరిశుభ్రము చేసుకొనవలెననే ప్రయత్నమే యుండదు. పైగా జీవితావసర పదార్థముల కొరతవల్ల జీవించుట కష్టమే. యాభైఅడుగుల వెడల్పు గలిగిన రాజవీథియుండి ఆ రాజవీథి కిరుప్రక్కలను యిళ్లు కట్టబడి, రాజవీథి గోతులుపడిపోయి వర్షాకాలంలో శీతకాలంలోను బురదగానే యుండును.

యివాన్ యిల్లు

యివాన్, తనతండ్రి బ్రతికియున్నపుడు వుండే యింటిలోనే యుంటున్నాడు. తన భార్య కాపురానికి వచ్చిన తరువాత ఏవో కొన్ని అలంకారములు మాత్రం చేశాడు ఆ యింటికి. కాని చేయవలసిన పెద్ద మరమ్మతులన్ని అలానే యుండిపోయెను. ఆ గుడిశెకు వున్నదల్లా రెండే గదులు. యింతకూ యివాన్ చాల అదృష్టవంతు డన్నమాట. ఎందుచేతనంటే ఆ గ్రామంలో యుండే తనతోటి యొక్కువరైతు లందరకు ఒక్కొక్క గది గుడిశెలే వున్నవి. ఇవాన్, అతని భార్య మేరియా, చంటిపిల్ల కలిసి, పూర్వ మెపుడో తమ పెద్దలు తీయించుకొన్న ఫోటోలు, యుద్ధంలో చనిపోయిన తమ సోదరుల ఫోటోలు గోడకు తగిలించబడియున్న ముందుగదిలో పరుంటారు. పిల్లలు వంటయింట్లో స్టౌదగ్గరగా బల్లమీద పడుకుంటారు. మరోమూల మేరియా తల్లి పడుకొనును. ఒక్కొక్కపుడు బయట చలిగాలి యెక్కువగా యున్నయెడల పందుల్ని కూడ వంటింట్లో కట్టివుంచెదరు.

"రెడ్ అక్టోబర్"లోయున్న 200 కుటుంబాలకు కలసి సహకార సాగుక్రింద యుంచబడిన పొలం మొత్తం 2,700 యకరములు. అంటే ఒక్కొక్క కుటుంబానికి 13.5 యకరా లన్నమాట. శీతకాలపు రైప్, గోధుమ, వేసవికాలపు ఓట్సు, బార్లీ, బంగాళాదుంపలు, కూరగాయలు, పశుగ్రాసం వగైరా పంటలకు సాగుక్రింద వుంచబడిన పొలం 1400 యకరాలే. తక్కిన భూమి యంతయు పచ్చికబయళ్లు, రోడ్లు, యిళ్లు, వ్యవసాయదార్ల స్వంతవుపయోగానికి తోటలు క్రిందకు వచ్చును.

రెడ్ అక్టోబరు ఫారంలో పనిచేసే పదహారేళ్ల వయస్సు పైబడిన వ్యవసాయదార్లు యుద్ధానికి ముందు 430 మంది వుండేవారు. యుద్ధానంతరం 250 కు తగ్గిపోయి, యిప్పుడు కొంతమంది యుద్ధంలో చనిపోగా మిగిలిన క్షతగాత్రులు, మరికొందరు విడుదలచేయబడి యింటికి వచ్చిన వాళ్లతో కలిపి 300 మంది వున్నారు. చాలామంది బలిష్ఠులు, యువకులు యింకా సైన్యంలోనే యుంచబడిరి. ఈ 1400 యకరముల సాగుబడి నిమిత్తం యీ 300 మంది కాకుండా 12-16 సంవత్సరముల మధ్యవయస్సు వుండేవాళ్లు మరో 100 మంది కలసి మొత్తం 400 మంది జనం పనిచేస్తా రన్నమాట.

అమెరికాలోగాని, పశ్చిమయూరప్‌లోగాని యింత వైశాల్యం గల్గిన భూమిని సాగుచేయడానికి యింతమంది అవుసరం లేదు. కాని యీ కోల్‌ఖోజ్ పద్ధతిప్రకారం వీరు కాకుండా అధికారులు, బుక్‌కీపర్లు, స్టోరుకీపర్లు, నౌకర్లు, రాత్రింబవళ్లు దొంగలు ప్రవేశించకుండా కాపలానిమిత్తం వాచ్‌మేన్‌లు, ఆరోగ్యశాఖ వాళ్ళు కావాలి.

రెడ్ అక్టోబర్ యొక్క ఛైర్ మేన్ రూలు ప్రకారం సహకార సాగుబడిచేశే వ్యవసాయదార్ల సాధారణ మీటింగులో ఎన్నికఅవును. కాని సాధారణంగా లోకల్‌పార్టీమీటింగ్‌లో ఎన్నిక అవుతూ వుంటాడు. ఛైర్ మేన్ ఫారం ఆఫీసుమీద, ఫారంయొక్క ఎగ్‌నారమిస్టుమీద, ప్రతి ఆరు బ్రిగేడ్‌లమీద, స్టోరుకీపరు మీద అధికారం కల్గియుండును. ఫారం ఎగ్‌నారమిస్టు వేరే ముఖ్యమంది పనివాళ్లమీద, పశువులు, గొర్రెలమీద అధికారజాగ్రత తీసుకొనును.

పని

ఉన్న ఆరు బ్రిగేడులలోను నాల్గు బ్రిగేడు పంటపొలముల క్రిందను, తతిమా రెండు బ్రిగేడులు కాయగూరలు పండించుటకును వుపయోగించబడును. ఒక్కొక్క పంట బ్రిగేడ్‌లోను 35 నుంచి 40 మంది జనమున్ను, ప్రతి కూరగాయల బ్రిగేడ్‌కు 35 మంది మనుష్యులను కలిగియుండును. ఒక్కొక్క పంట పొలం బ్రిగేడ్ యున్న 40 యకరములు శీతకాలపు రై, 30 యకరములు శీతకాలపు గోధుమ, 6 యకరములు వేసవి గోధుమ, 20 యకరము వేసవిబార్లీ, 50 యకరములు ఓట్సు, 90 యకరములు బంగాళాదుంపలు, 10 యకరములు బంగాళాదుంపలు, 2 యకరములు బీటుదుంపలు పండించవలయును.

ప్రతీకూరగాయల బ్రిగేడ్ 45 యకరములు కలిగియుండి కొన్ని స్క్వాడ్‌లక్రింద భాగింపబడును. ఒక్కొక్క స్క్వాడ్‌కు 9 మంది కూలీలు వుందురు. ప్రతి బ్రిగేడ్‌యొక్క లీడరు తన బ్రిగేడ్‌ను కంట్రోలు చేస్తూ తన మెంబర్లు చేసిన పనిని రికార్డుచేయును.

యివాన్ ఒక స్క్వాడ్‌లీడరుక్రింద పంటపొలంలో పనిచేస్తూ వుండును. తనకుమారులిద్దరు స్టెఫెన్, మైకేల్‌లకు 16 సంవత్సరముల వయస్సుదాటకపోయినను స్కూలుకు వెళ్లనపుడల్లా రోజ స్తమానూ పనిచేసెదరు. 14 యేళ్ల స్టెఫెన్ ఒక కూరగాయల బ్రిగేడ్‌లోను, 12 యేళ్ల మైకేలు గొడ్లకాపుక్రింద పనిచేయును.

ఆడకూలీలు

మేరియాకూడ ఒక కూరగాయల బ్రిగేడ్‌లో పనిచేస్తూయుండును. తను పనికి పోకుండా యింటివద్ద వుండిపోదా మనుకుంటుంది కాని, అసలే చాలీచాలని సంపాదనలో తనవంతు సంపాదనకూడ నష్టపోవు టెందు కని, తన చిన్నపిల్లను నర్సింగ్ హోమ్‌లో దిగవిడచి తప్పనిసరిగా పనికివెళ్లును. చిన్నపిల్ల నర్సింగ్ హోమ్‌లో మరో వందమందిపిల్లలతో ఆడుకుంటూ యుండును. కాని ఒక్కటే లోటు, తల్లి పోషణ లేకపోవుట.

యుద్ధానికి ముందు సోవియట్ యూనియన్‌లో ఆడకూలీలు నూటికి 55 మంది మాత్రమే యున్నా యుద్ధం వచ్చిన తరువాత క్షతగాత్రుల లోటువలన, సైన్యంలో నిల్వ యుండిపోయిన యువకుల లోటువలన ఆడకూలీలను తగ్గించుటకు వీలులేక పోగా యింకా ఆడకూలీలసంఖ్య పెరిగినది.

ప్రతిరోజు యివాన్ కుటుంబం ఎవరు ఏ పొలంవెళ్లి ఏపనిచేయవలెనో ఆదేశించబడుతూ యుంటారు. చాలినంత మెషినరీయే కాకుండా, పోనీ చాలినన్ని పశువులు లేకపోయిననూ వాళ్లకు నియమించబడిన పనిని ఆ రోజున పూర్తి చేయవలెను.

యం. టి. యస్. అనే లోకల్ మెషీన్ ట్రాక్టరుస్టేషన్ ఒకటి చాలా సంవత్సరముల క్రితమే మరనాగళ్లు, ట్రాక్టర్లు,విత్తులు చల్లే మిషనులు "రెడ్ అక్టోబర్"కే కాకుండా మరి నాలుగితరఫారంలకుగూడా సప్లయిచేసే నిమిత్తం వుంచబడినది. యుద్ధానికిముందు నూటికి అరవైవంతులపని యీ యం. టి. యస్. ద్వారానే జరుగుతూ మిగతా 40 వంతులపని మనుష్యుల ద్వారా జరుగుతూ యుండేది. కాని యుద్ధకాలంలో యం. టి. యస్. ట్రాక్టర్లు, గుర్రాలు ఆర్ ఆర్మీయొక్క మిలిటరీలోనికి రిక్విషన్ చేయబడుటవల్ల అది చేసే పని చాల తక్కువ.

యంత్రసామాన్లు యింత తక్కువగా సప్లయి చేయబడుచున్ననూ యిదివరకు యెంత పని చేశెడివారలో అంతపని చేసితీరవలసినదే. వ్యవసాయానికి కావలసిన పనిముట్లు చాల తక్కువని యివాన్‌కు తెలుసును. కాని గవర్నమెంటు నిర్ణయించిన మేరకు పండించి తీరవలసినదే. వాళ్ల అదృష్టం బాగాయుండి శీతోష్ణపరిస్థితులు అనుకూలంగా యున్నయెడల పంటలు బాగా పండి గవర్నమెంటు కోర్కెలు చెల్లించవచ్చును. అయినా చేను బలానికి వుపయోగించబడే యెరువల్లా వాళ్లకువున్న కొద్దిపశువుల పెంట మాత్రమే. ఇది చాలీచాలని యెరువు.

కూలీలకు హెచ్చరిక

ప్రతిసాధారణ మీటింగ్‌లోనూ ఛైర్ మేన్, స్టాలిన్‌యొక్క, రెడ్ ఆర్మీయొక్క గొప్పతనం గూర్చి చెపుతూ తమయొక్క ఫాదర్‌లాండ్ నిమిత్తం అధికపంటలు పండించమని వుద్ఘాటించును.

రెడ్ అక్టోబర్ ఫారం గవర్నమెంటు ప్లాను ప్రకారం పనిచేయును. ఏయే పంటలు వేయవలెనో, స్వంతవుపయోగమునకు యెంత పంట మిగుల్చుకొనవలెనో,విత్తనాలనిధికి ఎంత చెల్లించవలయునో, వినియోగదార్ల సహకారసంఘాలకు విత్తనాలు సప్లయిచేసినందుకు గవర్నమెంటుకు, యిన్సూరెన్సుఫండుకు, బకాయిలకు ఎంత చెల్లించవలెనో గవర్నమెంటు ఆదేశించును. మిగిలిన కొద్దిపంట యుద్ధకాలంలో రైతు యెంత వస్తు ధనరూపంగా సంపాదించెనో దానినిబట్టి లెఖ్ఖకట్టి పంచెదరు.

డబ్బు సంపాదన

తనకు మిగిలిన సరుకులు గవర్నమెంటుకుగాని, బజారులోగాని అమ్మకొని సంపాదించిన సొమ్ములో గవర్నమెంటు పన్నులకు, లెవీలకు, ఫారంయొక్క ఖర్చులకు, యుద్ధంలో బాధపడిన ప్రదేశములవారి "ధర్మనిధి"కి మరి యితర ఖర్చులకు చెల్లించవలసియుండును. మిగిలిన ఆ యెందుకూ చాలని రాబడే కోల్‌ఖజ్ నుండి వచ్చే రాబడి.

ప్రతీసంవత్సరము యివాన్ డబ్బు రూపంగాను, వస్తురూపంగాను సంపాదించునది చాలదు. తను డబ్బురూపంగా సంపాదించుదానికన్న, వస్తురూపంగా సంపాదించునది తన ఫారంలో బంగాళాదుంపలు, కాయధాన్యములు పండుచుండుటవలన యెక్కువగా యుండును.

సోవియట్ యూనియన్‌లో బాగా పండునట్టి సహకార సాగు చేసే ఫారంలలోగూడ క్రిందటి సంవత్సరం, యీ సంవత్సరం ఒకేవిధమైన పంట పండినను రైతు అనుభవించునది క్రిందటి సంవత్సరంకన్న యీ సంవత్సరం తక్కువగా యుండును.

కలెక్టివ్ ఫారంనుంచి రైతుకు డబ్బురూపంగాను వస్తురూపంగాను వచ్చే రాబడి తను పనిచేసిన రోజులనుబట్టి వస్తూయుండును.

యివాన్ సంపాదన

యివాన్ అతని భార్యా కలసి క్రితం సంవత్సరం 400 రోజులు, పిల్లలిద్దరు 100 రోజులు పనిచేస్తే యివాన్ కుటుంబంయొక్క మొత్తం పనిరోజులు 500. రెడ్ అక్టోబర్‌లో రోజు కూలి పని యీవిధంగా యుండును: 3 రూబులు, $4\frac{4}{10}$ పౌనులు కాయధాన్యములు, 5 పౌనులు కూరగాయలు, 5 పౌనులు బంగాళాదుంపలు, 4 పౌనులు గడ్డి. చాలా ఫారంలలో కూలి యింతకన్న తక్కువగా యుండును.

ఈవిధంగా యిచ్చే కూలినిబట్టి యివాన్ కుటుంబం నిరుటి సంవత్సరం 1500 రూబులు, 2,500 పౌనులు కాయగూరలు 2,200 పౌనులు కాయధాన్యాలు, 2,500 పౌనులు బంగాళాదుంపలు, 2000 పౌనులు గడ్డి సంపాదించినది. సంవత్సరం లోపల కొంత సొమ్ము అడ్వాన్సుగా యిచ్చిననూ యీ డబ్బంతా సంవత్సరాంతమున యిచ్చెదరు.

కలెక్టివ్ ఫారంయొక్క నిబంధనల ప్రకారం బంగాళాదుంపలు, కాయధాన్యాలు, ముందుగా యివ్వవలసి వచ్చినయెడల రైతు గవర్నమెంటుకు చెల్లించిన సరుకులో నూటికి 10 లగాయతు 15 భాగములకన్న యెక్కువ యివ్వరు. బహుశః యీ పద్ధతి గవర్నమెంటు నిర్బంధంగా వసూలుచేశే కోటాలు త్వరగా వసూలు అగుటకు పెట్టుబడిపెట్టియుండి వుంటారు.

సరిపోని రొట్టె

రష్యనులు సాధారణంగా నల్ల రొట్టె తింటారు. ఒక్కొక్క రష్యన్ రైతు సంవత్సరానికి 450 పౌనులు కాయధాన్యాలు మాత్రమే సంపాదించును. ముగ్గురు పెద్దలు, యిద్దరు కుర్రవాళ్లు వున్న కుటుంబంయొక్క కాయధాన్యములవాడుక సంవత్సరమునకు 2800 పౌనులు అని తెలుపబడినది. కాని యివాన్ కుటుంబం సంపాదించునది 2200 పౌనులు మాత్రమే. అందు

(22 వ పేజీ చూడుడు

మన రాష్ట్రం మన దేశం

కామన్వెల్తు సభ్యత్వానికి రాజ్యాంగ పరిషత్సభ, ఏ. ఐ. సి. సి. ల ఆమోదం

కామన్వెల్తు దేశకూటమిలో భారతదేశ సభ్యత్వానికి రాజ్యాంగ పరిషత్సభ, ఆలిండియా కాంగ్రెస్‌కమిటీలు ఆమోదించాయి. ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో అనుకున్నంత తీవ్ర విమర్శలు రాలేదు; రాజ్యాంగపరిషత్సభలో కూడా సరీగా విమర్శించినవారే లేకపోయారు.

రాజ్యాంగపరిషత్సభలో పండిట్ నెహ్రూ ప్రతిపాదించిన తీర్మానానికి రెండే సవరణలు ప్రతిపాదింపబడినాయి. ఏప్రిల్ 27 వ తేదీని లండన్‌లో కామన్వెల్తు ప్రధానుల ప్రకటన ప్రకారం కామన్వెల్తులో భారతదేశం సభ్యత్వానికి ఆమోదించాలని కోరుతూ పండిట్ నెహ్రూ తీర్మానం ప్రతిపాదించారు. కామన్వెల్తు దేశాలు జాతివిద్వేషంతో ప్రవర్తించని పక్షంలో మాత్రమే భారతదేశం కామన్వెల్తు సభ్యత్వాని కంగీకరించాలని ఒక షరతు పెడుతూ శ్రీలక్ష్మీనారాయణ సాహూ ఒక సవరణ ప్రతిపాదించారు. స్వతంత్రభారతదేశాన్ని కామన్వెల్తునుంచి విడగొట్టగలరని కాంగ్రెస్ ఎన్నికలముందు నివేదికలో ప్రకటించి ఇప్పుడీ రీతిగా భారతదేశాన్ని కామన్వెల్తుతో బంధించడానికి ప్రస్తుత ప్రభుత్వానికి గాని, రాజ్యాంగపరిషత్తుకుగాని హక్కు లేదనీ, కొత్త రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నికలు జరిపి కొత్త పార్లమెంటును ఎన్నుకున్న తరవాత ఆపార్లమెంటుకే ఈవిషయాన్ని నిర్ణయించగల అధికారం కలదు కాబట్టి, అంతవరకూ ఈనిర్ణయాన్ని అమలుజరపరాదనీ సూచిస్తూ పండిట్ శివన్లాల్ శాక్జెనా ఒక సవరణ ప్రతిపాదించాడు.

దీనిపై రెండురోజుల చర్చ జరిగింది. కామన్వెల్తు సభ్యత్వంవల్ల భారతదేశ స్వతంత్ర ప్రతిపత్తి కేట్టి భంగం కలుగదనీ, కొన్ని ప్రయోజనా లున్నందువల్ల సభ్యత్వం అంగీకరించడమే లనీ పండిట్ నెహ్రూ చెప్పారు. కామన్వెల్తులో భారతదేశ సభ్యత్వం, భారతదేశానికీ, కామన్వెల్తు రాజ్యకూటమికేగాక, ప్రపంచానికే మే లన్నారు. దీన్నే మరోరీతిగా వివరిస్తూ, ఈ ఏర్పాటు లేకపోయినట్లయితే ప్రపంచ శాంతిసాధనకృషికి భంగం కలుగు తుందన్నారు. కామన్వెల్తునుంచి విడిపోయినట్లయితే ఈ విశాల ప్రపంచంలో భారతదేశం ఏకాకియై నిస్సహాయంగా ఉండిపోవలసి వస్తుం దన్నారు.

అంటే కామన్వెల్తు దేశాలతోనే తప్ప భారతదేశానికి ఇతర దేశాలతో మైత్రి అసంభవమనే అర్థంకూడా స్ఫురిస్తున్నది. కామన్వెల్తులో చేరకపోవడంవల్ల ప్రపంచశాంతిసాధనకృషికి భంగం కలుగుతుందంటే – రాజ్యకూటాలే ప్రపంచంలో శాంతిని కాపాడగలవనే అర్థం స్ఫురిస్తున్నది. అంటే అట్లాంటిక్ రాజ్యకూటం వంటివే శాంతిని కాపాడ్డానికి సాధనాలని ఆంగ్లో అమెరికన్ దేశాల ప్రచారంతో పండిట్ నెహ్రూ ఏకీభవిస్తున్నారన్న మాట. పండిట్ శాక్జెనా తన ఉపన్యాసంలో భారతదేశం ప్రపంచంలో శాంతిని కాపాడ్డానికి కృషి చెయ్యదలిస్తే కామన్వెల్తులో సభ్యత్వంవల్ల సాధించలేదనీ, కామన్వెల్తునుంచి విడిపోయినప్పుడే కృషి చెయ్యడానికి వీలవుతుందనీ చెప్పారు. రెండు శత్రుపక్షాల్లో ఒక పక్షాన చేరి, రెండు పక్షాల మధ్యనూ సఖ్యం కుదురుస్తానంటే అది ఎలా సాధ్యమౌతుందన్నారు. అదిగాక ఉభయపక్షాల్లోనూ చేరగలిగినట్లయితే సఖ్యం కుదర్చడానికి వీలుపడుతుంది.

పండిట్ నెహ్రూ చర్చకు సమాధాన మిస్తూ కామన్వెల్తులో భారతదేశ సభ్యత్వం "స్నేహబంధం" తప్ప అధిక మేమీ లేదని చెప్పారు.

గత అక్టోబర్‌లో కామన్వెల్తు ప్రధానుల సమావేశంలో బ్రిటిష్ ప్రధాని అట్లీ బ్రసెల్స్ సంధినిగురించి తెలిపినట్లు ప్రకటించారు. ఇది భారతదేశాన్ని యూరోపియన్ రాజ్యకూటాల్తో ముడిపెట్టడానికి ప్రయత్నించడంకాదా అని హెచ్. వి. కామత్ ప్రశ్నించారు.

అటువంటి దేమీ లేదని పండిట్ నెహ్రూ అన్నారు. కాని పండిట్ నెహ్రూవాదంలో పైన చెప్పిన రెండు అంశాలూ గమనిస్తే, ఇప్పుడటువంటిదేమీ లేకపోయినా, ఇతర త్రా ప్రమాదం రాగలదనే భీతితో, ముమ్మందు అటువంటి రాజ్యకూటానుబంధాలు తెచ్చుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తోచకమానదు. ప్రమాదమనే భీతి సూచన పండిట్ నెహ్రూ వాదంలో గుప్తంగా చెప్పక చెప్తోంది. ఆంగ్లో అమెరికన్ రాజ్యాలతో మైత్రి చెయ్యకపోతే భారతదేశాన్ని ఇతర రాజ్యాలు దగ్గర చేరనివ్వవనే భయం స్పష్ట మవుతోంది. ప్రపంచంలో ఏర్పడిన ఇరుపక్షాలలో ఒక పక్షాన్ని విశ్వసించి ఒక పక్షాన్ని సందేహించడం స్పష్టంగా కనపడుతోంది. భారతప్రభుత్వంపట్ల రష్యా తీవ్ర విమర్శలు, అకారణవిరోధం, భారత కమ్యూనిస్టుపార్టీ కార్యకలాపాలు, తూర్పుఆసియాలో కమ్యూనిస్టుల విజయాలు ఈ భయానికి కారణాలు కావచ్చును. అయితే ఇటువంటి భయమే ఉంటే అది స్పష్టంగా చెప్పి, ప్రజలకి వాస్తవ పరిస్థితిని నివేదించవలసిన అవసరం ఉంది.

పోతే పండిట్ నెహ్రూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఉపన్యాసంలో మరొక్క అంశం ఉంది. రాజ్యాంగ పరిషత్సభలో చర్చకు సమాధాన మిస్తూ, కామన్వెల్తులో భారతదేశ సభ్యత్వంవల్ల "భారతదేశ స్వాతంత్ర్యం సుస్థిరపడుతుంది. ప్రపంచంలో శాంతివాంఛాపరుల బలం వృద్ధి అవుతుంది. ప్రపంచశాంతికి వచ్చే నాలుగైదు సంవత్సరాలు అతి క్లిష్టమైనవి. ఈ కాలంలో మనం త్వరపడి మన ఆర్థిక బలం పెంపొందించుకోక పోతే, ప్రపంచ రాజకీయాల్లో మన మాట వినేవారుండరు. మన ఆర్థిక ప్రాబల్య వృద్ధికి లండన్ నిర్ణయం అవకాశ మిస్తుంది. ఈ నిర్ణయం వల్ల ఆర్థికాభివృద్ధి సిద్ధిస్తుందే కాని మన జాతీయ ప్రతిష్ఠకు భంగం కలుగదు" అన్నారు.

ఇదిగాక 200 సంవత్సరాలుగా బ్రిటన్‌తో భారతదేశానికి ఏర్పడిన ఆర్థికబాంధవ్యం ఒక్క వేటున త్రెంచడానికి వీలుపడదు. అది మంచిది కూడా కాదని పండిట్ నెహ్రూ చెప్పారు. భారత దేశానికి బ్రిటన్ చెల్లించవలసిన స్టెర్లింగు బాకీలను గురించి ముఖ్యంగా ఈ మాట చెప్పవచ్చును. అయితే ఈ బాకీలు యుద్ధ కాలంలో వచ్చినవే కాని ముందు లేవు. పోతే ఆర్థికంగా బ్రిటన్ భారతదేశాభివృద్ధి కెంతవరకూ సహాయపడుతుందో తెలియదు. ఈవిషయమై రాజ్యాంగ పరిషత్సభలో కాని, ఆలిండియా కాంగ్రెస్ కమిటీలోగాని చర్చింపబడలేదు. ఇంక హైదరాబాద్, కాశ్మీర్ సమస్యల విషయంలో ఐక్యరాజ్య సమితిలో బ్రిటన్ భారత దేశానికి అపకారం చేసింది. రష్యా సహాయ పడలేదు. పారిశ్రామిక వ్యాపారాది విషయాలలో బ్రిటన్ పాకిస్తాన్‌పట్ల పక్షపాతం చూపుతున్న విషయం అందరికీ తెలిసిందే. భారతదేశం కామన్వెల్తులో సభ్యత్వాని కంగీకరిస్తే బ్రిటన్‌వైఖరి మారుతుందా? బ్రిటన్ వల్ల మనకి ఆర్థికంగా గాని పారిశ్రామికాభివృద్ధికిగాని మనకి ప్రయోజనం కలిగేది పెట్టుబడి, నిపుణుల సహాయం మాత్రమే.

బ్రిటన్‌లో కార్మిక ప్రభుత్వం భారీపరిశ్రమల్ని జాతీయం చెయ్యడం ఆరంభించిన తరవాత మిలియన్ల పౌనుల పెట్టుబడిధనం బ్రిటన్‌నుంచి తరలించబడింది. అదంతా ఇప్పుడు అరబ్ దేశాలలోనూ మలయాలోనూ, పాకిస్తాన్‌లోనూ చేరుతోంది. భారతదేశానికి 1947 ఆగస్టు 15 తరువాత బ్రిటన్‌నుంచి కొత్తగా వచ్చిన పెట్టుబడి ఏమీ లేదు. వ్యాపారంవిషయంలో బారతదేశాన్ని మోసపుచ్చడానికి యత్నిస్తోంది కూడా. ఇవన్నీ చూస్తే బ్రిటన్ వైఖరి ఎప్పుడో మారకపోదనే ఆశ ఒక్కటే మిగుల్తుంది. అదే భారతదేశం కామన్వెల్తుసభ్యత్వానికి అంగీకరింప చేస్తోంది.

రాజ్యాంగపరిషత్సభలో సాహూ, శాక్జెనాల సవరణలను ప్రతిపాదించ నియ్యరాదని పండిట్ నెహ్రూ పరిషదధ్యక్షుని కోరారు. కాని అధ్యక్షులు డా॥ రాజేంద్ర ప్రసాద్ అందుకు నిరాకరించారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీలోకూడా ఆరుగురు తప్ప మిగతా అందరూ అనుకూలంగానే ఉన్నారు. చర్చ అనుకున్నంత తీవ్రంగా జరగలేదు.

ఏ. ఐ. సి. సి. రహస్య సమావేశం:

కాంగ్రెస్ ప్రభుత్వాల్ని, కాంగ్రెస్ సంఘాల్ని విమర్శించడానికి, ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి అనేక తీర్మానాలు వచ్చాయి. వీని నన్నిటినీ విడివిడిగా చర్చించే బదులు, కాంగ్రెస్ మంత్రివర్గాలు, కాంగ్రెస్ సంఘాల కార్యకలాపాల్ని గురించి సమగ్రమైన చర్చ జరపడం మంచి దని తలిచి ఒకరోజు రహస్య సమావేశం జరిపారు. సమావేశం ఆదివారం నాడు 5 గంటలసేపు జరిగింది. సమావేశానికి పత్రికా విలేఖరుల్ని రానివ్వలేదు. అయినా అక్కడ ఎవరేం మాట్లాడారో విపులమైన వార్తలు ప్రచురించబడ్డాయి. అదిగాక కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారు చర్చ ధోరణి వినిపించారు. చర్చలో ఆచార్య కృపలానీ మంత్రివర్గాల కార్యకలాపాల్ని తీవ్రంగా విమర్శించారట. మంత్రివర్గానికి రాష్ట్రపరిపాలన, కాంగ్రెస్ సంఘాలకి నిర్మాణకార్యక్రమం ఒప్పగించారనీ, సంఘాలు బొత్తిగా ఈ కార్యక్రమాన్ని మరిచిపోయినా యనీ డా॥ రాజేంద్ర ప్రసాద్ అన్నారట. కాంగ్రెస్ సంఘాలు నిర్మాణకార్యక్రమం అమలు జరపడానికి కృషి చేస్తేగాని కాంగ్రెస్ ప్రతిష్ఠ తిరిగి కోలుకోదన్నారట. మంత్రివర్గాలు కూడా కాంగ్రెస్ సంఘాల అభిప్రాయాల్ని మన్నించాలనీ ఉభయవర్గాల మధ్యనూ సామరస్యం ఉండాలనీ అన్నారట. ఆచార్య కృపలానీ ప్రభుత్వంలో అవినీతి లంచగొండితనం పెచ్చు పెరిగిపోయాయని తీవ్రంగా విమర్శించారు. పండిట్ నెహ్రూ మంత్రివర్గాలపై విమర్శలకు సమాధానా లిచ్చారట. కాంగ్రెస్ సంఘాలు నిర్మాణకార్యక్రమాల్ని అమలు జపరడానికి యత్నించకపోవడంవల్లనే దేశంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ పోతున్నదని చెప్పారట. మంత్రివర్గాలపై ఆరోపణల్ని విచారించడానికి అగ్రనాయకుల సంఘం ఒకటి నియమించాలని కొందరు సభ్యులు సూచించారు.

చర్చ వివరాల్ని మంత్రివర్గాలకీ, కాంగ్రెస్ కార్యవర్గానికీ తెలిపి తగు చర్య తీసుకోగలరని డా॥ పట్టాభిగారు చర్చ అనంతరం చెప్పారట.

ఈ సమావేశంలో సభ్యులు దాపరికం లేకుండా కడుపులో ఉన్నదంతా వెళ్లగక్కారని డెహరాడూన్‌లో పత్రికా విలేఖరులకు సభ్యులే చెప్పారట. అయితే పరస్పరనిందారోపణలుతప్ప ఈ చర్చలో సమస్యాపరిష్కారానికి ఎవరూ సరైన సూచన లిచ్చినట్లు కనిపించదు. హితమైనవిమర్శ కాదనవచ్చును.

రాష్ట్రకాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మాదిరిగానే ఈ చర్చలోకూడా ఆచరణయోగ్యమైన సూచన లేవీ రాలేదు. దీనికి కారణం ఎవరి పంథా వారిదే కావటం. కాంగ్రెస్ సంఘాలు ఏమికార్యం చేస్తున్నాయో తెలియదు. పరిపాలనా విధానాల్ని విమర్శించడంతో వారి పని సరిపోతోంది. మంత్రులుకూడా గాంధీజీ నిర్మాణకార్యక్రమాన్ని పూర్తిగా మరిచిపోయారు. పండిట్ నెహ్రూ 1947 లో నిర్వచించిన సహకార ఆర్థిక వ్యవస్థ నిర్వచనంతోనే మరుగుగాక పడిపోయింది. అప్పుడెవ్వరికీ జ్ఞప్తికి రానట్లు గోచరిస్తుంది. సహకారోద్యమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడంలేదు. ఆర్థిక సమస్య పరిష్కారానికంటె మంత్రివర్గాలకు ఇతరకార్యక్రమాలు ముఖ్య మైనాయి.

దీని కంతకీ కారణం మంత్రులు, కాంగ్రెస్ సంఘ కార్యకర్తలూ కూడా గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని మరిచిపోవడమే నని డా॥ రాజేంద్రప్రసాద్ అన్నారు. కాంగ్రెస్‌కు దేశంలో ఇంత పలుకుబడి ఇదివరలో దేనివల్ల వచ్చిందో వారు మర్చిపోయారు. కాంగ్రెస్ వాదుల విశుద్ధవర్తన, చిత్తశుద్ధి, ధర్మనిరతి కాంగ్రెస్‌సంస్థకి భారత దేశంలో ఇంత ప్రతిష్ఠ, గౌరవం తెచ్చిపెట్టాయి. ఈనాడు కాంగ్రెస్ వాదులలో ఇవే బొత్తిగా లోపించాయి. పూర్వపరిపాలకులపట్ల ప్రజల్లో ఎంత హేయం, భయం, ద్వేషం కలిగాయో ఈనాడు కాంగ్రెస్‌పట్ల కూడా ప్రజలకు అంత విముఖత ఏర్పడింది. వేరేపార్టీ లేక వారింకా కాంగ్రెస్‌నే అంటిపెట్టుకున్నారు. కాంగ్రెస్‌సంస్థ ఉత్తమాదర్శాలు ఎప్పటికైనా నాయకుల్లో హృదయ పరివర్తన తేలేవా అని పరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు పోగొట్టుకున్న ప్రతిష్ఠను తిరిగి కోలుకోవాలంటే, డా॥ పట్టాభిగారు చెప్పినట్లు, కాంగ్రెస్ పవిత్రాదర్శాల తిరిగి అనుసరించాలి. లేదా కాంగ్రెస్ మనదేశంలో నశించక తప్పదు. నాయకులు ఎవరికి వారు కాంగ్రెస్ పేరుతో ప్రచారం చేసుకుంటూ స్వార్థాశయాల్ని అనుసరిస్తున్నారంటే, ప్రజలు వారిని ఒక్కసారి మాత్రమే విశ్వసించగలరు. తరువాత ప్రజలకన్ను గప్పటం వారి తరం కాదు.

రాజ్యాంగ పరిషత్సమావేశం:

భారతరాజ్యాంగ పరిషత్సమావేశం తిరిగి 16 వ తేదీ సోమవారంనాడు ఆరంభమయింది. మొదటి రెండురోజులూ కామన్వెల్తు సభ్యత్వం గురించి చర్చించి లండన్ నిర్ణయాన్ని ఆమోదించింది. తరువాత 68 వ క్లాజు వద్దనుంచి రాజ్యాంగ నిర్మాణ పత్రాన్ని చర్చించ నారంభించింది.

ప్రజాపరిషత్తు అయిదేసి దీని సంవత్సరాలకొకసారి ఎన్నుకోబడాలనీ, స్టేట్ కౌన్సిల్ ప్రతిరెండేళ్లకీ మూడోవంతు సభ్యులకు ఎన్నికలు జరగాలనీ 68 వ క్లాజులో చెప్పబడింది.

ఖులాసా కబుర్లు :

"ఎప్పుట్టలో ఏపామో!"

శ్రీ జి. యస్. సూరి

ఈమధ్య పత్రికలలో ఒక వింత వార్త వెలువడింది. కాశీకి తూర్పున ఒక నగరంలో ఎక్కడ చూచినా పాములు చచ్చిపడి ఉన్నవట. కాకి ముక్కులో పాము, గద్ద గోళ్లలో పాము, రాబందు మెడలో పాము, అంతటా పాములే. తాచులు, జెర్రులు, కట్లపాములు, రక్తపెంజెర్లు, మిన్నాగులు, నూనె పురుగులు, రెంకతలల శిఖండులు, కొండచిలువలు, ఒకటేమిటి ఆ ప్రాంతంలో ఉన్న అన్నిరకాల పాములూ, చిన్నవని పెద్దవని వివక్ష లేకుండా కాలధర్మం పొందినవట. పాములవాళ్లు పెంచుకున్న నాగరాజులు కూడ ఈ తెగులుకు గురి అయినవో లేవో వివరంగా తెలియదుగాని వానపాములు మినహా తక్కిన వన్నీ పరలోకయాత్రకు బయలు దేరినవని మాత్రం తాటికాయంత అక్షరాలలో తెలియచేశారు.

కలరా, ప్లేగు మొదలైన గత్తర్లు ఇందుకు కారణం అయిఉండదు. అవి అసలు విష జంతువులే కాబట్టి విష జ్వరం వచ్చి ఉండడానికి వీలులేదు. వాటిది ఉష్ణం లేని రక్తం కాబట్టి రక్తం పోటుగాని పక్షవాతంగాని మారకం చేసి ఉండదు. అసలే మెదడులేని భూచరాలు గాబట్టి అపస్మారక వ్యాధి సంభవించి ఉండదు. ఏ రోగం వచ్చిన కొంతకాలం తీసుకోటం జరుగుతుంది కాబట్టి ఆకస్మికంగా అడ్డమయిన వాటికీ కాలం ముసించుకుని వచ్చినందువల్ల వీటి చావుకు ఏ రోగం కారణం గాదని చెప్పవచ్చు. ఒక వేళ, కొత్త జాడ్యం అవతరిస్తే ఈ పాటికి జంతుశాస్త్రజ్ఞులు పత్రికలు నింపేవాళ్లే గనుక నిస్సందేహంగా వ్యాధిసంగతి వదులుకోవచ్చు.

అయితే హఠాత్తుగా నిండు ప్రాణి నీలిగిందీ అంటే ఏదో కారణం ఉండి తీరాలి. మన వైద్య శేఖరులు అకారణంగా ఎవరినీ చావనివ్వరు. ఒక వేళ బ్రతికి ఉండగా వ్యాధిని నిర్ణయించ లేకపోతే పోస్టుమార్టెం పరీక్ష చేసి అయినా కారణం కనిపెట్టి తీరుతారు. అలాంటి వాళ్లు నిస్సహాయులైతే కాళ్లు పారజాపి నప్పుడు సహజకారణాలను వదలిపెట్టి అతీత కారణాలను వెదకకతప్పదు. అయితే వీటి కోసం ఎక్కడకో పోనవసరం లేదు. నత్తగుల్లల మొదలు నవరత్నాల వరకూ మహాసముద్రంలో దొరికినట్లు మన పురాణాలలో దొరకని విషయం లేదు. నేను చెప్పన మునుపే మీ మనసుకు పసీమని తట్టి ఉంటుంది జనమేజయుడి సర్పయాగం.

జనమేజయుడు అసాధ్యుడు. అంత పట్టుదల మరొక పురాణవ్యక్తికి ఉన్నట్లు కనబడదు. దోవలో రాయి కాలికి కొట్టుకుంటే రాజ్యంలో ఉన్న రాళ్లన్నింటిని చదును చేయించే బాపతు వాడు. తన తండ్రి పరీక్షిత్ సర్పగండం ఉన్నదని ఆకాలపు జ్యోతిష్కులవల్ల ఎరిగి, అన్నివిధాల కాపరం బందోబస్తుకు ఆజ్ఞ జారి చేశాడు. నీళ్లమధ్య భవనం నిర్మించి పెట్టాడు. మన గవర్నరు జనరలు గారు సంచారానికి బయలుదేరినపుడు ఆయన దగ్గరకు వచ్చి పోయేవారిని ఎంత జాగ్రతతో కనిపెట్టి ఉంటారో అంత కంటె అధికమైన జాగ్రతతో రాకపోకలను పరిశీలించారు. కష్టమ్సు ఉద్యోగులను మించిపోయేట్లు అతి సూక్ష్మంగా ప్రతివస్తువునూ వెతికి చూచారు. కాలం ఆసన్నమయేప్పటికి పండులో ఉన్న పురుగు ప్రాణాలు తీసింది. జనమేజయుడికి రాజు అయినందుకు ఒక వైపు సంతోషంగా ఉన్నా మరోవైపు తండ్రి ప్రాణాలు తీసినందుకు మండిపడ్డాడు. పాములు పగపట్టుత వంటారు. అటువంటివాటిమీద పగపట్టాడు ఈ మహారాజు. రాజ్యంలో ఉన్న శాస్త్రుల్లవార్లందరనీ పిలిపించాడు. పాములను నిర్మూలించే మార్గం చెప్పమన్నాడు. పండితులు ధర్మశాస్త్రాలన్నీ తిరగవేసి సర్పయాగం చెయ్యమన్నారు. యథావిధిగా చేయించారు. ఒక్కొక్క మంత్రానికి ఒక్కొక్క పాము గిరగిర తిరుగుతూ అగ్నిగుండంలో పడిపోయింది. ఆ యజ్ఞం మరికొన్ని రోజులు జరిగి ఉంటే లోకంలో పాములే ఉండేవి కావు. కాని పాముల వాళ్లకు జీవనం పోతుం దని కాబోలు ఇంద్రుడు వగైరాల దేవతలంతా అర్జీపెట్టి అడ్డు పడ్డారు. శత్రునాశనం సమూలంగా జరగకుండా పోయింది.

ఇప్పుడు సంయుక్తరాష్ట్రంలో గూడ ఇటువంటి క్రతువు ఏదో జరిగి ఉంటుంది. వేదకాలం నుంచి ఈ నాటివరకు కాశీ అంటె శాస్త్రాలకూ మంత్రాలకు ఉనికిపట్టు. నీళ్ల మీద నడిచేవాళ్లు అగ్నిలో మారేవాళ్లు, గాలిలో ఎగిరేవాళ్లు, ఇక్కడ మాయమై అక్కడ ప్రత్యక్షమయ్యే వాళ్లు ఎందరో ఉన్నచోటు కాశి. మంత్ర శాస్త్రం అభ్యసించిన బుడత శాస్త్రుల్లు ఒకడు తాను చదివినదానిని తనిఖీ చూద్దామని పాములమీద ప్రయోగించి ఉంటాడు. కర్కోటకుడు కాకపోవటాన ఫలానా ఊరిలో ఉండే సకలవిధసర్పములు మాత్రమే హతమగు గాక అని హ్రూం హ్రీం భాషలో అని ఉంటాడు. వెంటనే డిక్రీ అమలు జరిగింది. ఆటంబాంబు పేలినట్లయింది. మరి ఊరికే పోతుందా మంత్ర శక్తి!

పాశ్చాత్యవిద్యా విధానంవల్లనైతేనేమి, మార్క్సువగైరాల గ్రంథపఠనం వల్లనైతేనేమి, కాఫీసిగరెట్లాది అశాస్త్రీయమైన అలవాట్లనైతేనేమి ఈలాంటి తతంగాలమీద మనకు నమ్మకం పోయింది. మంత్రాలకు మామిడి కాయలు రాలుతాయా అనే భావంఅవతరించింది. అయినా బజారుకు ఒక తేలు మంత్రగాడు ఇప్పటికీ ఉంటూనే ఉన్నాడు. టెలిగ్రాముల ద్వారా, టెలిఫోన్ల ద్వారా పాముల నరసయ్యలు చావబోతున్న వాడిని బ్రతికించినట్లు వింటూనే ఉన్నాము. ఈ రోజువరకూ ముసలమ్మలు కామెర్లకు, పసికర్లకు, బెణుకులకు ఝూఝా అని మంత్రాలు పెడుతూనే ఉన్నారు. బాధ నివారనా అయినట్లు జనసామాన్యం నవ్వుతూ పోతూనే ఉన్నారు. ఇన్ని చూసినా మాలాంటి వాండ్లకు పూర్తి నమ్మకం ఎందుచేతనోగాని ఇంకా కలగకుండా ఉన్నది. అది మీ ప్రారబ్ధం అంటారేమో శాస్త్రుల్లవార్లు.

కొన్ని ఏళ్ల క్రింద మావూళ్లో కలరాదేవత వీరవిహారం చేసింది. సాయంత్రం కబుర్లు చెప్పిన స్నేహితుడు మరునాటికి మాయం అయేవాడు. జనమంతా ఖంగారుపడిపోయింది. క్రమంగా ఒక పుకారు బయలుదేరింది. పాత ఊరిలో కంసాలి ఒకడు చేతబడి చేస్తున్నాడనీ, వాడే ఈ గత్తరను ఊరిమీద ప్రయోగించాడనీ చెప్పకోటం మొదలుపెట్టారు. వాడి దురదృష్టవశాత్తూ ఒకనాటి సాయంత్రం జిల్లేడాకుల కోసమని వాడు స్మశానం దగ్గరకు వెళ్లాడు. వేగుల వాళ్ల మాదిరి కొందరు పురవాసులు వీడి ఆచూకీ కనిపెడుతూనే ఉన్నారు. స్మశానంలో వెతుకుతుండగా వీడిని చూశారు. చేతబడికి కాకపోతే ఇటువంటప్పుడు ఇక్కడ ఎందుకు ఉంటాడని నిశ్చయించుకున్నారు. పిట్ట చిక్కిందిరా అని ఒకరి వీపు మరొకరు చరుచుకున్నారు. నాల్గువైపులనుంచీ ఆ అమాయకుణ్ణి కమ్ముకున్నారు. చేతులూ కాళ్లూ కట్టి ఊళ్లోకి తీసుకుని వచ్చారు. బొడ్డురాయిదగ్గర కూర్చోపెట్టి నాలుగు ఉతికారు. ఇంతలో ముసలి టాపీమేస్త్రీల ఒకడు "పళ్లూడగొడితే చేతబడిమంత్రం పారదురా" అన్నాడు. వెంటనే అందరూ చూస్తుండగా, కనికరం అంటూ లేకుండా నాలుగుపండ్లను ఊడబెరికి ఫో వెధవా అన్నారు. దానితో వాడి మంత్రశక్తిపోయిందో లేదో గాని ముందువరుస పళ్లుమాత్రం లేకుండా పోయినవి.

ఇంతకూ ఈ కాశీ విద్యార్థి ఎవరో కనిపెట్టటం భారత ప్రభుత్వం తన విధిగా భావించాలి. ఆశాస్త్రిగారి అడ్రెసు కనుకురాని, ఢిల్లీకి ఆయనను ఆహ్వానించి, ఉపప్రధాని పటేలుగారి సమక్షంలో మరొక చిన్న ప్రయోగం, చేయించి చూచి, సామర్థ్యం ఉన్నట్లు నిర్ణయం అయితే కేంద్రప్రభుత్వపు పాముల కంట్రోలరుగా నియమించాలి. దేశంలో ఉన్న పాముల నిర్మూలనకు ఒక అయిదేళ్ల పథకం ఏర్పరచి, కన్యాకుమారి మొదలు కాశ్మీరువరకు ఫిర్కావారీగా సర్పయాగం చేయించాలి. అందువల్ల జీవనోపాధి పోగొట్టుకునే పాములవాండ్లకు వేరే వ్యాపకాలను కలుగచేయాలి. లేదా పర్మిట్లప్రకారం తలా ఒక పామును ఇవ్వాలి. అప్పుడు ఇంజక్షన్ల ఖర్చులు సర్కారుకు తగ్గిపోయి అనేకమంది ప్రాణాలు నిలబెట్టుకుంటారు. టెలిఫోన్లు మంత్రాలకు గాకుండా మాటలకే ఉపయోగించవచ్చు. అయితే ఒక్క ఇబ్బంది సంభవించవచ్చు. పాములు అన్నీ మాయమైతే కప్పలూ, ఎలుకలూ అతిశయించి పంటలను పాడుచేయవచ్చు. అప్పుడు పాముల కంట్రోలరుశాస్త్రిగారిని కప్పల కంట్రోలరుగా అయిదేళ్లు, ఎలుకల కంట్రోలరుగా మరి అయిదేళ్లు నియమించవచ్చు. ఈలోపుగా ఏ పాములవాడో, ఏలుకలవాడో ఆ కంట్రోలరు పళ్లు ఊడగొట్టకుండా ఉంటే ఫింఛెన్ తీసుకుని మంత్రాలను మనుష్యులమీద ప్రయోగించవచ్చు. ఏది ఏమైనా మనంమాత్రం మంత్రాల గొడవకు పోకుండా ఉందాం. ఏ పుట్టలో వేలు పెడితే ఏ పాము కరుస్తుందో ఎవరికి తెలుసు!

ప్రజాపరిషత్సభ్యులకు కనీసం 25 సంవత్సరాలు, స్టేట్ కౌన్సిల్ సభ్యులకు కనీసం 30 సంవత్సరాలు వయస్సు ప్రమాణం నిర్ణయిస్తూ ఒక సబ్ క్లాజు చేర్చబడింది.

తరువాత పార్లమెంట్ సమావేశం వాయిదా రద్దు మొదలైన విషయాలకు సంబంధించిన 69, 70, 71, 72 క్లాజులు ఆమోదించబడ్డాయి. స్పీకరు, డిప్యూటీ చైర్మన్ మొదలైన పార్లమెంటు ఉద్యోగులకు సంబంధించిన క్లాజులు ఆమోదించబడినాయి.

పార్లమెంటులో సభ్యుల ఉపన్యాసాల్ని పత్రికలు స్వేచ్ఛగా ప్రచురించే విషయమై చర్చ జరిగింది. పార్లమెంటులో సభ్యులిచ్చిన ఉపన్యాసాలకి వారిని కోర్టులో విచారించరాదని 85 వ క్లాజులో చెప్పబడింది. శాసన సభ్యుల వేతనాలు, భత్యాలు, శాసనసభ, కార్యక్రమం, సభల సమావేశాలకు సంబంధించిన 86, 87, 88 క్లాజులు ఆమోదించబడినాయి. ప్రభుత్వ ఆయవ్యయాలకు సంబంధించిన 89 వ క్లాజు ఆమోదించబడింది. 90 మొదలు 99 వరకూ గల క్లాజులపై చర్చ వాయిదా వెయ్యబడింది. న్యాయ విచారణలో ఉన్న విషయాలను పార్లమెంటు చర్చించరాదనీ పార్లమెంట్‌లో జరిగిపోయిన కార్యక్రమంపట్ల అధికారరీత్యా ఆక్షేపణ తెలుపరాదనీ, సూచించే 100, 101 క్లాజులు చర్చ జరుగకుండానే ఆమోదించబడినాయి.

యూనియన్ అధ్యక్షుని అధికారాలకు సంబంధించిన 102 వ క్లాజుపైన దీర్ఘచర్చ జరిగి ఆమోదించబడింది.

రాజ్యాంగపరిషత్సభా కార్యక్రమం ఆగస్టు 15 వ తేదీకి పూర్తికాగలదని అధ్యక్షులు వా॥ రాజేంద్రప్రసాద్ అభిప్రాయం. పరిషత్తు సమావేశమైన మొదటివారంలో 68 మొదలు 89 వరకూ, మొత్తం 22 క్లాజులు ఆమోదించింది

(సూర్యం.

నేటిప్రపంచం

(9 వ పేజీ తరువాయి)

ముట్టారు. కాని వాంగ్‌పూ రేవువద్ద నదిలోని దారిని కమ్యూనిస్టులు అడ్డగించడం ప్రధానంగా ఎంచారు. వాంగ్‌పూవద్దనే చీనా జాతీయ ప్రభుత్వనాకాదళం కేంద్రీకరించబడింది. ఈ నాకాదళాలలో ఒకదళం ప్రభుత్వానికి ద్రోహం చేసి కమ్యూనిస్టుల పక్షానికి తిరిగిపోయింది.

ముట్టడిని పూర్తిచేసి నగరం చుట్టూ కమ్యూనిస్టులు సైనికులతో నింపివేశారు. ప్రభుత్వ విమానాలు నిర్దాక్షిణ్యంగా ఈ సైన్యసమూహంపై బాంబులు వేశాయి. ఆరువేలమంది కమ్యూనిస్టులు చనిపోయినట్లు ప్రభుత్వవార్తాసంస్థ ప్రకటించింది. అయితే ప్రభుత్వవిమానాలు 15 కమ్యూనిస్టులఫిరంగులవాత పడి ధ్వంసమైనాయి. లక్షమంది కమ్యూనిస్టులు ముట్టడి చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. పదకొండు రోజుల ముట్టడి అనంతరం వాంగ్‌పూ నదీతీరంలో జాతీయసైన్యాల మార్గం నిరోధించబడింది. కమ్యూనిస్టులు ఆమార్గాన్ని కూడా ఆక్రమించుకున్నారు. దీనితో షాంఘైదిగ్బంధం పూర్తిఅయింది. షాంఘైనుంచి విమానాలు కూడా పోలేవు.

షాంఘైనగరం మూడులక్షలమంది జాతీయ సైనికులతోసహా ఇంక కమ్యూనిస్టులకు లొంగిపోకతప్పదు. చీనా అంతర్యుద్ధంలో ఇంతటి విజయం కమ్యూనిస్టుల కింతవరకూ లభించలేదు. ప్రపంచంలోకెల్ల పెద్దనగరాలలో నాలుగోది, చీనాలోకెల్ల పెద్దది అయిన షాంఘై పతనంతో జాతీయవాదుల పరాజయం పూర్తి అయినట్లే. దక్షిణరాష్ట్రాల ఆక్రమణ సులువుగా జరిగిపోతుంది. హాంకాంగ్ రక్షణకుమాత్రం బ్రిటిష్ పాలకులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. అయితే బ్రిటిష్ నాకాదళాల్ని కమ్యూనిస్టులు లక్ష్యపెట్టరని యాంగ్సీనదిలో సంఘటనతో తెలిసివచ్చింది. అందువల్ల కమ్యూనిస్టులతో మంచిమాట చేసుకోడానికికూడా బ్రిటిష్ ప్రభుత్వం యత్నిస్తోంది. చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించి వారితో రాయబార వ్యవహారాలు సాగించేది మొట్టమొదట బ్రిటిష్ ప్రభుత్వమే కావచ్చుననీ, అందుకు ముందే సిద్ధమౌతున్నదనీ తెలుస్తోంది.

బర్మాకు ముప్పు:

బర్మాప్రభుత్వం ఒకవైపున కరేన్లు కమ్యూనిస్టుల తిరుగుబాటునూ, మరొకవైపున అరకాన్ ముస్లింల తిరుగుబాటునూ ఎదుర్కొంటుండగా ఉత్తరాన చీనాకమ్యూనిస్టులు మరొక ముప్పు తెచ్చిపెడుతున్నారని ప్రకటించారు. యూనాన్ రాష్ట్రంలోని కమ్యూనిస్టులు బర్మా ఈశాన్య సరిహద్దులో చేరినట్లు చెప్పారు. వారి నెదిరించడానికి కచిన్ రాష్ట్రంలో ప్రభుత్వ సైన్యాలు సిద్ధపడుతున్నాయి. యూనాన్ కమ్యూనిస్టులు బర్మా కమ్యూనిస్టులతో కలవకుండా చెయ్యవలసి ఉంది. బర్మాప్రధాని థాకిన్‌నూ త్వరలో లండన్ వెళ్లనున్నాడు. బ్రిటిష్ ప్రభుత్వంతో సమాలోచనలు జరిపి బర్మా ప్రభుత్వానికి సహాయం తెచ్చుకోడానికి యత్నించనున్నాడని వార్తలు వచ్చాయి. లండన్ వెడుతున్నాడని తెలుసుకున్న కరేన్లు వెంటనే చిక్కిన ప్రాంతంలో ప్రత్యేక కరేన్ రాజ్యం స్థాపించినట్లు ప్రకటించారు. రంగూన్‌కు 93 మైళ్లు ఉత్తరానఉన్న నాంగ్లెచినో నుంచి ఈ ప్రకటన వెలువడింది. రంగూన్ మాండలే రైల్వేకు తూర్పున దిగువ బర్మాలో కొద్ది ప్రాంతమే వారి అధీనంలో ఉన్నప్పటికీ డైకూ, టాంగూలమధ్య గల కేంద్రబర్మాఅంతా కరేన్ రాజ్యానికి చెందాలని వారు ప్రకటించారు. అరకాన్ దాదాపు అంతా ప్రభుత్వాధీనంనుంచి పోయిందని చెప్పవచ్చును. కరేన్ల తిరుగుబాటుకీ, అరకాన్ ముస్లింల తిరుగుబాటుకీ బ్రిటిష్ తంత్రజ్ఞులే మూలకారకులని అందరికీ తెలుసు. కరేన్ల ముఖ్యకేంద్రాలలో ఒకటైన ఇన్సీన్ ఆదివారంనాడు ప్రభుత్వాధీన మయింది. కరేన్ సైనికులు, నాయకులు ఇన్సీన్‌నుంచి పారిపోయారు. వీరితోపాటు వీరికి తోడ్పడిన బ్రిటిష్ సైనికాధికారి ఒకడు కూడా పారిపోయాడు. కరేన్లకు ఆయుధాలు సప్లై చేసినవారిలో ఇతనొకడు. ఇతనికి బర్మాప్రభుత్వం ఇదివరలో ఖైదువిధించి ఇన్సీన్‌లో బంధించింది. కరేన్లు ఇన్సీన్‌ను ఆక్రమించుకొన్నప్పుడు అతన్ని విడిచిపెట్టారు. అప్పటినుంచీ అతను కరేన్లకు తోడ్పడుతూనే ఉన్నాడు.

బర్మాలో పరిస్థితి చాలా విషమంగా ఉంది. యూనాన్ కమ్యూనిస్టులు దాడిచేసే పక్షంలో బర్మాప్రభుత్వం అంతమయ్యేమాట తథ్యం.

(సూర్యం.

మద్రాసు మంత్రివర్గ మంత్రాంగాలు

శ్రీ మానిరాజు సత్యనారాయణరాజు

మద్రాసు సెక్రిటేరియటు ఆఫీసులో పని యుండి మద్రాసు వచ్చాను. సెక్రిటేరియటుకు వెళ్ళాను. పని చూచుకొని శాసనసభ్యులుండే గవర్నమెంటు హౌసుకు వెళ్లాను. పూర్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి చిహ్నంగా బ్రిటిష్‌గవర్నర్లు ఈభవనంలోనే నివసిస్తూ యుండేవారు. రాష్ట్రంలో ప్రజానాయకుల పరిపాలన రాగానే, ఈ భవనాలన్నీ ప్రజాప్రతినిధుల పర మయ్యాయ్.

ఏమిటో! గవర్నమెంటు హౌసులో గవర్నరు లేకపోయినా, గదులన్నీ గడబిడా నున్నాయి. ఎక్కడ చూచినా శాసనసభ్యులే! గుసగుసలే! గుంపులూ, గ్రూపులే!

ప్రజాప్రతినిధులు ప్రజాపరిపాలనలో ప్రజల కోసం ఆలోచనలతో బుర్రలు వేడెక్కించుకొని ఎంత పాటు పడుతున్నారో - పాపం - అని అనుకున్నాను.

అయినా, విషయ మేమిటో తెలుసుకుందామని నెమ్మదిగా నేనుకూడా ఒక గుంపువద్దకు చేరాను.

ఒక ప్రముఖ ఆంధ్రసభ్యుణ్ణి కలుసుకొని మాట్లాడాను. ఏమిటీ హడావిడంతా! అన్నాను.

ఏమీలేదు - లీడరు ఎన్నిక అన్నారు. లీడరు ఎన్నికయితే యింత బుర్రలు బ్రద్దలయ్యే ఆలోచనలు ఎందుకూ! ఇప్పుడు రామస్వామి రెడ్డియారుగా రున్నారు కదా! అన్నాను.

"అబ్బే-అలా గాదు. రెడ్డియార్ గారు కొందరి అభివృద్ధికి అడ్డు వచ్చాడు. రెడ్డియారు కొందరితో మాట్లాడుతాడు - కొందరు శాసనసభ్యులతో అసలు మాట్లాడడు. పోనీ, మంత్రులతోనైనా మాట్లాడుతాడా అంటే కొందరితో అసలు మాట్లాడేవాడు కాదు. అల్లాంటివాళ్లు పోతేనే గాని సంజీవరెడ్డిగారిలాంటి క్రొత్తమంత్రుల కవకాశము రాదు" అని అన్నాడాయన. ఇవిగాక, రెడ్డియార్‌లో దుమ్మెత్తిపోసే దుర్గుణ మేదైనా యుందేమో అంటే మచ్చుకైనా కంచుకాగడా వేసి వెతికినా కనుపించదు కదా! అని అనుకున్నాను. "ప్రతిసంవత్సరం ఈ లీడరుఎన్నిక తద్దిన మేమిటి? ఈ పద్ధతి మారాలని మీరు అభిప్రాయం పడుటలేదా?" అని అన్నాను.

"అవును, పద్ధతిమాత్రం మార్చవలసిందే" అన్నాడా పెద్దమనిషి.

"అయితే, మంత్రుల సెలక్షన్ ఏ పద్ధతిమీద ఆధారపడియుంటుం దంటారు?" అని మళ్లీ అడిగాను.

"యింత చిన్న విషయంకూడ చెప్పాలా! నాయకుని యిష్టప్రకారం జరుగుతుందని" అన్నారు.

"అయితే, మంత్రుల ఎన్నికలో, సమర్థత గలవారికా, సేవాభావము కలవారికా, దేనికి ప్రాముఖ్యత నిస్తారు?" అన్నాను సమాధానం కోసం ఆయన మొగంవైపు చూస్తూ.

"మీ రెవరో ఆధునిక రాజకీయపు టెత్తులు తెలియని అమాయకులైనా అయియుండాలి, లేక పటాటోప మెరుగని పల్లెటూరివారైనా అయియుండాలి. లేకపోతే, ఈ రోజుల్లో ఎవరికి కావాలండీ?" అని అన్నాడు చిరునవ్వుతో. అదుగో - ఆ గుంపులోనే కాబోయ్యే కొందరు మంత్రు లున్నారని మనవా రనుకొంటున్నా రంటూ వ్రేలెత్తి చూపించాడు.

"ఎవరీ మనవారు?"

గవర్నమెంటు హౌసులో ఎక్కడ చూచినా ఆంధ్రుల హడావిడే. ఏగుంపు చూచినా ఈ తెలుగువాళ్లే. రెండురోజులు గవర్నమెంటు హౌసులో మకాం చేసేటప్పటికి శాసనసభ్యులకంటె ఎక్కువగా నా బుర్ర వేడెక్కిపోయింది. రేపు రాబోయే ఆంధ్రరాష్ట్ర నిర్మాతలున్నూ, ఆంధ్రరాష్ట్ర భావిరాజ్యాంగ నిర్మాతలున్నూ వీరేనా అనిపించింది.

అంతలో తల పైకెత్తి చూచేటప్పటికి అక్కడ గుంటూరు కృష్ణాజిల్లాల శాసనసభ్యులు కనబడ్డారు. ఏమిటో - గుసగుసలాడి ఎక్కడికో బర్రున కార్లపై పరుగెత్తారు.

నేను మళ్ళీ నాకు పరిచయమైన పెద్దమనిషి వద్దకు వెళ్ళాను. "ఏమండీ! ఆంధ్రరాష్ట్రం సంగతి ఏమి ఆలోచిస్తున్నారు మనవారంతా?" అని అన్నాను.

"ఆంధ్రరాష్ట్రం ఎవరికి కావాలండీ! అంతా మంత్రుల మంత్రాల గడబిడలోనుంటే?" నన్నారు.

అక్కడనుండి బుర్ర గోక్కుంటూ రెండడుగులు ముందుకు వేసేటప్పటికి కొందరు హరిజనులు, రైతుకూలీ నాయకులు, సేవకులు కనబడ్డారు. పలకరించిచూశాను. "కూర్మయ్యగారిని ఎందుకు తీసివేశారు నూతనమంత్రివర్గంలో?" నన్నాను.

"ఏం చెప్పము బాబూ! యిదంతా ఒక పెద్ద కుట్రలా గుంది చూస్తూన్న కొలదీ. కూర్మయ్యను తీసివేస్తే, గుంటూరు అరుణారావు గారిని రప్పించి మంత్రిగా తీసికొనవచ్చు నని వేసిన ఎత్తు యిది. చివరకు ఇది పోయింది - అదీ రాలేదు. ఇంతవరకు వచ్చిన ఆంధ్ర హరిజనమంత్రిపదవి ఈ ఎత్తుతో కుక్కముట్టుకుపోయింది.

"సరే. అయితే, ముందు నియమించబోయే మంత్రుల సంతి ఏమి"టన్నాను.

"అదిగో - చూశారూ! కార్లపైనా టాక్సీలపైనా గుంపులు గుంపులుగా పట్టాభిగారివద్దకు, కుమారస్వామిరాజావద్దకు వెళ్లివస్తున్నారు వీరంతా! వీరిలో ఏ ఒక్కరికీ నీతి, నియమం లేదు. ఒకసారి విశ్వనాథంగారివద్దని పల్లంరాజుగారిని కావాలంటారు. కొంచెంసేపు మూర్తిగారుండా లంటారు. అంతలోనే మళ్లీ కాశేశ్వరావుగా రంటారు.

ఈ రచ్చ, అల్లరి ఒక్క తెలుగువాళ్లలోనే తప్ప, అరవవారిలో ఆవగింజంతైనా కనుపించదు. గ్రూపు లుంటా యనుకోండి పోనీ! ఈగ్రూపులోనైనా మనవారి కొక నియమం లేదు. పార్టీలో మరొక పార్టీ గ్రూపు. ఒకే కులంలో మరొక చిన్న గ్రూపు. జిల్లాలలో అక్కడ రాజకీయాలనుబట్టి అదో గ్రూపు. ఈలా గున్నాయ్ మన వాళ్ల రాజకీయాలు. వీరి ఆలోచనలూ, తెలివితేటలూ, తమతమ స్నేహితులకు మద్రాసు ప్రభుత్వంలో ఏవో కొన్ని పనులు చేసిపెట్టి, చేయించుకోవడమే తప్ప, వీరిలో ఎవరిలోనూ ఆంధ్రరాష్ట్రసమస్య, ఆంధ్ర ఆర్థికాభివృద్ధి మొదలైన విషయము లాలోచించుటకు వీరికి పట్టలేదు" అని అన్నారు. ఎదురైన పెద్దమనుష్యులు పెద్దనిరాశాభావాన్ని వెల్లడిస్తూ—

"ఈ వేళ ఈ సభ్యుడు మన వాడనుకొని మా కార్లలో త్రిప్పుకొంటా మనుకోండి. రేపు ఉదయానికల్లా ప్రతిపక్షగ్రూపువారి కారులో యితడు కనిపిస్తాడు. ఈలాగే అందరి వరుసాను. వీరిలో ఎవరిని నమ్మేదీ, ఎవరిని నమ్మకూడనిదీకూడా తెలియడంలేదు" అని వారిలో ఒకరన్నారు.

"అంతలో ఆంధ్రశాసనసభ్యులకు. నాయకుడెవరండీ?" అని అన్నాను. అక్కడున్న వారంతా తెల్లబోయి ఒకరి మొగా లొకరు చూచుకోవడం మొదలుపెట్టారు. తమ నాయకుడుగ ఎవరిపేరు చెప్పాలో వారికే అర్థం అయినట్లులేదు. చివరకు వారి కొక "నా"అనే నాయకుడు ఎవడూ లేనట్లుగా కనిపించింది.

అంతలో మరొకాయన అందిపుచ్చుకొని ఆంధ్రనాయకు డన్నారు కాబట్టి మాట వరుసకి చెబుతున్నాను.

"శాసనసభలో ఆంధ్రనాయకు డెవరో మాకు తెలియనిస్థితిలో నున్నా మనకోండిపోనీ, రాకరాక వచ్చిన రాష్ట్రపతి డా॥ పట్టాభి నాయకత్వమును గురించి ఒక్కమాట వినండి. డా॥ పట్టాభిమేధాసంపన్నతకు ఉత్తరదేశస్థులంతా ఆయననూ పొగడుతూంటే, మనం మనవాడినే తీసిపార వేసినట్లుగా మాట్లాడుతూ, ఆయన ముఖం ఎదుటే, ఆయన చెప్పినదానిని ఖండిస్తున్నాం. ఈలాంటి పరిస్థితులలో ఆంధ్రులకు నాయకు డంటూ ఒకడు కూడానా! నిజం చెప్పవలసివస్తే, ఆంధ్రులకు తమ నాయకుని గౌరవించుకొనడం తెలియదు" అని అన్నారు.

తమిళనాడులో నాదారుపేరు చెప్పేసరికి తమిళదేశస్థులంతా శాసనసభ్యులతోసహా ఒక్క త్రాటిపైన నిలబడతారు. ఓడిపోయిన డా॥ సుబ్బరాయన్ మౌనముఖమును చూచి "వానితో విరోధం మనకేమి అపకారం చేస్తుందో"నని తమిళులంతా గడగడలాడుతునేయుంటారు-ప్రతిపక్షనాయకుడైనా సుబ్బరాయన్. ఏమైతేనేమి, మొత్తంమీద తమిళులంతా ఒకత్రాటిపై నిలబడి రాష్ట్రాన్ని తమ చెప్పుచేతలలో నుంచుకొన్నారు. వారి కార్యశూరత్వమూ, నిపుణతా, నాయకునిమీద భక్తి, వారిలోని సమైక్యత చూస్తే ముచ్చటవేసింది. ఇవన్నీ ఆంధ్రుల కెప్పటికి కలవడతాయో కదా! అని అనుకొని ఇంటిమొగం పట్టాను.

రష్యా రైతుజీవితం

(6-వ పేజీ తరువాయి)

చేతనే మేరియా, ఆమె తల్లీ కొద్దిగానే రొట్టె తిని బంళాగాదుంపలు, కాయగూరలు యెక్కువ తినెదరు.

నిరుటిసంవత్సరం యివాన్ కుటుంబము తమ సంపాదనలో 1000 పౌనులు బంగాళాదుంపలు, కూరగాయలు బజారులో అమ్ముకొని, మాంసము కొనుక్కొనేటందులకు మిగల్చగలిగినారు. యుద్ధకాలంలో బంగాళాదుంపలు ధర పౌను 8 నుంచి 10 రూబుల్సువరకు అమ్మెడిది. కాని ప్రస్తుత బంగాళాదుంపల ధర 1 నుంచి 1.5 రూబుల్సుమాత్రమే. యివాన్ తన 1000 పౌనులు బంగాళాదుంపలు, కాయగూరలు కలసి 1300 రూబుల్సుకు అమ్మితే తాను తక్కువ రకం మాంసము 95 పౌనులుమాత్రమే కొనగలడు. ఈ 95 పౌనులమాంసమే తన కుటుంబానికి సంవత్సరంపొడుగునా సరిపోవాలి.

అదృష్టవశాత్తు యివాన్‌కు ఒక ఆవు, రెండు పందులు, కొన్ని కోడిపిల్లలు యున్నవి. ఇంకా యెక్కువ పశువులను కొని మేపవలెనంటే గవర్నమెంటు నిబంధనల ప్రకారం తనకు వచ్చే పశుగ్రాసం చాలా తక్కువ. పోనీ పశుగ్రాసము కొని మేపుదామంటే చేతిలో డబ్బు తక్కువ. ఎలాగునైననూ ఏమాత్రము పశువులు లేని తన తోటి రైతులకంటె యివాన్ అదృష్టవంతుడు.

ఇవాన్ కుటుంబంలో పనిచేసిన నల్గురి సంపాదన మొత్తంలోను వారి జీవితావసర వస్తువులన్నీ కొనుక్కొనవలెను. పంటలు పాడైపోయిన సంవత్సరంలో అతని రాబడి పూర్తిగా తగ్గిపోతుంది కాని గవర్నమెంటుకు చెల్లించవలసినవి పూర్తిగానే యుండును. జీవితావసరవస్తువుల గిరాకీవల్ల తను సంపాదించే 1500 రూబుల్సు చాలా నిక్కచ్చిగా వాడుకొనవలసివస్తుంది. ఇవాన్ యిప్పటికీ, తన పాతమిలిటరీ దుస్తులనే ధరించుచున్నాడు. అతనికి ప్రస్తుతం కాలిబూట్లుజత అవసరం. అయితే యిప్పుడు పురుషులు ధరించే బూట్ల ధర 228 రూబుల్సు. యివాన్ పిల్లలుగూడ పెద్దవాళ్లగుచున్నారు. వారికిగూడ యివాన్, మేరియాలకు వలెనే కాలిజోళ్లు కావాలి. వీ రందరిల నాల్గుజతల కాలిజోళ్లు కొనవలసివచ్చినయెడల తనవద్ద నున్న రూబుల్సు అన్నీ తుడుచుకొని పోతాయి.

యుద్ధపురోజులలో ఆహారపదార్థముల ధరలు యెక్కువగా పెరిగిపోయినందువలన, కొన్ని సరుకులు మేరియాఅమ్మి డబ్బు నిల్వచేసుకున్నది గాని గవర్నమెంటు 1947 సం॥రపు నాణెపు సంస్కరణ క్రింద పాతరూబులుకు క్రొత్త రూబుల్సు పది యిస్తామని చెప్పి నిర్బంధవసూలు చేసింది. అందువలననే మేరియా యితర స్త్రీలవలె తనుకూడ వేసవికాలములో జోడులేకుండా గడపవలసివచ్చెను. అందువలననే యివాన్‌కుటుంబం చాలా కష్టంగా గడుపవలసివచ్చుచున్నది.

వారికి ఆటసమయాలు, తీరుబడిరోజులు తక్కువే. రైతుల నిమిత్తం వ్యవసాయశాఖవారి హోటల్సు వున్ననూ యు. యస్. యస్. ఆర్‌లోని తక్కిన వ్యవసాయకూలీలకు వలెనే వీరికి అందులో ప్రవేశం చాలా తక్కువ. ఈ హోటల్సుకువెళ్లవలెనన్నా అందు రేట్లుచాలాయెక్కువ.

సంఘంలో కలసిమెలసి వుండుటకు అవకాశాలు చాలా తక్కువ. ప్రభుత్వం సహకార వ్యవసాయం గూర్చి ప్రచారం చేయవలసియున్నను, అది రాజకీయముల గురించియే యెక్కువ ప్రచారం చేస్తుంది. గ్రామంలోవున్న చిన్న క్లబ్‌లో ఒకటి రెండు పాడిపంటల పత్రికలు, కొన్ని రాజకీయ కరపత్రాలు, యెక్కువగా లెనినిజమ్, స్టాలిన్‌గురించి వున్న పుస్తకములే వుండును.

మీటింగులు చాల తక్కువగా జరుగుతూ వుండును. అథవా అప్పుడప్పుడు జరిగినా అందు ఛైర్‌మేన్‌గాని, మరి యితర ప్రభుత్వోద్యోగులుగాని వుపన్యసించునదంతా తమ పార్టీ నిమిత్తం, స్టాలిన్, రెడ్ ఆర్మీల నిమిత్తం యెక్కువ పంటలు పండించమని చెపుతూవుంటారు. రోజస్తమానూ కష్టించి పని చేసిన యివాన్ మీటింగులకు హాజరై మౌనంగా కూర్చోవలెను. ఛైర్‌మేన్ ఎన్నికల కాలములో ఎన్నుకొనవలసినది యివాన్‌వంటి రైతే అయినను సాధారణంగా ప్రభుత్వోద్యోగులు కలుగజేసుకొనెదరు. గ్రామంలో వున్నటువంటి-చిన్న పాత చర్చి ప్రస్తుతంగవర్నమెంటు వేర్‌హౌస్‌గా వుపయోగించబడుచుండుటవలన ఏదైనా తీరుబడి వేళలో చర్చికి వెళ్లవలెనంటే "రెడ్ అక్టోబర్"కు ఆరుమైళ్లదూరమున వున్న మరో గ్రామమునకు వెళ్లవలయును. ఆ చర్చివున్న గ్రామంలో కలెక్టివ్ ఫారం తాలూకుసంతలు జరుగుచుండుటవలన మేరియా తన సరుకుల నమ్మి మాంసం కొనేటందుకు వెళ్లినపుడు చర్చికి వెళ్ళును.

రెడ్ అక్టోబర్‌కు ఎలెక్ట్రిసిటీ లేనందువలన రేడియోలు లేవు. ప్రభుత్వం యీ మధ్యనే గ్రామాలకొరకు బేటరీసెట్లు తయారుచేయుట ప్రారంభించినది. కాని ఆ బేటరీసెట్లయిననూ ఫారంయొక్క పెద్ద వుద్యోగస్థులకు ఒకటిరెండు మాత్రమే అందజేయును. ఈ రేడియోలద్వారా శ్రోతలు కోరిన స్టేషనులనుండి ముఖ్యముగా విదేశవార్తలు వినుటకు వీలులేకపోయిననూ గవర్నమెంటు ఏర్పరచిన స్టేషనునుండి దేశవార్తలు వినుటకు శబ్దవిస్తరణ యంత్రములు ఏర్పరచినారు. ఈ శబ్దవిస్తరణయంత్రాలయిననూ గ్రామంలో గాక క్లబ్‌లోమాత్రమే ఒకటి వుండును. దీనిద్వారా ప్రజలు వ్యవసాయం గూర్చి, యెక్కువగా రాజకీయములగురించి వింటూవుంటారు.

వైద్యసహాయం

రెడ్ అక్టోబర్‌వంటి చిన్నచిన్న గ్రామములలో వైద్యశాలలు లేవు. అందువలన రోగులెవరయినను అచ్చటకు యిరవైమైళ్ళు దూరముగా వున్న మరో చిన్నపట్టణమునకు పాడుపడిన రోడ్లమీద ప్రయాణించివెళ్ళవలెను. డాక్టర్లవద్ద చాలినన్ని పరికరాలు లేకపోయినను రోగులు చాలామంది వుండెదరు. అవి అంత అర్జంటు కేసులు కాకపోయినచో కొన్నిగంటలు వేచియుండవలెను. దురదృష్టవశాత్తు అచట వుండే పరికరాలు చాలా తక్కువయగుటచే సాధారణ చికిత్స మాత్రమే చేయవలసివచ్చును.


ఈ రోజున యివాన్ పరిస్థితి మిగతా "బెద్న్యాయిక్"(బాగా బీదరైతు) కంటె మెరుగే కాని పూర్వపురోజులలో కష్టించి పనిచేసిన దానికి పొందే ప్రతిఫలంకంటె తక్కువయే.

విప్లవము వచ్చినతరువాత వ్యవసాయయంత్ర పరికరములలో మార్పు వచ్చినను, కడచిన ముప్పైసంవత్సరములనుండి యివాన్ దృష్టి పట్టణ పారిశ్రామికుని వైపునకే పోవుచున్నది. తను ఖరీదుచేసుకొనే వాడుకసామానుల ధరలు విపరీతముగా పెరిగిపోయి, గవర్నమెంటు నిబంధనలప్రకారం తాను అమ్మే వ్యవసాయ పంటల ధరలు తక్కువగా యుండుటవలన మితవ్యయ మనే కత్తెరలో పడి నలిగిపోతున్నాడు యివాన్. ఇవాన్, తనూ, తనభార్య పరిస్థితులు బాగుపరచుకొనుటకు ఇవాన్ యిక ఏమంత పడుచువాడు కాడు. ఇకనుంచి తనుకష్టించుటెక్కువ, రాబడి తక్కువ యని యివాన్‌కు తెలును.


(న్యూయార్కు టైమ్సు మేగజైన్‌నుండి)

అనువాదం :


శ్రీ చలంచర్ల గున్నేశ్వరరావు



రెండంతస్థుల గుహ



బౌద్ధదేవాలయము



శిథిలావస్థను పొందుచున్న దాని ప్రాంగణమునందలి యద్భుతశిల్పములు

కన్హేరీగుహాలు: భారతీయ శిల్పములు

'జగన్మోహన్'

(ఛాయాచిత్రములు రచయితవే)

బొంబాయినగరమునకు 20 మైళ్ళ (*Bge B B C. I. Rly*) దూరంలో బోరివ్లీ అను ప్రాంతము గలదు. అచటనుండి నూత్నముగ ప్రభుత్వమువారిచే నిర్మింపబడుచున్న మహాత్ముని స్మృతిచిహ్నము—*Gandhi National Park* రెండుమైళ్ళు గలదు. ఆ నూత్నవిహారవనమునుండి 8 మైళ్ళదూరము 3 కొండలు ఎక్కి దిగుచు, వెదురుఅరణ్యములగుండా పోయిన తదుపరి కన్హేరీశిల్పములుగల పర్వతమును చేరుదుము.

పర్వతమును సగమువరకును అధిరోహించిన తదుపరి ప్రభుత్వమువారిచే నెలకొల్పబడిన ఛాయాచిత్రగృహము కాన్పించును. అచ్చటనుండి పర్వతమును చుట్టుచు 200 గుహ లున్నవి. అందు ప్రస్తుతము చూచుటకు వీలుగ ప్రభుత్వము తయారుజేసినవి 101 మాత్రమే. అనగా ఇంకను సుమారు 100 తెలుసుకొని బాగుచేయవలసి వున్నవి (*to be excavated*). అదియును చాలాదూరమునుండి కానవగును.

ఈ గుహలు అత్యద్భుత శిల్పచాతుర్యముతో నిండియున్నవి. ఇవి బౌద్ధభిక్షువులచే నిర్మింపబడినవిగా నూహింపనగును,


ప్రతిదానియందును ఒక గొప్ప బౌద్ధవిగ్రహము కాన్పించును అది పూజాగృహము. తదుపరి 1 లేక 2 గదులు ఒక విశాలమైన చావడియున్నవి. గుహలు సామాన్యముగ చదరముగ నుండి, వెలుతురు చాలవరకు వ్యాపించుటకు సావకాశము గల్గియున్నవి. ప్రతి గుహకును ముందు భాగమున మంచినీరు లభించు కుండములు గలవు. ఇవి ఆ గుహయందు నివసించువారలకు సంవత్సరము పొడవునను సరిపోవు నీరును గల్గియున్నవి. ఇందుజలము చేరుచుండుటకు కుండపైభాగము నుండి గొప్ప తెలివి నుపయోగించి నిర్మించిన భూగర్భ మార్గములు గలవు. అందు చేరు నీరు వర్షపు నీరే అయినను అది దారులలోనే పరిశుభ్రతనొంది వచ్చును. ఇటువంటి గుహలు 80 గలవు కాని ప్రతిదానియందును ప్రత్యేకత గల్గిన శిల్పచాతుర్యము కానవగును. ఇవి కాక కొన్ని, పెద్ద వరండా, ఒక గది ఒక బౌద్ధవిగ్రహం గల్గి గోడలవద్ద కూర్చుండుటకు కాను మట్టునూ బల్లలవలె చెక్కబడియున్నవి. వీనిని పాఠశాలలుగా నెంచనగును. అచ్చటచ్చట ఆకాలమందలి భాషలో ఏమేమియో వ్రాసియున్నారు. అయినను ప్రయత్నించి వాటి స్వరూపమును విక్టోరియా - ఆల్బర్టు మ్యూజియమునందలి వివిధభాషల వివిధకాలములయందలి స్వరూపములతో పోల్చగా చాళుక్యకాలమందలి తెనుగువలె కాన్పించెను. అయినను నేను దానిని విశ్వసించజాలను.

ఇక కొన్ని బౌద్ధ స్తూపములు, బౌద్ధభిక్షువులయు, బుద్ధునియు విగ్రహములు గలిగియున్నవి. ఇవి చాల విశాలముగను, అందముగను, పెద్దవిగను అంతయు శిల్పముతో గూడి యున్నవి. వీటిని వారల ప్రార్థనామందిరములుగ నెంచవగును. అన్నిటికన్న ఇవి యెక్కువ శోభగ నున్నవని రూఢిగ చెప్పవచ్చును.


ఇవియే కాక పెక్కు యితర రకములుగ గాన్పించుచున్నవి—కాని యించుమించుగ పూర్తి శిథిలావస్థలో!

ఈ ప్రాంతములో చాల యితర గుహలుగ ఉన్నవి. కాని దుర్గమారణ్య పర్వత సీమలలో నుండటం జేసి వీటిని జేరుపథికులు బహుస్వల్పముగ నుందురు. యిచ్చటనే వన్నెకెక్కిన కార్లా, ఎలిఫెంటా గుహలును వున్నవి.


ప్రపంచంలో మరి యెచ్చటను యిటువంటి శిల్పములు కానరావు. హిందూదేశముమాత్రమే ఈ ప్రత్యేక శిల్ప చాతుర్యములు గల్గియున్నది ప్రభుత్వమువారు వాటిపై తగిన శ్రద్ధతో శ్రొత్తవి కనుగొని, వాట్లకు తగిన ప్రయాణ సౌకర్యము లేర్పరచి ప్రఖ్యాతిగొనివచ్చిన, తప్పక స్విడ్జర్లాండ్ లోవలె వాటిపై హిందూదేశము ఖ్యాతినే గాక చాల ధనమునుగూడ పొందగలదు.



దూరమునుండి కొన్ని గుహలు



బౌద్ధస్తూపము



ఒక నివాసగుహప్రాంగణము

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.